ప్రజలే ప్రభువులు

# జనబలం

అక్టోబర్ 2022 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




## మోదీ @ 20: ముందున్న సంస్కరణలు



## చికాగో ప్రసంగానికి 129 ఏళ్లు







## అధిక వర్షాలు - వరద నదులు - ముంపు నగరాలు



# ఐడియాస్ ఆఫ్ ఇండియా: పొలిటికల్ ఎకానమీ

స్వేచ్ఛా మార్కెట్ పంథాలో విధానాల రూపకల్పన, అవగాహన, అమలు కోసం స్వచ్ఛందంగా కృషి చేసే ఉదారవాద థింక్ ట్యాంక్ మెర్కటస్ సెంటర్ (జార్జియా మేసన్ యూనివర్సిటీ) ఆధ్వర్యంలో 'ఐడియాస్ ఆఫ్ ఇండియా: పొలిటికల్ ఎకానమీ'పై ఇటీవల గోవాలో జరిగిన మూడు రోజుల సదస్సులో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్







ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 | సంచిక 10 | అక్టోబర్ 2022

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి డబ్బుల్లేవయ్యా..
కాలం కలిసొస్తుందేమోనని లాటరీ టికెట్లు కొన్నా!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఓట్ అండ్ షాట్. ప్రజాస్వామ్యం అంటే ఇదేనా?

మన ఘనమైన భారత గణతంత్ర రాజ్యంలో స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇటీవలే ఆజాదీ కా అమృతోత్సవాలను జరుపుకున్నాం.

1952 మొదటి సార్వత్రిక ఎన్నికల నుండి ఇప్పటివరకు దేశంలో జరుగుతున్న ప్రతి ఎన్నికలో కొందరు క్రమం తప్పకుండా ఓటు వేస్తుంటే మరికొందరు నిరాశ నిస్పృహల్లోకి జారుకుని అసలు ఓటు వేయడమే మానుకున్నారు. ఇక ఓటు వేసేవారు తమ ఓటు ఏదో ఒక పార్టీకో లేక అభ్యర్థికో వేసి ఆ తర్వాత తమ ఓటు ద్వారా ఏర్పడిన ఆ ప్రభుత్వాలనే ఎన్నుకున్న మరునాటి నుండే దిగిపొమ్మని ఆవేశంతో అరుస్తున్నారు. దీన్నే ఓటు వేయడం తర్వాత అరవడం "ఓట్ అండ్ షాట్" అని అంటారు.

ఈ పరిస్థితికి కారణాలు ఏమిటి అంటే మహాభారతంలో కర్ణుడి చావుకి ఎన్ని కారణాలో అన్ని కారణాలు చెప్పవచ్చు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనే మనకి కుల, మత, భాషా, లింగ బేధాలు లేకుండా దేశంలోని వయోజనులైన పౌరులకు సార్వజనీన ఓటు హక్కు ఉద్యమించకుండానే అప్పనంగా వచ్చింది. అదే ఓటు హక్కు కోసం ప్రపంచవ్యాప్తంగా వందల సంవత్సరాల పాటు అనేక ఉద్యమాల తర్వాత కానీ ఇలా సార్వజనీన ఓటు హక్కు లభించలేదు. అందుకే కష్టపడకుండా వచ్చిన ఫలితాన్ని వాడుకునే పరిణతి మన ప్రజలకు లేకుండా పోయింది. ఇక రెండవ కారణం మనం వేసే ఓటుతో ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి, మనం చెల్లించే పన్నులతో ప్రభుత్వాలు నడుస్తున్నాయి అనే స్పృహ ప్రజలకు కల్పించడంలో రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. మన ప్రజాస్వామ్యం రోజురోజుకు మరింత ఖరీదయిపోతోంది, రాజకీయాల్లో "మనీ అండ్ లిక్కర్ పవర్" రోజురోజుకీ పెరుగుతోంది, ప్రతి ఎన్నికలో డబ్బు, మద్యం ఏరులై పారుతోంది.

ఏనుగంత సమస్య ఎదురుగా పెట్టుకుని మన రాజకీయ పార్టీలు, నాయకులు ఒకరినొకరు దూషించుకుంటూ సమాజంలో పలుచన అవుతున్నారు. ఒక పవిత్రమైన వ్యాసంగంగా ఉండాల్సిన రాజకీయం మోసం, ద్వేషం, అవినీతి అనే పదాలకు పర్యాయపదంగా మారింది. అందుకే రాజకీయాలను చాలా మంది ద్వేషిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి రాజకీయాల్లోనే మూలాలు ఉన్నాయని ఆ రాజకీయాల తీరుతెన్నులు మారితే తప్ప తమ సమస్యలు పరిష్కారం కావనే పచ్చి నిజాన్ని పాలకులు ప్రజలకు అర్థం కాకుండా ఒక బ్రహ్మ పదార్థంగా మార్చారు. సామాన్య జనం పరిభాషలో చెప్పాలంటే "జిలేబిగా చక్కర్" గా చేశారు. ఈ విషవలయంలో ప్రజలతో పాటు పార్టీలు కూడా పడిపోయాయి. ఈ సమస్యకు పరిష్కారం లేదా అంటే ఉందనే చెప్పవచ్చు. కానీ "పిల్లి మెడకు ఎవరు గంట కట్టాల"నే విషయంలోనే తర్జనభర్జన జరుగుతోంది.

మొదటగా ప్రజాస్వామ్య స్ఫూర్తిని మనం అర్థం చేసుకుంటే ప్రజాస్వామ్య మూల సిద్ధాంతాల వైపు వెళ్ళాలి. మొదటిది స్వేచ్ఛ, రెండవది ప్రజల నిర్ణయాధికారం, మూడవది ప్రజల భాగస్వామ్యం, నాలుగవది చట్టబద్ధ పాలన, ఐదవది స్వయం దిద్దుబాటు. ఈ ఐదింటి మీద ప్రజాస్వామ్య సౌధం నిలబడుతుంది. కానీ రోజురోజుకు రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించడంతో ఒక్కొక్క స్తంభం కూలిపోతోంది. అందుకే వ్యవస్థాగత పరిష్కారాల పై దృష్టి పెట్టకుండా వీటికి కాయకల్ప చికిత్స చేస్తున్నారు.

మన ప్రజాస్వామ్యానికి అసలైన శస్త్ర చికిత్స కావాలి. ప్రజాస్వామ్య పాలనా సంస్కరణతో పాటు రాజకీయ, ఎన్నికల సంస్కరణలు రావాలి. "ఓటు మనది పన్నుల డబ్బు మనది" అనే స్పృహ ప్రజలకు వచ్చినప్పుడే ధన రాజకీయం స్థానంలో జన రాజకీయం వస్తుంది. ప్రజా చైతన్యానికి క్రియాశీల పౌరులే నడుం కట్టాలి. అప్పుడే మార్పు అనివార్యమవుతుంది.

-బండారు రామ్మోహనరావు

# మోదీ @ 20: ముందున్న సంస్కరణలు






గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా వరుసగా అధికారంలో కొనసాగుతూ వస్తున్న నరేంద్ర మోదీ ప్రస్థానంపై 'మోదీ @ 20' పేరుతో ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ సంస్థ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. సంస్థ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి యూనియన్ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మోదీ నాయకత్వానికున్న ప్రాధాన్యత, లభించిన అవకాశాలు, వచ్చే పాతికేళ్ల కోసం ఇప్పుడు దృష్టి పెట్టాల్సిన అంశాలు, ఆర్థిక వృద్ధి ప్రాధాన్యత, తేలిగ్గా అమలు చేసేయగల కీలక సంస్కరణలు మొదలైన విషయాలను వివరించిన జేపీ ప్రసంగంలోని కొన్ని అంశాలు..

ఈ వేదిక మీద పూర్తి స్వేచ్ఛతో మాట్లాడే అవకాశం నాకు మాత్రమే ఉంది. మంత్రిగా ఉన్నారు కాబట్టి నిర్మలాజీ, పార్టీకి చెందినవారు కాబట్టి బీజేపీ నేతలు, అకడమిక్ నియంత్రణ దృష్ట్యా హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజే రావు ఒక పరిధి దాటి సొంత అభిప్రాయాలను వ్యక్తం చేయలేరు. అయితే, నేను చెప్పాల్సిన అంశాలు తప్ప వేరే అంశాల్ని నా నుంచి ఆశించలేరు.

కొవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కోవటంలో స్వదేశం, ప్రపంచం నుండి ఒత్తిళ్ల మధ్య కూడా ఆర్థిక మంత్రి, ప్రధానమంత్రి ప్రశంసనీయంగా వ్యవహరించారు. వైద్య సేవలు, వ్యాక్సిన్‌ల పరంగా, పేదలను ఆదుకునే విషయంలోనూ సమర్థవంతంగా చర్యలు తీసుకున్నారు. కొన్ని సంపన్న దేశాలు జీడీపీలో 10 శాతం దాకా ఉచితాలనిచ్చినా.. మన దేశం తక్షణ అవసరాలకి, దేశ ఆర్థిక భవిష్యత్తుకి మధ్య సమతూకాన్ని పాటించింది.

నేను మోదీని 2002, 2003 ప్రాంతంలో కలుసుకున్నాను. గుజరాత్ రాష్ట్ర సీఐఐ సదస్సుకు నేను కీలకోపన్యాసకునిగా వెళ్లగా, రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ ప్రారంభించారు. పక్కపక్కనే కూర్చున్నా సమావేశంలో మాది మర్యాదాపూర్వక పరిచయమే. సదస్సును ప్రారంభించాక వేరే కార్యక్రమాల కోసం మోదీ వెళ్లిపోయారు. అయితే అందులో ఆయన చేసిన ప్రసంగం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. స్వచ్ఛమైన హిందీలో మాట్లాడారు. ఆర్థికాభివృద్ధి ప్రాధాన్యతను ఎంతో స్పష్టంగా వివరించారు. అది కూడా తన సొంత రాష్ట్రం గురించి కాకుండా భారతదేశం గురించి ప్రధానంగా మాట్లాడారు. జాతీయ నేపథ్యం నుండి గుజరాత్ పాత్రను నిర్వచించారు. ఆ దృక్కోణం నా మనసును తాకింది.

ఏ ముఖ్యమంత్రయినా తన రాష్ట్రం గురించి ఆలోచిస్తారు, అది ఆయన బాధ్యత కూడా. మనది కేవలం సహకార ఫెడరలిజమే కాదు, పోటీ ఫెడరలిజం కూడా. వనరులు, పెట్టుబడులు, ప్రగతి కోసం రాష్ట్రాలు పోటీపడుతుంటాయి. కానీ ఆ పరిధిని దాటి మొత్తం దేశం నేపథ్యం నుండి గుజరాత్ వృద్ధి కోసం మోదీ మాట్లాడారు. అలాంటి దృష్టిని ప్రదర్శించటానికి రాజనీతిజ్ఞత, నాయకత్వ నిబద్ధత కావాలి.

అదే సమయంలోనో, కొంతకాలం తర్వాతో అహ్మదాబాద్‌ని సందర్శించాను. మిత్రురాలు, బ్యాచ్‌మేట్ అయిన విజయలక్ష్మి ఆ సమయంలో గుజరాత్ విద్యుత్ బోర్డుకు ఛైర్మన్‌గా ఉన్నారు. మా ప్రయాణంలో ఆమె ఆ రాష్ట్ర విద్యుత్ రంగంలో ఏమి జరుగుతోందో వివరించారు. వీటిలో చాలామందికి తెలియని అంశాలున్నాయి.

మోదీ విధానాల పట్ల నేను ప్రత్యేకంగా దృష్టి పెట్టటానికి విద్యుత్ రంగాన్ని ఆయన సంస్కరించిన తీరు కూడా కారణం. మనందరికీ తెలుసు– పారిశ్రామికీకరణకు, ఆధునికతకు విద్యుత్ ఎంతో కీలకం. ఇప్పటి యువతకు అంతగా తెలియకపోవచ్చుగానీ.. ఇరవై నాలుగు గంటల విద్యుత్తు కొన్నేళ్ల క్రితం వరకూ సుదూర స్వప్నం. పెద్ద నగరాల్లో కూడా గంటల తరబడి విద్యుత్ ఉండేది కాదు. ఈ నేపథ్యంలో మోదీ ఒకరోజు గుజరాత్ అధికారులను పిలిచి.. 24 గంటలు విద్యుత్ ఎందుకు ఇవ్వలేము అని ప్రశ్నించారు. విద్యుత్ లోడ్ నిర్వహణ లేకుండా పంపిణీ సాధ్యం కాదని అధికారులు కొంత చర్చ తర్వాత తేల్చిచెప్పారు. చివరికి ఒక నిర్ణయానికి వచ్చిన మోదీ.. వ్యవసాయం మినహాయించి అన్ని రంగాలకూ 24 గంటల విద్యుత్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇందుకు ఏం చేయాలో చెప్పండని అడిగారు. వ్యవసాయ, వ్యవసాయేతర ట్రాన్స్‌ఫార్మర్లను వేరు చేయాలి, వ్యవసాయానికి సబ్సిడీ ఇస్తూనే మీటర్లు ఏర్పాటు చేయాలి, కొద్దిపాటి టారిఫ్ పెట్టి అధికంగా వినియోగిస్తే డబ్బు చెల్లించాల్సి ఉంటుందనే సంకేతాన్ని ఇవ్వాలి.. ఇలా అంశాల్ని అధికారులు వివరించారు. ఇదంతా జరిగే పని కాదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఖర్చు వివరాలివ్వండి అని మోదీ అడిగారు. అధికారులు రెండ్రోజుల తర్వాత వచ్చి అవసరమైన పెట్టుబడులు, రాజకీయపరంగా తొలగించాల్సిన అవరోధాలు వగైరాలను వివరించారు. అన్నిటికీ మోదీ ఓకే చెప్పారు.

ఇంత డబ్బు అవసరమంటున్నారు, మీకు అవసరమైన డబ్బు మంజూరు చేస్తున్నాను, ఎలా చేస్తారో, ఎప్పటిలోగా పూర్తిచేస్తారో కాలపట్టికతో సహా చెప్పండి అని అధికారులను మోదీ కోరారు. నా పని చేశాను, మీ పని చేయండన్నారు. లక్ష్యాలను ఎలా చేరుకుంటున్నారో మూడు నెలలకోసారి సమీక్షించారు. అంతే.. వ్యవసాయం మినహా అన్ని రంగాలకూ, ఇళ్లకూ దేశంలోనే తొలి సారిగా 24 గంటల విద్యుత్‌ను అందించిన రాష్ట్రంగా 2004–05 నాటికి గుజరాత్ అవతరించింది. ఆ పని చేయాలంటే నాయకత్వానికి నిజమైన అంకితభావం, అవగాహన, తపన కావాలి.

విద్యుత్ లేకుండా ఏ ఆర్థిక కలాపమూ సాధ్యం కాదు, అభివృద్ధి ఉండదు. మనం పేదల కోసం ఎంత గుండె లోతుల్లో నుంచి మాట్లాడినా, ఆర్థిక వృద్ధి లేకుండా వారి ఆదాయాలు పెరగవు. మోదీ ఆ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకున్నారు. ఆర్భాటపు డిగ్రీలు, కాగితాల మీద ఆధారపడకుండా బలమైన ఇంగితజ్ఞానంతో ఆయన ఆర్థిక, సామాజిక రంగాలలో వ్యవహరించారు.

విద్యుత్ రంగంలో గుజరాత్ ఆరోజు సాధించిన విజయాన్ని ఈవేళ్టికి కూడా పలు రాష్ట్రాలు సాధించలేకపోయాయి. ఇప్పుడిప్పుడే లోపాల్ని దిద్దుకునే ప్రయత్నం చేస్తున్నాయి. వ్యవసాయ, వ్యవసాయేతరాలను వేరు చేయటం వంటి ప్రయత్నాలు చేస్తూ విద్యుత్ రంగాన్ని మనం కొంత మెరుగుపరచుకున్నాం. కానీ చేయాల్సింది చాలా ఉంది. వ్యవసాయ విద్యుత్‌లో అన్ని కనెక్షన్లకూ మోదీ ప్రభుత్వం మీటర్లు బిగించింది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లా కాకుండా గుజరాత్‌లోని చాలా ప్రాంతంలో వర్షాభావం ఉంటుంది. భూతాపం వల్ల భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం పెరుగుతోంది. ఆ ప్రభావం ఎంతమేరో ఇంకా తెలియాల్సి ఉంది. 1996లో పార్లమెంటు ఎన్నికల పరిశీలకునిగా నేను గుజరాత్ వెళ్లిన సమయంలో, అక్కడ బోర్‌వెల్‌కి 1000 అడుగుల దాకా వేయాల్సి వచ్చేది. మన వద్ద 300 అడుగులు చాలు. గుజరాత్‌లో ఎవరైనా వ్యవసాయ మీటర్లు వద్దు అన్నా, అధికారులు ఆమోదించేవారు. అయితే సగటు వ్యయం ప్రకారం ఛార్జీ వసూలు చేసేవారు. ఒక హార్స్‌పవర్‌కి 850 యూనిట్లు చొప్పున, ఎంత హెచ్‌పి ఉంటే అంత డబ్బు తీసుకునేవారు. దీని మీద కొంత సబ్సిడీ ఇచ్చేవారు. ఇలా స్పష్టమైన, దీర్ఘదృష్టి కలిగిన విధానంతో వ్యవహరించాలంటే రాజకీయ మూల్యం చెల్లించాల్సిన ప్రమాదం పొంచి ఉంటుంది. కానీ నాయకుడంటే.. విలువైన దీర్ఘకాలిక ప్రయోజనాలకు స్వల్పకాలిక రాజకీయ మూల్యం చెల్లించటానికి వెనుకాడకూడదు.

దీర్ఘకాలిక ప్రయోజనాల్ని పణంగా పెట్టి స్వల్పకాలిక అంశాలకు ప్రజల్ని రెచ్చగొట్టటం ప్రజాస్వామ్యంలో చాలా తేలికైన పని. ఈ రకమైన చౌకబారు, జుగుప్సాకర రాజకీయానికి, మానవ బలహీనతల్ని ఉపయోగించుకోవటానికి తెలివితేటలు అక్కర్లేదు. నరేంద్ర మోదీ ఆ పనిచేయకుండా నాయకత్వ లక్షణాల్ని ప్రదర్శించారు. రాజకీయంగా నాకు నష్టమొచ్చే ప్రమాదముంది, నేను చేయలేను అని చెప్పొచ్చు.. కానీ ఆయన ఆ పనిచేయలేదు.

నరేంద్రమోదీయా, మరొకరా అన్నది ముఖ్యం కాదు. ఆయన మీ తాత కాదు, మేనమామ కాదు, నా సోదరుడు కాదు. ప్రజలకు ఏం జరిగింది అన్నది ముఖ్యం.

అంతా సవ్యంగా ఉందా అంటే.. లేదు. ప్రజాస్వామ్యం లోపరహితం కాదు. అనేక మలుపులు, ఊహకందని పరిణామాలు ఉంటాయి. రకరకాల సమస్యలు, సవాళ్లు తలెత్తుతుంటాయి. రాజకీయం ఆచరణసాధ్యమైన అంశాలకు సంబంధించిన కళ. కానీ ఆ పరిధిలో కూడా, ఉన్న అవకాశాల్ని విస్తృతపరిచి, ఎంతవరకు ఆచరణసాధ్యమో అంతవరకూ వెళ్లి, ప్రజాస్వామ్య సంక్లిష్టతల మధ్యే వాటిని సాధించటం, అదీ భారత్‌లాంటి ఒక పేద దేశంలో, బహిరంగ చర్చ ప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్న దేశంలో చేయటం.. ఏ నాయకుడికైనా ప్రయాసతో కూడిన సవాలే. ఇలాంటి సవాళ్లను ఎదుర్కొన్నందుకే పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్, వాజ్‌పేయి వంటి నేతల్ని మనం గౌరవిస్తాం. వాజ్‌పేయి హయాం దాకా ఈ దేశంలో మొబైల్ ఫోన్లు ఎవరో కొద్దిమంది వద్ద తప్ప లేవు. వాజ్‌పేయి

హయాం ముగిసేనాటికి కోట్లమందికి ఫోన్లు వచ్చాయి. ఆయన హయాంలోనే జాతీయ రహదార్లు పేరుకు తగ్గరీతిలో రూపుదిద్దుకున్నాయి. అలాగే మెజారిటీ లేకపోయినా, ద్రవ్యలోటు కట్టడికి ఎఫ్ఆర్‌బీఎం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) చట్టాన్ని తీసుకొచ్చారు, భావితరాల మీద ఆర్థిక భారం లేకుండా సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) తెచ్చారు. అన్ని రాష్ట్రాలూ సొంతంగా ఈ చట్టాలు చేసేలా ఒప్పించారు. అలాంటి నాయకత్వాన్ని వాజ్‌పేయి అందించారు. మోదీ ఆ పరంపరని వివిధ రకాలుగా కొనసాగించారు. అందువల్లే ఆయన గురించి మాట్లాడుకోవటం. మోదీ ఏ పార్టీకి చెందినవారన్నది అసంగతం.

**మరో సంఘటన. నర్మదా ఆందోళన.**

నర్మదా ప్రాజెక్టుపై నిరసన దీక్షలు, శిబిరాలు, ఆందోళనలు వగైరాల గురించి మాట్లాడను. ఒకరోజు అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పిలిచి, సమస్య వివరించారు. రుతుపవనాల మీద ఆధారపడిన భారత్ వంటి దేశంలో ఆనకట్టలు, రిజర్వాయర్లు అవసరం. దేశానికి నీరందించటంతోపాటు ప్రాజెక్టులకు భూములిచ్చే రైతుల ప్రయోజనాల్ని పరిరక్షించాలి. కానీ నర్మదా సరోవర్ ప్రాజెక్టు విషయంలో అవరోధాలు ఎదురవుతున్నాయి అన్నారు. మిస్టర్ ప్రైమ్‌మినిస్టర్, మీరు సరిగా చెప్పారు. అదే మాటను మీరు స్వయంగా దేశానికి చెప్పి ముందుండి నడిపించండి అన్నాను. కానీ ఆయన మనలో కొంతమంది లాంటివారు. తెర వెనుక ఉండి పనిచేసేవారు. అందుకే అందుకు సిద్ధపడకుండా కమిటీ వేశారు. జయప్రకాష్, నర్మదా ప్రాజెక్టుపై మీరు కూడా సభ్యులుగా ఒక కమిటీ వేయాలనుకుంటున్నాను. నర్మదా సరోవర్ ప్రాజెక్టు ఎత్తుపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. మీరు దేశ ప్రయోజనాలకనుగుణంగా కమిటీ ద్వారా వేగంగా నివేదికను అందించగలిగితే, సుప్రీంకోర్టుకి అందచేస్తాం. మిగతా సంగతి కోర్టు చూసుకుంటుంది అన్నారు. ఇది అత్యుత్తమ పరిష్కారం కాకపోయినా, దేశ ప్రయోజనాల కోసం పనిచేయటానికి నేను ఎప్పుడూ సిద్ధమని చెప్పి ఆ కమిటీలో భాగమయ్యాను. ఆ తర్వాత కేవలం 35 రోజుల్లో మధ్యప్రదేశ్‌లో ఆ ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే ప్రతి కుటుంబాన్నీ కలిశాం. ప్రాజెక్టుపై చేస్తున్న ఆరోపణలకు ఎటువంటి ఆధారాలూ లేవని తేలింది. అదే సిఫార్సు చేశాం. డ్యామ్ ఎత్తుకి సుప్రీంకోర్టు అంగీకరించింది. ఆ తర్వాత ఆ విషయాన్ని నేను మర్చిపోయాను. దేశానికి చేయగలిగింది చేయటం వరకే నా బాధ్యత అనుకుంటాను.

కొన్నేళ్ల తర్వాత ముంబయిలో అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక సదస్సు జరిగింది. విదేశాల నుండి పలువురు ఆర్థికవేత్తలు, మెక్సికో మాజీ అధ్యక్షుడు సహా రాజకీయ ప్రముఖులు విచ్చేశారు. ఆ సదస్సుకి గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ కూడా హాజరయ్యారు. తన ప్రసంగం తర్వాత ఆయన నా పేరు పెట్టి పిలిచి నా వద్దకు వచ్చారు. ఆత్మీయంగా హత్తుకున్నారు. నాకు అర్థం కాలేదు. మోదీజీ, మిమ్మల్ని నేను ఒక్కసారే కలుసుకున్నాను,

## ప్రతి రూపాయీ లబ్ధిదారులకు చేరేందుకు కృషి చేసే ప్రధాని

**ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ లబ్ధిదారులకు చేరాలని ప్రధాని మోదీ చూస్తుంటారని నిర్మలా సీతారామన్ అన్నారు. నెలకు ఒక్కసారైనా జిల్లా కలెక్టర్లతో మాట్లాడి పథకాల ప్రగతిపై ఆరా తీస్తారన్నారని, అభివృద్ధికి అవసరమైన వనరులను గుర్తించాలని చెబుతుంటారని తెలిపారు. కొవిడ్ టీకాల్ని దేశ ప్రజలకు వేగంగా అందించటంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. అన్ని రాష్ట్రాలూ అభివృద్ధి చెందాలని ప్రధాని సమదృష్టితో పనిచేస్తున్నారన్నారు.**

నన్ను గుర్తుపెట్టుకునే అవకాశం లేదు అన్నాను. నేనెలా మర్చిపోతాను జయప్రకాష్‌జీ, గుజరాత్ కోసం మీరు ఎంత మద్దతిచ్చారో మర్చిపోను అన్నారు. నేను చేసిందేమిటి? అన్నాను.. అది నర్మదా ప్రాజెక్టు విషయం. నేను ఆ విషయం గురించి మర్చిపోయాను. మోదీకి తెలుసని నాకు తెలియదు. తన రాష్ట్రం పట్ల ఆయన అంకితభావం ఎంత గొప్పదంటే, నర్మదా ప్రాజెక్టుపై ఢిల్లీలో ఏం జరుగుతోందో ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వచ్చారు. ఎవరు ఆ అంశాన్ని డీల్ చేస్తున్నారు, హేతుబద్ధంగా, క్రమపద్ధతిలో అన్నిటినీ పరిష్కరించే కృషి చేస్తున్నారు ఆయన గమనిస్తూ వచ్చారు. నేను చాలా సందర్భాల్లో వ్యక్తుల్ని కూడా మర్చిపోతుంటాను. కానీ ఒక ముఖ్యమంత్రి, తను యధాలాపంగా ఒకసారి తప్ప కలుసుకోని వ్యక్తిని కొన్నేళ్ల తర్వాత గుర్తుపెట్టుకుని తనంతట తాను వచ్చి మాట్లాడటం ఆయన నాయకత్వ స్థాయికి అద్దం పడుతుంది.

ఎన్నున్నా కూడా ఆయనలో నిజమైన నాయకత్వ సామర్థ్యం ఉందని గుజరాత్ ప్రజలు గుర్తించారు. అదే జాతీయ స్థాయిలోనూ జరిగింది. 2014 ఎన్నికలకు కొన్ని నెలల ముందు ముంబయిలోని ఒక సుప్రసిద్ధ పోలీసు అధికారి నాతో మాట్లాడారు. ఆయన క్రైస్తవులు. జయప్రకాష్, క్రైస్తవ యువత కూడా మోదీ, మోదీ అని జపం చేస్తున్నారు అని సంభ్రమాన్ని వ్యక్తం చేశారు. మోదీ దేశాన్ని ఏకం చేయగలిగితే అంతకంటే కావలసిందేముంది అన్నాను.

2014 ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు హిందూత్వ కోసమో, ఈ మతం కోసమో, ఆ మతం కోసమో కాదు.. అది భారత్ కోసం, దేశ భవిష్యత్తు కోసం.

ఆ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ప్రజలు స్పందించారు. ఎందుకంటే, సరైన పాలన అందాలని, మార్పు కావాలని కోరుకున్నారు. వాళ్లు మోదీని నమ్మారు.

మోదీ ప్రధాని అయ్యాక, వార్తాపత్రికల్లో ఒక కథనం చదివాను. యూనియన్ ప్రభుత్వంలో పనిచేసే ఒక మహిళా

అధికారి తన మిత్రురాలితో కలిసి అహ్మదాబాద్ నుంచి ఢిల్లీకి రైలులో వెళ్తున్నారు. కానీ వారి బెర్త్‌లు కన్‌ఫర్మ్ అవలేదు, ఆర్ఏసీలో ఉన్నాయి. అయితే కోచ్‌లోని ఇద్దరు పురుషులు కన్‌ఫర్మ్ అయిన తమ బెర్త్‌లను ఆ మహిళలకి ఇచ్చి తాము నేల మీద టవల్ వేసుకుని పడుకున్నారు. వారు నరేంద్ర మోదీ, శంకర్‌సింగ్ వాఘేలా. ఒక సాధారణ ఎమ్మార్వో, పోలీస్ స్టేషన్ అధికారి, చిన్న ప్రభుత్వోద్యోగి కూడా ప్రజలతో మాట్లాడేటప్పుడు.. ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా అని అహంకరించే దేశంలో, ఇద్దరు సీనియర్ నాయకులు చూపిన వినమ్రత ఆకట్టుకుంది. వ్యక్తిత్వమంటే అదీ. ఈ రకమైన లక్షణాలే మోదీని ప్రాధాన్యతగల నాయకుడిగా చేశాయి.

మనలో చాలామంది సోషలిజం నేపథ్యంలో పెరిగినవాళ్లం. నేనూ సోషలిజాన్ని ఆరాధించినవాడిని. కానీ విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నప్పుడు నాకు అర్థమైంది– ప్రభుత్వ రంగమంటే, ప్రభుత్వంలో ఉన్నవారి ప్రయివేటు ఆస్తి అని. అప్పట్నుంచి నేను ఆర్థిక స్వేచ్ఛ, పోటీ విధానాలకు పూర్తిస్థాయి మద్దతుదారుగా మారాను. ఫ్రీడ్‌మనో, మరొకరో చెప్పారని కాకుండా, మోదీ ఇంగితజ్ఞానంతో, సహజాతంగా ఈ వాస్తవాన్ని అర్థం చేసుకున్నారు. వర్గీస్ కురియన్ అంటుండేవారు, గుజ్జూభాయ్ పుట్టుకతోనే వ్యాపారి అని. కాబట్టి, ఆర్థిక వ్యవస్థ ఎలా పనిచేస్తుందో మోదీ అర్థం చేసుకున్నారు. దీనికోసం పాఠ్యపుస్తకాలు, నోబెల్ పురస్కార గ్రహీతలు, ప్రఖ్యాత తత్వవేత్తల మీద ఆధారపడలేదు. ఆర్థికమంత్రి నిర్మలాజీ గనక కొవిడ్ సమయంలో ఈ నోబెల్ విజేతలు, ఆర్భాటపు సిద్ధాంతకర్తలు చెప్పినట్లు చేసి ఉంటే దేశం ఈపాటికి తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఉండేది. కొన్ని సందర్భాల్లో ఇంగితజ్ఞానం మెరుగైన మార్గసూచీ అవుతుంది. విజ్ఞులైన మేధావుల మాటలు వినొద్దని కాదు దీనర్థం, కానీ వారి అభిప్రాయం.. మీ అభిప్రాయానికి, సహజాతాలకి, అవగాహనకి ప్రత్యామ్నాయం కాదు. నాయకత్వం గుర్తించాల్సిన విషయమిది.

మనం ఒక దేశంగా చెప్పుకోదగిన స్థితిలో ఉన్నాం. కానీ అనేక లోపాలు, బలహీనతలు ఉన్నాయి. అందుకే గత 26 ఏళ్లుగా నేను నిర్విరామంగా గొంతెత్తుతున్నాను. ఈ విషయం మీ అందరికీ తెలుసు. పార్టీలు, నాయకులు ఎవరైనా నేను ఈ విషయాల్నే మాట్లాడుతుంటాను. మోదీ, మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ, అద్వానీ.. ఎవరిని కలిసినా ఒకేరకంగా మాట్లాడతాను. రాజకీయాల్ని నిశితంగా పరిశీలిస్తూ, మన ప్రజాస్వామ్యంలోని లోపాల్ని తెలియచేస్తుంటాను.

రాబోయే 25 ఏళ్లలో మనకు ఒకే మంత్రం ఉంది. భారత్ 8% పైగా ఆర్థిక వృద్ధిని ఏటా అవిచ్ఛిన్నంగా, సుస్థిరంగా కొనసాగించాలి. చైనా 10% వృద్ధిని ముప్పై ఏళ్లపాటు సాధించింది. మనకు చైనా పోటీదారు కావచ్చు, కొన్ని విషయాల్లో మనతో శత్రుత్వం ఉండొచ్చు, కానీ చైనా విజయం అభినందనీయమైనది. ప్రజాస్వామ్యం లేకపోవటం వల్ల వాళ్లు విజయాలు సాధించారనుకోవటం పొరపాటు. నిజానికి ప్రజాస్వామ్యం లేకపోవటం వారి విజయాల్ని పరిమితం చేసింది. చైనా ఎప్పుడు ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించిందో ఆయా సమయాల్లో దెబ్బతింది. ఎక్కడ దిద్దుబాటు చేసుకున్నారో, అధికార వికేంద్రీకరణ, మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఆర్థిక పెట్టుబడుల కోసం పనిచేశారో అక్కడ విజయం సాధించారు. డెంగ్ జియావోపెంగ్ నాయకత్వంలో 1978లో చైనా ఆర్థిక వృద్ధి కక్ష్యలోకి ప్రవేశించి తదేక కృషితో అద్భుత విజయం సాధించింది. ప్రజాస్వామ్యం అభివృద్ధికి అవరోధం కాదు, కాకూడదు. ప్రజాస్వామ్యంతోనే, స్వేచ్ఛతోనే భారత్ ఈ 8% వృద్ధిని సాధించాలి.

ఆర్థిక వృద్ధి ఎంత తప్పనిసరో నాయకత్వం స్పష్టంగా గుర్తించటం ఈవేళ భారత్‌కి అవసరం. పేదరికానికి ఇంతకంటే మెరుగైన విరుగుడు లేదు. అభివృద్ధికి ఇంతకంటే మెరుగైన అవకాశం లేదు. వృద్ధి గురించి పట్టించుకోకుండా, లేని సంపదని పంపిణీ చేస్తామని హామీ ఇచ్చే నేతలు మభ్యపెడుతున్నారు. భారత్ గత కొన్నేళ్లలో నిర్మించుకున్న నాలుగు ప్లాట్‌ఫాంలు రాబోయే కాలంలో దేశ గణనీయాభివృద్ధికి దోహదం చేస్తాయని 'ది ఎకానమిస్ట్' ఇటీవల కవర్ స్టోరీ కథనాన్ని ఇచ్చింది. ఒకటి, జాతీయ మార్కెట్. జీఎస్టీ అమలులో కొన్ని సమస్యలు తలెత్తుతున్నా, అంతకుముందున్న అవినీతి, ఇప్పుడు దేశమంతా ఒకే మార్కెట్‌గా ఉండటమనే అంశాలను పరిగణలోకి తీసుకుంటే దాని వల్ల ప్రయోజనం అర్థమవుతుంది. రెండోది, కొవిడ్ తర్వాత సరఫరా గొలుసులకు చైనాను మాత్రమే నమ్ముకుంటే నష్టపోతామని ప్రపంచం గుర్తించింది. ఇది భారత్‌లో తయారీకి గొప్ప అవకాశం. మూడోది, మనం ఇప్పటికే ఛాంపియన్‌గా ఉన్న ఐ.టి రంగం. నాలుగోది, మధ్యలో దళారీలు లేకుండా పేదలకు నేరుగా ప్రభుత్వ పథకాలను అందించేందుకు ఆధునిక సాంకేతికతతో వ్యవస్థ నిర్మాణం. ఈ నాలుగు ప్లాట్‌ఫాంలనూ సమర్థవంతంగా ఇండియా ఉపయోగించుకోవాలి.

మోదీయే కాదు, ఎవరూ శాశ్వతంగా ఉండరు. ఎన్నికల్లో నచ్చినవాళ్లకు ఓటు వేసుకోవచ్చు. కానీ పాలనలో ప్రతిదీ రాజకీయం చేయొద్దు. మనం ఏం చేసినా, ముఖం మీద కోపంతో ముక్కు కోసుకోకూడదు. మన బిడ్డల భవిష్యత్తుతో చెలగాటమాడకూడదు. కేవలం రాజకీయం తప్ప ఎటువంటి సహేతుక కారణం లేకుండా మన దేశంలో ఆగ్రహం హద్దులు దాటుతోంది, అదుపు చేసుకోవటం అవసరం. అధికారంలో ఉన్నవారు మనకు నచ్చలేదు కాబట్టి కోపంతో మంచిపనుల్ని కూడా వ్యతిరేకిస్తే తీవ్రంగా నష్టపోతాం. నూతన వ్యవసాయ చట్టాలు ఇందుకు ప్రబల నిదర్శనం. ఇవి రైతులకు, దేశానికి ఎంతో మేలు చేస్తాయని తెలిసినా, విపక్షాలు అడ్డుకున్నాయి. రైతు వ్యతిరేకమన్నట్లు నటించి రైతులను రెచ్చగొట్టాయి. ఇందులో మీడియా పాత్ర కూడా ఉంది. దేశానికి ఏది అవసరం, ఏది మంచి అని చర్చించకుండా మీడియా తీవ్ర ప్రతికూల పాత్రను పోషించింది. ప్రతిదీ రాజకీయం చుట్టూ తిప్పటం, రాజకీయం చేయటం జరుగుతోంది. వ్యవసాయ చట్టాల రద్దు వల్ల మోదీకి

నష్టం లేదు, ఆయనకు ఎకరం పొలం కూడా ఉన్నట్లు లేదు, కానీ రైతులు, ప్రజలు నష్టపోయారు, దేశ ఆర్థిక వ్యవస్థకి దెబ్బతగిలింది. ఏ అంశాన్నయినా పార్టీల కోణం నుంచి కాకుండా దేశ ప్రయోజనాలు, హేతుబద్ధత, సాక్ష్యాధారాల ఆధారంగా పరిశీలించాలని ప్రజలను, మేధావులను, కనీసం సగం మేధావులైనా సరే వారిని, మీడియాను కోరుతున్నా.

నిర్మలాజీ, మార్కెట్ పాత్ర, ఇతరత్రా అంశాలతోపాటు వచ్చే 25–30 ఏళ్ల పాటు వృద్ధి రేటు 7–8% ఉండాలంటే, ఆర్థిక క్రమశిక్షణ కూడా పాటించాలి. లేకుంటే వృద్ధి కష్టం. కొన్ని రాష్ట్రాలు, యూనియన్ ప్రభుత్వం కూడా ఆర్థికంగా గాడితప్పాయి. ఉచితాలు అంటే ఏమిటి అనే చర్చ వల్ల ఇప్పుడు ఉపయోగం లేదు. మీరు ఉచితాలు అనుకున్నవి, నాకు సంక్షేమంగా కనిపించ వచ్చు. ఆ చర్చ రాజకీయంగా మారుతుంది తప్ప ప్రయోజనం ఉండదు. ఇదేసమయంలో రాజకీయాలకతీతంగా ఒక పరిమితిని కచ్చితంగా విధించవచ్చు. రోజువారీ ఖర్చులకు అప్పులు తేవటానికి వీల్లేదు, అప్పుల్ని కేవలం భవిష్యత్ తరాల అవసరాలకు పెట్టుబడులుగా మాత్రమే ఉపయోగించాలి అనే గీత స్పష్టంగా గీయాలి. వెంటనే కాకపోయినా రెండు మూడేళ్లలో దీన్ని అమల్లోకి తేవాలి. ఇందుకోసం అధికారాన్ని యూనియన్ ప్రభుత్వం చేతిలో ఉంచితే మళ్లీ వివాదమయ్యే అవకాశముంది. ఇప్పుడున్నది నెహ్రూ, వాజ్‌పేయిల కాలం కాదు. మోదీ ఏదైనా చెబితే కేసీఆర్ వ్యతిరేకిస్తారు. కాబట్టి అప్పుల వ్యయాన్ని నియంత్రించేందుకు, ఆర్థిక క్రమశిక్షణకు ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థను ఏర్పాటు చేయాలి, లేదా జాతీయ ఆర్థిక సంఘానికి శాశ్వత ప్రతిపత్తి కల్పించి స్వతంత్రంగా వ్యవహరించే ఏర్పాటు చేయాలి.

వీటితోపాటు సులభంగా సాధించే అవకాశమున్న కొన్ని రంగాల మీద దృష్టి పెట్టాలి. మొదటిది, ఆరోగ్యం. కేవలం అనారోగ్యం వల్ల దేశంలో ఏటా 5.4 కోట్ల మంది పేదరికంలోకి జారిపోతున్నారు. కేవలం ఆరోగ్య రంగంలో వైఫల్యమే మన దేశంలో పేదరికం నిరంతరం కొనసాగటానికి అతి పెద్ద కారణంగా ఉంది. మనకున్న వనరులరీత్యా ఆరోగ్య వ్యవస్థను బాగుచేయటానికయ్యే ఖర్చు కూడా ఎంతో తక్కువ. ఏడాదికి యూనియన్ ప్రభుత్వం రూ.30,000 కోట్ల చొప్పున మూడేళ్లపాటు ఖర్చు చేస్తే ఆరోగ్య వ్యవస్థ కొలిక్కి వస్తుంది. జేబుఖర్చు లేకుండా ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యం అందుబాటులోకి వస్తుంది. దేశ ఉత్పాదకత పెరుగుతుంది. ఇందుకు రూపొందించిన సమగ్ర విధానంలో.. ప్రాథమిక స్థాయిలో గ్రామాలకు కేంద్రబిందువుగా సమీపంలో ఉండే చిన్న పట్టణాల్లో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ ఉంటుంది. ఆ డాక్టర్లకు పేషెంట్ల సంఖ్యని బట్టి ఫీజు రీఇంబర్స్ చేయటం తప్ప ప్రభుత్వం జీతాలివ్వనక్కర్లేదు. అలాగే రెండో దశ వైద్యంలో ఆయుష్మాన్ భారత్ వర్తిస్తుంది. మూడోదశలో ప్రభుత్వాస్పత్రుల్ని ఆధునీకరించి సేవలందిస్తారు. ఈ రకమైన సమగ్ర ఆరోగ్య వ్యవస్థతో లక్షలాది కొత్త ఉద్యోగాలు వస్తాయి. మరోపక్క మెడికల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తే కేవలం పదేళ్లలో 100 బిలియన్ డాలర్లకమార్క్‌ను భారత్ అందుకోవచ్చు. ఇది భారత్‌కి మరో ఐ.టి రంగమవుతుంది. ఆ తర్వాత, వ్యవసాయంలో ఆదాయం పెంచటం. వ్యవసాయ చట్టాలను రద్దు చేసినా, మరీ ఎక్కువ నష్టం లేకుండానే ప్రభుత్వం వ్యవహరించొచ్చు. ఈవేళ రైతుకి పంట అమ్మే ధరలో కేవలం 25–30% వస్తోంది. ఆ ఆదాయం గణనీయంగా పెరిగేలా చేయాలి. ఇందుకోసం చాంతాడంత ఉన్న మధ్యదళారీ వ్యవస్థను కుదించాలి. రిటైల్ చెయిన్లను తీసుకురావాలి. ప్రాసెసింగ్‌తో ఉత్పత్తులకు విలువ జోడించాలి. మనకు వ్యవసాయ ఎగుమతుల్లో ఏడాదికి 100 బిలియన్ డాలర్ల సామర్థ్యం ఉంది. మనం సరైన చర్యలు తీసుకోవటమే ఆలస్యం. మరో కీలకాంశం, విద్య. మన దేశంలో అత్యధిక శాతం పిల్లలకి నాణ్యమైన విద్య అందించే స్కూళ్లకు వెళ్లే అవకాశం లేదు. దీనివల్ల ఇప్పటికీ 14–18 ఏళ్ల మధ్య పిల్లల్లో యాభై శాతం మందికి గడియారం చూసి కచ్చితంగా సమయం చెప్పే సామర్థ్యం కూడా ఉండటం లేదు. 2022లో ఇలాంటి పరిస్థితి ఉందంటే, దేశాభివృద్ధికి పెద్ద అవరోధమవుతుంది. నాణ్యమైన విద్యను అందరికీ అందించేందుకు అదనంగా డబ్బు కూడా అక్కర్లేదు, పద్ధతుల్ని మారిస్తే చాలు.

ఇవన్నీ వెంటనే చేయగల పనులు. అలాగే దేశంలోని కోట్లాది యువత ఉపాధి అవకాశాల్ని కోరుకుంటున్నారు. ఉపాధి అవకాశాలను ఇబ్బడిముబ్బడిగా అందించేందుకు అనకాపల్లి జిల్లాలో బ్రాండిక్స్ సంస్థ తరహాలో ఏర్పాట్లు చేయండి. అక్కడ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 22,000 మంది మహిళలు ఉపాధిని పొందుతున్నారు. ఉపాధి కావాలన్నవారందరికీ అవకాశం కల్పించారు. దేశంలో ప్రతి జిల్లాలో ఇలాంటి ఏర్పాటు ఉండాలి. ఇందుకోసం పెట్టుబడుల ఆకర్షణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలి, కార్మిక చట్టాల్ని సంస్కరించాలి. మన దేశంలో ప్రయివేటు రంగంలో నెలవారీ జీతాలందుకునే వారి సంఖ్య ఇప్పటికీ రెండు కోట్ల లోపే ఉంది. ఈ సంఖ్యను మరో రెండు, మూడు కోట్లు పెంచితే దేశంలో అపార ఉత్సాహపూరిత వాతావరణం వెల్లివిరుస్తుంది. సానుకూల ప్రయత్నాలు ఊపందుకుంటాయి. పేదలు సంపదసృష్టిలో భాగమవుతారు.

నరేంద్ర మోదీ తపన, నాయకత్వ సామర్థ్యం, అన్నిటినీ మించి ప్రజల్లో ఉన్న ఆమోదనీయత ఇవన్నీ భారత్‌కు ఓ అద్భుత అవకాశాన్నిచ్చాయి. ఈ కృషిలో భాగస్వాములైన మంత్రులు, సివిల్ సర్వెంట్లు, నిపుణులు, ప్రజలు అందరూ అభినందనీయులు. వివిధ రంగాల్లో సంస్కరణలు, ప్రజాస్వామ్యానికి సంబంధించి చేయాల్సింది ఇంకా చాలా ఉన్నా వాటి గురించి తర్వాత మాట్లాడుకుందాం. వేగంగా ఫలితాల్ని సాధించటానికి కనీసం ఇప్పుడు పేర్కొన్న అంశాలపై తక్షణం దృష్టి పెట్టాలి. వచ్చే తరం తమ సమస్యల మీద కాకుండా తమ ముందున్న అవకాశాల గురించి మాట్లాడుకోవాలి.

సదస్సులో కజకస్థాన్ కాన్సులేట్ జనరల్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్, న్యాయవాదులు, విద్యావేత్తలు, వ్యాపార, వాణిజ్య రంగాల ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.




# సెప్టెంబర్ 17 - జాతీయ సమగ్రతా దినోత్సవం

## లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో సమగ్ర చర్చా సమావేశం

సెప్టెంబర్ 17 – హైదరాబాద్ విలీనంపై రాష్ట్రంలో వేల సమావేశాలు, కార్యక్రమాలు జరిగినా, జాతీయ స్థాయిలో చర్చ జరిగినా జెండాలు, ఉద్రిక్తతలు తప్ప అంతర్ముఖత్వం, లోతైన ఆలోచన లేదని.. సమగ్ర చర్చ కోసం లోక్‌సత్తా పార్టీ తెలంగాణ విభాగం సమావేశం ఏర్పాటు చేయటం అభినందనీయమని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ అంశంపై తొలి నుంచీ పార్టీలు రాజకీయం చేస్తూ వచ్చాయన్నారు. దేశంలోని సంస్థానాలన్నిటిలోకీ పెద్దదైన హైదరాబాద్.. విలీన ప్రక్రియలో చిట్టచివరిది కూడా కాబట్టి ఈరోజును జాతీయ సమగ్రతా దినోత్సవంగా జరుపుకోవాలని లోక్‌సత్తా 1997 నుంచి చెబుతున్న మాటను పార్టీలు ఇప్పుడు గుర్తించాయని, ఆనాడే చెప్పి ఉంటే హిందువులు, ముస్లింల మధ్య ఉద్రిక్తతలు, అపోర్థాలు, ఉద్రిక్తతలు ఉండేవి కావన్నారు. ముస్లింలు ఈ దేశానికి ప్రమాదకరమనే విభజన వాదనలు ఇప్పటికీ కొందరు చేస్తున్నారని.. కానీ పలువురు ముస్లింలు కూడా నిజాం నిరంకుశత్వానికి, అరాచకానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. అలాగే భారత్‌లో విలీనమవటం ముస్లింలకు వ్యతిరేకమన్న అపోహ ఇంకా ఎవరిలోనన్నా ఉంటే కూడా తొలగించుకోవాలని, హిందూ రాజ్యాలుగా ఉన్న పలు సంస్థానాలు భారత్‌లో విలీనమయ్యాయని గుర్తించాలన్నారు. చరిత్రలో కొన్ని అపశ్రుతులు దొర్లిన మాట వాస్తవమని, వాటిని చరిత్ర పరిణామక్రమంలో భాగంగా చూడాలి తప్ప, సరిచేయటానికి సరైన రీతిలో రాజ్య వ్యవస్థను నిర్మించి, నాయకత్వం అందించాలి తప్ప.. ప్రజలను తప్పుపడితే ప్రయోజనం ఉండదన్నారు. ఎన్నో కులాలు, మతాలు, భాషలు ఉన్న భారత్ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే జాతీయతా భావం అవసరమని, అంతకుమించి జాతీయతాభావాన్ని కూడా అతిగా చూడనక్కర్లేదన్నారు. అతి జాతీయతా ధోరణులు ఎలాంటి ఉపద్రవాలకు దారితీస్తాయో రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో చూస్తున్నామన్నారు. రాచరికం, ఫ్యూడల్ వ్యవస్థ నుండి హైదరాబాద్ సంస్థానం ప్రజాస్వామ్య భారతంలోకి వచ్చిన రోజు ఇది, కానీ దేశంలో అధికారం ఇంకా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల దగ్గరే కేంద్రీకృతమై ఉంది.. అన్నారు. అది ఆధునిక రాచరికమవుతుంది తప్ప, నిజమైన ప్రజాస్వామ్యం అవదన్నారు. మోదీ, కేసీఆర్, వైకాపా, టీడీపీ ఏ నేతా, ఏ పార్టీ స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసేందుకు, అధికారాన్ని జనం



చేతుల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించటం లేదన్నారు. ఇది వెంటనే జరగకపోవచ్చని, కానీ కనీసం ప్రయత్నం జరగటం లేదన్నారు. స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, ఎదిగే అవకాశాల కోసం అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, ఎన్నికల సంస్కరణలు, పార్టీల ప్రజాస్వామీకరణ మొదలైన మార్పుల్ని అమలు చేయటం ఇప్పుడు మన లక్ష్యం కావాలన్నారు. ఎలాగైతే హైదరాబాద్ విలీనం సహా పలు అంశాలపై ఇప్పుడు లోక్‌సత్తా భాషను వాడుతున్నారో.. అలాగే పాతికేళ్ల తర్వాత పార్టీలు లోక్‌సత్తా విధానాల్ని అనుసరించకతప్పదని జేపీ జాతీయ సమగ్రతా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు, బాలకృష్ణ, అన్వర్‌ఖాన్, రామనర్సయ్య తదితరులు ప్రసంగించారు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

# అధిక వర్షాలు - వరద నదులు - ముంపు నగరాలు

జులై మాసంలో వచ్చిన అధిక వర్షాలు తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల ప్రజలను ఇక్కట్ల పాలుచేశాయి. ప్రాజెక్టులు, పలు జనావాసాలు ముంపు తాకిడికి వణికిపోయాయి. రాష్ట్రానికి, దేశానికి ఆర్థిక చోదక శక్తిగా ఉన్న మహానగరం హైదరాబాద్‌లో యధావిధి అన్నట్లు పలు ప్రాంతాలు ముంపుకి గురయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2016లో వర్షాలు నగరాన్ని వణికించాయి. అప్పట్నుంచి ఇదిగో పరిష్కారం, అదిగో పరిష్కారం అని ఆర్భాటం చేయటం తప్ప, ఎన్నికలు వచ్చినప్పుడు నష్టపరిహారం పేరుతో రాజకీయం చేయటం తప్ప ఇప్పటికీ హైదరాబాద్‌లో వరద ముంపు లేకుండా చేయలేకపోతున్నారు. కమిటీల రిపోర్టులు పేరుకుపోతున్నా ఒక్క నివేదికా అమలవలేదు. మూసీ ప్రక్షాళన కార్యకలాపాలు స్తంభించాయి. నాలాల వ్యవస్థ సక్రమంగా లేకుండా, ఆక్రమణలకు గురైన ప్రదేశాల్లో ఇళ్లు కొనుక్కున్న సంపన్నులు కూడా కన్నీరు కార్చాల్సి వచ్చింది.

హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, చెన్నై, ఢిల్లీ ఇలా దేశంలోని అన్ని మహానగరాలు, పలు ఇతర నగరాలూ వర్షం వస్తే ముంపు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. పట్టణాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నం.

ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అయితే స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ప్రభుత్వాలు ఆ బాధ్యతలో విఫలమవుతున్నాయి. రాజకీయ పార్టీలు ఎన్నికలే పరమావధిగా భావిస్తూ, గెలిచాక ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా తాత్కాలిక తాయిలాలు,



సహా అన్ని హామీలూ మురికి మూసీలో కలిసిపోయాయి. వర్షాలతో ముంపు బారిన పడుతూ తరచూ ఒడిదుడుకులను ఎదుర్కోవటం హైదరాబాద్‌లో ఆనవాయితీగా మారిపోయింది.

ఈ ఏడాది జులై తాకిడి నుంచి తేరుకోకముందే సెప్టెంబర్‌లో మళ్లీ ముసురు పట్టి భారీ వర్షాలు హైదరాబాద్‌ను వెన్నాడాయి. ఇదేసమయంలో మరో మహానగరం బెంగళూరులో వర్షం బీభత్సం సృష్టించింది. ఇండియన్ సిలికాన్ వేలీగా పేరుగాంచిన ఆ నగరంలో పలు ప్రాంతాలు జలాశయాల్లా మారి బహుళ జాతి సంస్థల ప్రతినిధులు కూడా పడవల్లో, ట్రాక్టర్లలో ప్రయాణించాల్సి వచ్చింది. బెంగళూరులో సెప్టెంబర్‌లో కురిసిన మూడో అతిపెద్ద వర్షపాతమిదని చెబుతున్నారు. రోజువారీ సేవలు, పెళ్లిళ్లు వంటి పనులు చేస్తుండటం, శాసన వ్యవస్థ-ప్రభుత్వ వ్యవస్థల మధ్య అధికారాల విభజన లేకపోవటం వల్ల ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు.

మరోపక్క, భూతాపం వల్ల వర్షాలు పెరుగుతూ ఇది దీర్ఘకాలిక పరిణామంగా కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలో, అతివృష్టితో నదుల్లో పెరుగుతున్న వరదల్ని, పట్టణ ప్రాంతాల్లో ముంపుని నియంత్రించేందుకు పాలనాపరంగా వెంటనే చేపట్టగలిగిన కొన్ని కీలక చర్యల్ని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రభుత్వాలు, ప్రజల ముందుంచారు. అవి..

### తాత్కాలిక తాయిలాలు కాదు.. దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి

ప్రభుత్వం ఏం చేయాలనే దానిపై దృష్టి తగ్గించి తాత్కాలిమైన తాయిలాల మీద దృష్టి ఎక్కువగా పెడుతోంది. కచ్చితంగా ఒక ప్రజాస్వామ్య సమాజంలో మనలాంటి బీద దేశంలో బీదల కన్నీళ్లు తొలగించాలి. బీదల కష్టాల్ని తగ్గించాలి. సంక్షోభంలో ఆదుకోవాలి. కానీ ప్రభుత్వాలు తాత్కాలిక చర్యలే చేపట్టి చేయాల్సిన పనులను మానేస్తే ఏం జరుగుతుంది..చిన్నపాటి వర్షాలకు సైతం అతలాకుతలం అవ్వాల్సిన పరిస్థితులు ఉత్పన్నం అవుతాయి.

ప్రకృతి ఎప్పుడూ కూడా విలయతాండవం చేస్తూ ఉంటుంది. మానవ చరిత్రలో కొన్ని లక్షల సంవత్సరాలను పరిశీలిస్తే కేవలం 12 వేల సంవత్సరాల పాటు మాత్రమే ప్రకృతి కాస్త ప్రశాంతంగా ఉంది. అడపా దడపా అధిక వర్షపాతం కావొచ్చు.. వర్షాభావం కావొచ్చు..తుపానులు కావొచ్చు.. వరదలు కావొచ్చు.. కొన్ని సందర్భాల్లో భూకంపాలు కావొచ్చు.. ఇవి అనివార్యం. ఇది రాకూడదని కోరుకోవడం మూర్ఖత్వం. వచ్చాక ప్రతిసారి బెంబేలెత్తిపోవడం, ఆ సమస్య వచ్చినప్పుడు ఆ రెండు రోజుల పాటు ఏదో హడావుడి చేయడం, తాత్కాలికమైన సాయం అందించడం తప్ప దీర్ఘకాలిక చర్యలు కొరవడ్డాయి. ఇది మొట్టమొదటి సమస్య.



రెండోది..ప్రభుత్వాలకు సామర్థ్యం కొరవడింది. మనకు హడావుడి సామర్థ్యమే తెలుసు తప్ప దీర్ఘకాలంగా ఓ పని చేయాలంటే సామర్థ్యం కొరవడింది. ఒక రెండు ఉదాహరణలు పరిశీలిస్తే..సర్ ఆర్థర్ కాటన్ తెలుగు నాట ఆనాడు గోదావరి, కృష్ణా మండలాల్లో మొట్టమొదటగా నీటిపారుదల ఇచ్చారు. గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతంలో ఆ రైతులందరికీ చాలా ప్రయోజనం కలిగింది. తెలుగునాట అవి అన్నపూర్ణగా మారాయంటే సర్ ఆర్థర్ కాటన్ వల్లే. ఆనాడు ఆయన ఎంతో ముందు చూపుతో ఓ పక్క పంట నీరు తీసుకువస్తూ మరో పక్క మురుగు నీరు పంపే ఏర్పాటు చేశారు. కాలక్రమేణా మనం ఏం చేశాం. డ్రెయిన్లు కానీ ఇరిగేషన్ కాల్వల నిర్వహణ కానీ ఏనాడు చేపట్టలేదు. 1989లో నేను తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా ఉండగా 450 మి.మీ. వర్షపాతం వచ్చింది. నాలుగున్నర లక్షల ఎకరాల వరి పంట పూర్తిగా మునిగిపోయింది. తాత్కాలికంగా ప్రభుత్వం అదిస్తాం..ఇదిస్తాం అని తప్ప ఏం చేయాలనే ఆలోచన చేయలేదు. ఆనాడు ప్రత్యేక పరిస్థితుల్లో ఆదుకున్నాం. మొట్టమొదటి సారిగా డెల్టా చరిత్రలో రెండోసారి పంట వేసే ఏర్పాటు చేశాం. ఒరిస్సా నుంచి తమిళనాడు వరకు ఎక్కడ నారుమళ్లు ఉన్నా కూడా తీసుకొచ్చి రైతులకు భరోసా ఇచ్చి రెండోసారి మీరు పంట ధైర్యంగా వేయండని చెబితే బ్రహ్మాండంగా పంట పండింది. అయితే అది తాత్కాలికమే.. ఆనాడు నిజమైన ప్రయత్నం జరిగిందేంటంటే.. డెల్టాలో పెద్ద వర్షం కురిసినా కూడా మునిగిపోకుండా డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయడం ఎలా అని గట్టిగా కసరత్తు చేశాం. అప్పుడు సీతాపతిరావు గారు సూరింటెండెంట్ ఇంజినీర్‌గా ఉండేవారు. ఆయనతో కూర్చుని ఓ పథకం తయారు చేసి చెన్నారెడ్డిగారిని ఒప్పించాను. ఆయన 1990వ దశకంలో ప్రపంచబ్యాంకును ఒప్పించి గోదావరి, కృష్ణా డెల్టాల్లో ఆ పథకాన్ని అమలు చేశారు. అది జరిగి 30 సంవత్సరాలైంది. మళ్లీ ఈనాటికీ చేపట్టలేదు. నిరంతరం నిర్వహణ ఉండాలి కదా! అక్రమణలు తొలగించకుండా, డ్రెయిన్లను శుద్ధి చేయకుండా ఇలాంటి విపత్తులు వచ్చినప్పుడు హాహాకారాలు చేస్తున్నాం.

గతంలో తుంగభద్రకు విపరీతమైన వరదలు వచ్చాయి.. కర్నూలు పట్టణం అంతా కూడా దెబ్బతింది. కృష్ణా నదిలో ఆనాడు 25 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కిందికి పంపించారు. అదృష్టవశాత్తూ నాగార్జునసాగర్ నిండలేదు కాబట్టి అంతనీళ్లు కిందకి వెళ్లాల్సిన అవసరం లేదు. ఆనాడే ప్రభుత్వానికి గట్టిగా చెప్పాను..ప్రధానమంత్రిగారు వస్తే చెప్పాను. బ్రిటీష్ వాళ్ల కాలం నుంచి కూడా గోదావరికి కరకట్టలు పటిష్టంగా ఉన్నాయి. 32 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా కూడా తట్టుకునే శక్తి ఉంది. అయితే కృష్ణానదికి అలా కాదు..ఇప్పటి వరకు ఇంత వరదలు రావనుకున్నాం.. వచ్చాయి..ఇక ముందు కూడా రావొచ్చు.. 18 లక్షల క్యూసెక్కులు వదిలాం కాబట్టి ముప్పు తప్పింది...కావున కృష్ణా కరకట్టలను బాగు చేయించే పని మీరు తీసుకోవాలని అనగానే ప్రధాని వెంటనే అంగీకరించారు. అధికారికంగా జాతీయస్థాయి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే తాము పూర్తిగా సాయం చేస్తామని అందులో పేర్కొన్నారు. కానీ ఈనాటి వరకు ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు. తాత్కాలికంగా ఆ రెండు రోజులు



హడావుడి తప్ప దీర్ఘకాలిక ప్రణాళికలు లేవు. ఇంకో 50 ఏళ్లకో లేదా ఎప్పుడైన ఈ స్థాయిలో వరదలు రావచ్చు. రాకపోవచ్చు..కానీ దాన్ని తట్టుకునే సన్నద్ధత ఉండాలి కదా?

మీరు యూరప్‌లో నదులను చూస్తే.. సీఎండ్ నది పారిస్ నగరంలో ఉంటుంది..ఒకనాడు బురదకూపంలా ఉండేది..ఇవాళ దాన్ని చూడండి..పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు. వరదలు రాకుండా చర్యలు చేపట్టారు.

జర్మనీలో రెయిన్ నది చూస్తే నౌకా విహారం ఉంటుంది..వాటర్ స్పోర్ట్స్ ఉంటాయి..బోటింగ్ వగైరా ఉంటాయి.. నీటిపారుదలకు ఉపయోగిస్తుంది..అన్ని రకాలుగా ట్రెయిన్ చేశారు.. ఉత్తరాదిలో గంగను తీసుకుంటే గంగానది ఢిల్లీ నుంచి మీకు బంగాళాఖాతంలో చేరే వరకు 1500 కి.మీ. దూరం ఉంటుంది. కేవలం 300 కి.మీ. మాత్రమే కిందికి దిగుతుంది. ఐదువేల మీటర్లకు ఒక్క మీటరు దిగుతుంది. చాలా ఎత్తున ప్రవహిస్తోంది. పైనుంచి నీళ్లు వస్తే వరదలు విపరీతంగా వస్తాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో వరదలు వస్తే ఉత్పాతం ఏం జరుగుతుందో మనందరికీ తెలుసు. స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు అయినా ఈనాటికి కూడా ఆ గంగా నదిని సరిగా ట్రెయిన్ చేయలేదు. ఏటా వరదలు వచ్చి లక్షల మంది జీవితాలు నాశనం అవుతున్నా మనం సరైన చర్యలు చేపట్టలేదు. దీర్ఘకాలిక చర్యల్లో ఏమాత్రం శ్రద్ధ తీసుకోలేదు. బ్రిటీష్ వాళ్లు చేసింది కొనసాగించిన చోట బాగుంది తప్ప మిగతావి ఏనాడు కూడా చేయలేదు. ఇప్పుడు వర్షం వచ్చిందని బాధపడితే ఎలా? వర్షాకాలం వర్షం వస్తుంది..వర్షం రాకపోతే మనమే కదా మళ్లీ గోల పెట్టేది..ప్రకృతి వర్షం విషయంలో ఏమైనా రేషన్ పెట్టిందా? ఒకసారి ఎక్కువ వస్తుంది..ఒకసారి తక్కువ వస్తుంది..భూతాపం తర్వాత గత 15..20 ఏళ్లుగా వర్షపాతం పెరిగింది.. ప్రతీ నెలా రాకుండా ఒక్కసారి చాలా ఎక్కువ వస్తుంది..ఒక్కోసారి తక్కువ వస్తోంది..దాన్ని మనం తట్టుకోవాలి.. రుతుపవనాలను మార్చే శక్తి ఎవ్వరికీ లేదు.. మారుతున్న రుతుపవనాలను అర్థం చేసుకుని దానికి అనుగుణంగా ప్రభుత్వాలు స్పందించాలి..వనరులు కేటాయించాలి..ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని ఉపయోగించాలి. వర్షం వస్తే వరద నీటిలో అల్లాడిపోతాం. మర్నాడు మళ్లీ తాగడానికి కూడా మంచినీళ్లు లేని పరిస్థితి. సహజ వనరులను సద్వినియోగం చేసుకోలేకపోతే ఆ జాతి చాలా పలచబడుతుంది. సహజవనరులను ఉపయోగించుకోవడం మనకు చేత కావాలి. ఆధునికత, నాగరికత ఆర్థికాభివృద్ధి అంటే అర్థం సహజవనరులను ఉపయోగించుకోవడం.లేనివి ఎవరూ సృష్టించలేరు..ఉన్నవాటిని వినియోగించుకుంటారు. ఏ సమాజం వాటిని సమర్థంగా వినియోగించుకుంటుందో ఆ సమాజం అభివృద్ధి చెందుతుంది. అంతేకాని అభివృద్ధి అంటే రూపాయి నోట్లు గుద్దేయడం కాదు. లేదంటే బ్లాక్ మనీ ఉత్పత్తి చేయడం కాదు..అభివృద్ధి అంటే సహజవరులను ఉపయోగించి సంపద పెంచడం. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోగలడం. ఇప్పుడు చాలా వరకు దాన్ని మర్చిపోయాం. 1977 నవంబర్ 19న భయంకరమైన తుఫాన్ మనకు తూర్పు తీరాన్ని తాకితే 20 వేల మంది దివి సీమలో చనిపోయారు.ఆ తర్వాత ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. ఒకవేళ ఉప్పెన వచ్చినా పెద్దగా నష్టం వాటిల్లకుండా తట్టుకునే ఏర్పాట్లు చేసింది.

సైక్లోన్ షెల్టర్‌లు నిర్మించింది. అవి ఇప్పటికీ పనికొస్తున్నాయి..కానీ ఆ తర్వాత మళ్లీ వాటిని పట్టించుకోలేదు.



రేపొద్దున మళ్లీ ఇంకో ఉప్పెన వస్తే అయ్యో షెల్టర్‌లు నాశనం అయిపోయాయే అని బాధపడతాం. కాబట్టి దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి. ఒక్కసారి మనం అప్రమత్తంగా లేకపోతే నష్టం జరగొచ్చు. కానీ ఒకసారి నష్టం జరిగాక కూడా అర్థం చేసుకోకపోతే దీర్ఘకాలిక చర్యలకు మనం ప్రాముఖ్యత ఇవ్వకపోతే ఈ వేళ తాత్కాలికంగా తృప్తి పరచాలి..చనిపోతే రూ.లక్షో..రెండు లక్షలో ప్రకటించాలి..ఈ రోజు బియ్యం ఇస్తే అద్భుతంగా జరిగినట్టు నటించాలి..అంతే. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల పట్టణాల్లో కావొచ్చు..గ్రామాల్లో కావొచ్చు ఎప్పుడు కూడా నష్టపోయేది బీదలే. ..ముంపు లేకుండా నగర ప్లానింగ్ ఎలా ఉండాలి..నగరాల్లో మరి వరద నీటి పారుదల ఎలా ఉండాలి..ఈ ప్రణాళికలు లేవు. కాస్త వర్షం వస్తే చాలు ముఖ్యమంత్రి నివాసం దగ్గర నుంచి ప్రతిచోటా మునిగిపోతోంది. దీనికి ప్రకృతిని కాదు నిందించాల్సింది..మనల్ని మనం నిందించుకోవాలి..

ప్రపంచంలోని లండన్, పారిస్ వంటి నగరాలను చూస్తే అక్కడ కాంటూరు సర్వేలు చేసి దానికి అనుగుణంగానే డ్రెయిన్లు, నీటిపారుదల వ్యవస్థ, రోడ్లు ఏర్పాటు చేశారు. మనకు అదేం లేదు. గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా లే అవుట్ నిర్మాణం చేస్తున్నాం. కాంటూర్‌లకు మన లే అవుట్‌లకు సంబంధం లేదు. మీరు మ్యాప్ మీద గీసిన విధంగా ప్రకృతి ఉండదు కదా?..నీరు పల్లమెరుగు..అది ఎప్పుడూ పల్లానికే పోతుంది. మనం దాన్ని ఆపలేం. కాబట్టి ఇప్పుడైనా ఈ సమస్యకు పరిష్కారం చూపడం పెద్ద కష్టం కాదు. బోల్డంత టెక్నాలజీ ఉంది. ఇంకా నగరీకరణ పెద్దగా జరగలేదు. భారతదేశంలో 30 నుంచి 35 శాతమే పట్టణాల్లో ఉన్నవారు. ఇది 65 శాతం కాబోతోంది. నగరాల్లో పట్టణాల్లో ఇప్పటికైనా మేల్కోవాలి. మనం డ్రెయిన్లు కూడా మూసేసి ప్లాట్‌ఫారం కట్టి దానిపైన ఇళ్లు కట్టిన సందర్భాలు కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో ఉన్నాయి. వాటిని తొలగించమని ఆనాటి మున్సిపల్ కమిషనర్‌ను కోరితే.. ఆయన ఓ ప్రయత్నం చేశారు..అంతే పార్టీల కతీతంగా కార్పొరేటర్లందరూ కలిసి ఆయన్ను బదిలీ చేయించారు. భూ ఆక్రమణలను రక్షించుకోవాలని తాత్కాలికంగా ఆ రోజు



ప్రయత్నించారు. వారిలో కొందరు బీదలు కూడా ఉండొచ్చు. అయితే ఈ ప్రకృతి వైపరీత్యాల వల్ల మళ్లీ నష్టపోయేదీ ఆ బీదలే. ఇది అర్థం చేసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలను ఆపే శక్తి మనకు లేదు. కానీ వాటి నుంచి వచ్చే ప్రభావాలను ఎదుర్కొనే శక్తి మనకు ఉంది. ఆ ప్రయత్నం మనం దీర్ఘకాలికంగా చేయకుండా ఎప్పటికప్పుడు తాత్కాలికమైన తాయిలాలు, ఈ పూటకు చర్యలు, రేపొద్దున కాస్త సద్దుమణిగి ఎండ రాగానే, వర్షం తగ్గగానే హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకోవడం మళ్లీ మర్చిపోవడం ఇది పద్ధతి కాదు. మన దేశంలో ఈ భూతాపం పరిణామం చూస్తుంటే వర్షపాతం మొత్తం మీదగా పెరుగుతున్నట్టు కనిపిస్తోంది. దీనికి మనం సిద్ధం కావాలి. దీర్ఘకాలిక చర్యలకు ఉపక్రమించాలి. అప్పుడే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

(మొదటిభాగం)

# ఆశావాదంతో ఒడుపుగా మార్పులు తేవాలి

స్వతంత్ర భారతం 75 - లోక్‌సత్తా 25

## డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో పద్మనాభరెడ్డి ముఖాముఖి




**పద్మనాభరెడ్డి: ఐఏఎస్‌ను వదిలిపెట్టి పాలన సంస్కరణల కోసం ప్రజల్లోకి వచ్చారు..మీరు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించండి**

జేపీ: మన దేశంలోనే ప్రభుత్వంలో ఉద్యోగం అంటే చాలా గొప్పగా భావిస్తాం. ప్రపంచంలో ఎక్కడా ఇలా లేదు. ఐఏఎస్ లేదా ఐపీఎస్ అయితే చాలా గొప్పగా భావించి నెత్తిన పెట్టుకోవడం అనేది భూస్వామ్య వ్యవస్థకు నిదర్శనం. మధ్యయుగాల సంస్కృతికి నిదర్శనం. అధికారం బట్టి మనిషికి గౌరవం ఇవ్వడం తప్ప దాని వల్ల సమాజానికి ఏం జరుగుతోందనేది లేకుండా పోయింది. అదృష్టంకొద్దీ అధికారం అంటే నాకు ఏనాడు మోజు లేదు. అవకాశం కొద్దీ చేతనైనంత చేశాం. నేను అసలు ప్రభుత్వంలో ఉద్యోగం కోసం రాలేదు. అధికారం కోసం రాలేదు. ఒక వైద్యుడిగా ఉండగా, 70వ దశకంలో అప్పుడే 25 ఏళ్ల స్వతంత్రం నేపథ్యంలో ఇవాళ కొంతమంది ఎలా ఆలోచన చేస్తున్నారో ఆ రోజుల్లో కూడా దేశం గురించి అలానే ఆలోచించారు. మహత్తరమైన ఆశయాలతో స్వాతం త్ర్యం వచ్చింది , ఎన్నో ఆశలతో స్వాతంత్ర్యం తెచ్చుకున్నాం అయినా అనుకున్నవి జరగడం లేదనే ఆర్తి ప్రజల్లో ఆనాడు మొదలైంది. ఆ తరానికి చెందిన వాడిని నేను. 1972-73 ప్రాంతంలో 16 ఏళ్ల కుర్రాడిగా అప్పుడే దేశం గురించి బాగా లోతుగా ఆలోచించాను. మన దేశంలో ఉన్న పరిస్థితులు, ఇతర దేశాల్లో పరిస్థితులను అంచనా వేశాను. అమెరికా లాంటి దేశాల్లో అధికారంలో ఉన్న వాళ్లు జవాబుదారీగా ఉంచడం, కొన్ని తప్పులు చేస్తే రాష్ట్రపతినే పదవి నుంచి తప్పించడం గమనించాను. మన దేశంలో విశృంఖలంగా అధికార దుర్వినియోగం, అవినీతి, బీదరికం కొనసాగడం ఈ తేడాలు కలచివేశాయి. అక్కడ నుంచి నా ప్రయాణం ప్రారంభమైంది. ఎమర్జెన్సీ రావడం, అది పోవడం, పోయాక ఆనందపడటం తర్వాత పెద్దేమీ మార్పు రాలేదని దు:ఖపడటం. ఏ కారణాల వల్ల ఐఏఎస్‌కు వెళ్లానో అదే కారణాలతో బయటకి వచ్చాను. ఈ మధ్యలో తేడా ఏంటంటే..నేర్చుకోవడానికి అవకాశం దొరికింది. అంతకు ముందు ఆవేదన ఉంది..ఆవేశం ఉంది. ఆదర్శం ఉంది. అనుభవం లేదు. క్షేత్రంలో ఏం జరుగుతుందో అవగాహన లేదు. ఆదర్శ భావాలు తప్ప నిర్దిష్ట పరిష్కారాలు లేవు. ప్రభుత్వ ఉద్యోగం నేర్పింది ఏమైనా ఉందంటే నిర్దిష్టమైన పరిష్కారాలు . ఎక్కడ, ఏమిటి తప్పు జరుగు తోంది..వ్యక్తులు కాదు సమస్య వ్యవస్థలో ఎక్కడెక్కడ బలహీనతలు ఉన్నాయనే విశ్లేషణకు అవకాశం దొరికింది. ఒకసారి అర్థం అయిన తర్వాత రెండే మార్గాలు. అర్థం అయింది బుర్రలో ఉంచేసి పక్కన పడేయడం, అప్పుడప్పుడు

మాట్లాడటం, మన జీవితాన్ని మనం చూసుకోవడం, లేదంటే దాని కోసం పోరాడటం. దాని కోసం పోరాడటం అనివార్యం అనిపించింది కాబట్టి బయటకు వచ్చాను.. అప్పుడు ఉన్న పనే ఇప్పుడు చేస్తున్నాం. అయితే అప్పుడు నెల జీతం ఉంది..ఇప్పుడు నెల జీతం లేదు తేడా అంతే. అయితే ఈ 25 ఏళ్ల ప్రయాణంలో చాలా అనుభవాలు వచ్చాయి. మొదట్లో ప్రధానంగా మంచి చట్టాలు ఉంటే మంచి ఏర్పాట్లు చేస్తే సరిపోతుందనుకున్నాం. ఇప్పుడు కచ్చితంగా మరింత లోతు అర్థం అయింది. అలాగే మన దేశంలో ఉన్న బలాలు కూడా మనకు పూర్వం కంటే స్పష్టంగా అర్థం అవుతున్నాయి. ఎందుకంటే ప్రభుత్వాలు ఎంత అధ్వానంగా ఉన్నా రాజకీయం అంతా కుళ్లిపోయినా కొన్ని రంగాల్లో దేశం బాగా అభివృద్ధి చెందుతోంది. ప్రజల తపన వల్ల, ప్రపంచంలో మారుతున్న పరిస్థితుల వల్ల, టెక్నాలజీ వల్ల. దాన్ని ఉపయోగించుకుంటూ కొరతను తీర్చడం ఎలా? రెండోది రాజకీయంలో ఉన్న వాళ్లు కూడా ఒక ఊబిలో కూరుకుపోయారు..ఒక ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. దాన్నుంచి బయటపడేయటం ఎట్లాగా? మూడోది మనదేశంలో చర్చ ఎంతసేపటికి రాజకీయం గురించే జరుగుతుంది రాజకీయంలో ఉన్న వాళ్ల గురించే మాట్లాడుతున్నారు. అసలు సమస్య అక్కడ కాదు. అసలు సమస్య రెండు రకాలు..క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోంది. రెండోది పరిపాలనా యంత్రాంగం ఏం చేస్తోంది. కాబట్టి ఈ వ్యవస్థలో చాలా సంక్లిష్టమైన ఏర్పాట్లు ఉన్నాయి. అంతా రాజకీయ కోణం నుంచి చూస్తే చాలదు. ఈ రాజకీయానికి ఉన్న గ్లామర్ తీసేయాలి. ఆచరణ సాధ్యమైన ఆలోచన చేయాలి. మనం అందరం ఈ దేశం నుంచి చాలా నేర్చుకున్నాం. అయితే ఒక్కటే తేడా ఏంటంటే.. ఆనాడు లోక్‌సత్తా ప్రారంభించినప్పుడు ఐదేళ్లలో దేశంలో మార్పు వస్తోందని గట్టిగా నమ్మినవాళ్లలో నేను ఒకడిని. మార్పు రావడానికి మన మనస్సులు తప్ప నిజమైన అవరోధాలు ఏం లేవు. మనం సమాజంగా సిద్ధం కాకపోవడం తప్ప, ఇంకేం ప్రతిబంధకాలు లేవు. నాయకత్వానికి గనుక ముందు చూపు ఆలోచన ఉన్నట్టయితే, ఉన్న సాక్ష్యాల ప్రకారం హేతుబద్ధంగా కనుక మార్పుల కోసం ప్రయత్నాలు చేస్తే ఐదు నిమిషాల్లో తేవచ్చు. ఈ 25 ఏళ్లలో మనకు నేర్పింది ఏంటంటే ..పరిష్కారాలు మనకు స్పష్టంగా అర్థం అయినా కూడా ఆచరణలోకి రావడానికి కొన్ని సందర్భాల్లో దశాబ్దాలు పడుతుంది. ఓ 25 ఏళ్లు ప్రయాణం చేశాం. నా ఉద్దేశంలో మరో 25 ఏళ్లు పట్టొచ్చు. కొన్ని రంగాల్లో బాగుపడుతోంది. కొన్ని రంగాల్లో గతంకంటే అధ్వానం అవుతోంది. కొన్ని రాజకీయాలతో కూడా సంబంధం లేకుండా ఆర్థిక వ్యవస్థలో కానీ, టెక్నాజీలో కానీ మంచి మార్పులు వస్తున్నాయి. దాన్ని మనం ఉపయోగించుకుని నిరాశావాదంతో కాకుండా ఆశావాదంతో ఒడుపుగా మార్పులు తేవడం ఎలా? ప్రస్తుతం ఆ దశలో ఉన్నాం. ఒక రకంగా మన చర్చ కూడా ఇవాళ ఉన్న పరిస్థితుల్లో ప్రజలకి సమాజానికి దేశంలో మార్పును కోరేవాళ్లకి ఊరికే ఇతరులను తిట్టడం లేకపోతే విమర్శించడం కాకుండా నిర్మాణాత్మక మార్గం ఏంటి? మనకి ఆ చర్చ కావాలి. కచ్చితంగా మన దేశంలో మౌలికమైన మార్పులకు సమయం ఆసన్నమైంది. ఈ 25 ఏళ్లలో విద్యావ్యవస్థ విస్తరించింది కానీ విద్యా ప్రమాణాలు పూర్తిగా నాశనం అయిపోయాయి. ప్రపంచంలోనే అధ్వానంగా ఉన్నాం. కానీ మన తల్లిదండ్రులకి మన పిల్లలకి మన టీచర్లకి, మేనేజ్‌మెంట్లకి మన సమాజానికి విద్య అంటే మక్కువ ఉంది. దాన్ని పెంచాలనే కోరిక ఉంది. డిమాండ్ సైడ్ బాగుంది కాబట్టి ఈ మధ్య కాలంలో నూతన జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చింది. సరిగ్గా కూర్చుని జాతీయ స్థాయిలో ఐదారేళ్లలో విద్యను పూర్తిగా మార్చొచ్చు. ఆరోగ్యం అధ్వానంగా ఉంది. ప్రపంచానికి ఆరోగ్యం ఇచ్చే శక్తి మనకు ఉంది. కానీ మన ప్రజలకు మంచి ప్రమాణాలతో, తక్కువ ఖర్చుతో వైద్యాన్ని అందించ కలేకపోతున్నాం. వైద్య ఖర్చుల కోసం కోట్లాది మంది బీదలైపోతున్నారు. కానీ పెద్దగా డబ్బు ఖర్చు లేకుండా సులభంగా ఆరోగ్యాన్ని బాగు చేయడానికి మనకు మార్గాలు ఉన్నాయి. ఆ మార్గాలను మనం వెతికిపట్టుకోవాలి. పరిపాలనలో కావచ్చు, విద్య, ఆరోగ్యంలో కావొచ్చు. చట్టబద్ధ పాలనలో కావొచ్చు. ప్రభుత్వ ఆఫీసుల్లో పని జరగడం కావొచ్చు. అది మనకు అర్థం అయితే విమర్శించడం కాకుండా పరిష్కారంలో భాగం కాగలం. మన అనుభవంతో ప్రజలు, సమాజానికి స్పష్టత ఇవ్వగలం, మనకు చేతనైనంత మేరకు అడుగులు వేయగలం. పరిష్కారాలు సాధించగలం.

**ప్రశ్న: దేశం ఎదుర్కొంటున్న క్లిష్ట సమస్యల్లో అవినీతి ఒకటి. ఇది ఎన్ని రకాలుగా ఉంటుంది. దీన్ని అరికట్టాలంటే ఏం చేయాలి? పౌరుల పాత్ర ఎలా ఉండాలి?**

జేపీ: రెండు మౌలికమైన విషయాలు మనకు అర్థం కావాలి. నీతి, అవినీతి అనేది కేవలం నైతికపరమైన విలువల అంశంగా పరిగణిస్తున్నాం. అలాగే ఆలోచిస్తే పరిష్కారం రాదు. ఇది ఒక ప్రాక్టికల్ అంశం. రోజువారీ జీవితంలో మనందరం ఎదుర్కొంటున్న సమస్య. ప్రజలందరూ మంచివాళ్లయితే బాగుండును..ప్రభుత్వం అంతా మారిపోతే బాగుండును అనుకుంటే ఈ సమస్య పరిష్కారం కాదు.

అవినీతి స్థూలంగా మూడు రూపాల్లో ఉంది. గతి లేక సామాన్యుడు హక్కుగా పొందాల్సిన పనికి లంచం ఇస్తున్నాడు. మన చట్టం ఏం చేసింది..లంచం ఇచ్చిన వాడ్ని కూడా నేరస్తుడిగా చిత్రీకరించి అది పెద్ద నైతికమైన అంశంగా ప్రజల ముందు పెట్టి సమాజాన్ని నాశనం చేస్తున్నాం. ఇంతకంటే మూర్ఖమైన చర్చ ఇంకోటి లేదు. భారతదేశంలో నూటికి 58 కుటుంబాలు ఎక్కడో ఒక చోట ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం ఇస్తున్నారని అంతర్జాతీయ సర్వేల్లో తేలింది. రెండు మూడేళ్లలో అన్ని కుటుంబాలు వస్తాయి. అంటే భారతదేశంలో ఉన్న ప్రజలంతా పరమ మూర్ఖులా? పరమ దుర్మార్గులా? పరమ అవినీతి పరులా? ఏమి ఆలోచన అది. ఇంతకంటే మూర్ఖపు చర్చ ఏమైనా ఉందా? గతి లేక లంచం ఇస్తున్నారు కావున లంచం ఇవ్వకుండా పనిజరిగే ఏర్పాటు ఎలా చేయాలి? కొన్ని పద్ధతులను ప్రవేశపెట్టాలి.

సేవ సకాలంలో సమర్థంగా, పారదర్శకంగా అందే అవకాశం కల్పించడం. ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకోవడం. ఈ పనులు చేస్తే చాలా మేరకు ఈ లంచం తగ్గిపోతుంది. సేవలను ఎలా మెరుగుపర్చాలి? పరిపాలనా యంత్రాంగాన్ని ప్రజలకు జవాబుదారీగా ఎలా చేయాలి? అనే దానిపై దృష్టి పెట్లాలి. మన దేశంలో ఏమైందంటే సేవలు అందించాల్సిన వాడు యజమాని అయ్యాడు.. హక్కుగా సేవలు పొందాల్సిన వారు బానిసలయ్యారు. ఈ నేపథ్యంలో సేవలందించే వారిని జవాబుదారీగా ఉండేలా చేయాలి. సిటిజన్ చార్టర్స్‌ను అమలు చేయాలి.. కాలపరిమితి పెట్టి కచ్చితంగా అమలయ్యే ఏర్పాటు చేసి అమలు కాకపోతే రోజుకు రూ. వందో, రెండొందలో పరిహారం ఇచ్చి అమలయ్యేలా చేస్తే చాలా వరకు మారిపోతుంది. గతంలో మున్సిపాల్టీల్లో కొన్ని చోట్ల సిటిజన్ చార్టర్‌లు అమలు చేశారు. అయితే చట్టబద్ధత లేకపోవడంతో అంతరించి పోయాయి. అవినీతి అనేది కేవలం నీతి, నైతిక విలువల సమస్య కాదని అర్థం చేసుకోవాలి.

**ప్రశ్న: అవినీతిని మేజర్, మైనర్ అని రెండు రకాలుగా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ నిర్వచిస్తోంది. వాళ్లు మేజర్ కరెప్షన్‌ను ప్రధాన సమస్యగా చూస్తున్నారు. అయితే రోజువారీ జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న లంచం సమస్య ప్రధానంగా ఉంది. దీన్ని నిర్మూలించేందుకు ఏర్పాటు చేసిన సంస్థలు కూడా సరిగా పనిచేయకపోవడంతో ప్రజల్లో ఒకరకమైన నిర్లిప్తత వచ్చింది..దీన్నుంచి ఎలా బయటపడాలి.**

జేపీ: మనం బాగున్నాయనుకున్న దేశాల్లోనూ మేజర్ కరెప్షన్ ఉంది. అమెరికా లాంటి దేశాల్లో కూడా లాలూచీ పడే అవినీతి ఉంది. కానీ మనకంటే కొంచెం సుతారంగా జరుగుతుంది. సెనేటర్లకో లేదా ఎన్నికల్లో పోటీచేసే వాళ్లకో అధికారికంగానే నిధులు ఇస్తారు. నిధులు ఇచ్చారు కాబట్టి వారు ఏం కోరారో చట్ట రూపంలో చేసి పెడతారు. రహస్యం ఉండదు. కానీ కచ్చితంగా డబ్బులు చేతులు మారతాయి. ఆ డబ్బుల వల్ల నిర్ణయాలు మారుతున్నాయి..అదేగా అవినీతి అంటే. కానీ రోజు వారీ జీవితంలో అక్కడ లంచం కనిపించదు. అమెరికా, జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో సామాన్యుడికి ప్రభుత్వంతో రోజు వారీ అవసరమే ఉండదు. ఇంట్లో కూర్చుని చేసే ఏర్పాట్లు చాలా వరకు చేశారు. ఒకవేళ ఏదైనా సంబంధం ఉన్నా కూడా షాపులో ఓ వస్తువును ఎంత సునాయాసంగా కొనుగోలు చేసుకుంటామో అలా ప్రభుత్వంలో జరిగే ఏర్పాటు చేశారు. కాబట్టి రోజువారీగా జరిగే అవినీతి ముఖ్యం కాదని విజిలెన్స్ కమిషన్ భావించడం సరైన ఆలోచన కాదు. కానీ దానికి పరిష్కారం విజిలెన్స్ కమిషన్, ఏసీబీ కాదు. ఎందుకంటే ఇన్ని లక్షల మందిని జైళ్లలో పెట్టలేరు..అది సాధ్యమయ్యే పనికాదు. జరిగే పనికాదు. హత్యలు జరిగితే ఈ దేశంలో జైలు శిక్ష పడడం లేదు. నూటికి పదిమందికే శిక్ష పడుతుంది. కావున దీనికి సులువుగా పని జరిగే ఏర్పాట్లు చేయాలి. పరిపాలనా యంత్రాంగాన్ని ఎలా జవాబుదారీగా చేయాలి? టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలి? పనిలో పారదర్శకత ఎలా తీసుకురావాలి? అధికార వికేంద్రీకరణ ఎలా చేయాలి? ఈ నాలుగు చేస్తే ఫలితాలు వస్తున్నాయి. రెండోది..లాలూచీ అవినీతి వల్ల ఇద్దరూ లాభం పొందు తున్నారు.. సమాజం నష్టపోతుంది. మనం మామూలుగా చూసేది రాజకీయ అవినీతి. పోటీ రంగంలోకి ఆర్థిక స్వేచ్ఛ ఇచ్చి ప్రభుత్వాలు నియంత్రణ చేయాలి అంతే దీనివల్ల కొంత మార్పు వస్తుంది. రెండోది పారదర్శకత. 2జీ స్పెక్ట్రమ్‌లో ఏం చేశారు.. కావాల్సిన వాళ్లకు ఇచ్చేశారు. దీంతో దేశం అంతా గగ్గోలు అయ్యింది. వ్యవస్థాగతంలో ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా సుప్రీంకోర్టుకు వెళ్లింది. మహామహులందరూ కలిసి వచ్చారు. 120 లైసెన్సులు రద్దు చేశారు. శాశ్వతంగా వేలం పాటల ద్వారా కేటాయింపులు చేసేలా నిర్ణయం జరిగింది. ఫలితంగా 5జీ స్పెక్ట్రమ్‌లో అన్యాయం జరిగిందని ఒక్కరు కూడా చెప్పలేదు. గొంతు చించుకోవడం, కోర్టులు..శిక్షలు అని కాకుండా ముందు పద్ధతులు మార్చడం చాలా ముఖ్యం. మనదేశంలో రాజకీయంగా లాభం కోసమో, పత్రికల్లో బాతాఖానీ కోసమో మనం దాన్ని ఓ నాటకీయంగా మారుస్తున్నాం తప్ప ఇలాంటిది ఎందుకు

వచ్చింది..పోవాలంటే ఏం చేయాలన్న చర్చ జరగడం లేదు. కొన్ని రోజులు జైలులో పెట్టడం, ..తర్వాత బెయిల్ రావడం.. బయటకు రావడం..ఇదంతా ఓ డ్రామా అయిపోయింది. దీన్నుంచి కార్యకారణ సంబంధం. ఏం జరిగింది..ఎందుకు జరుగుతుంది...ఇలా జరక్కుండా చేయాలంటే ఏం చేయాలి. ప్రపంచం అంతా ఏం చేస్తోంది..మన దేశంలో ఎలా చేస్తే దాన్నుంచి బయట పడ్డాం..వంటి అనుభవాలు ఉన్నాయి. వీటిని ఆలోచించాలి. అయితే మనకు ప్రతీ రోజు పరగడుపులా అయిపోయింది. ఉన్న అనుభవాన్ని ఉపయోగించుకోవడం లేదు. ఇక మూడోది రాజకీయ అవినీతి. ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ అవినీతి లేకుండా ఎలా ఉంటుంది. ప్రధానమంత్రి ఎవరు ఉన్నా, ముఖ్యమంత్రి ఎవరు ఉన్నా..సరే ఈ డబ్బుల రాజకీయంలో, అక్రమ ఖర్చు రాజకీయంలో వీరు పూర్తిగా మునిగి తేలిపోతున్నారు. వాజ్‌పేయి గారు కనీసం బహిరంగంగా మాట్లాడే వారు. మనందరం అబద్దం ఆడి రాజకీయాలను నడుపుతున్నాం..ఎన్నికల్లో పోటీ చేసిన తర్వాత నెగ్గిన తర్వాత మనందరం కూడా దొంగ సర్టిఫికెట్లు ఇచ్చి చట్టం చెప్పిన ఖర్చుకంటే తక్కువే పెట్టామని చెప్పి లెక్కలు ఇచ్చాం. కానీ మనందరం కూడా దానికంటే ఎక్కువ ఖర్చు పెడుతున్నాం అనే వారు. ఇప్పుడు ఆ స్పృహ కూడా పూర్తిగా పోయింది.మాట వరుసకు కూడా ఆ మాట అనడం లేదు. ఎన్నికల వ్యవస్థను ఎలా మార్చాలనే తపన ఉండాలి. ఈ డబ్బుల ఖర్చు, ఓట్ల కొనుగోలు లేకుండా ఎన్నికల్లో నిజాయితీ పరులు, సమర్థంగా గెలిచే ఏర్పాటు ఎలా చేయాలి. అది ఆలోచించకుండా రాజకీయం ఒక దారిన పోతుంటే అవినీతి లేనట్టుగా మనం నటిస్తే ఉపయోగం లేదు. ఎందుకంటే రూ. 30 కోట్లు ఎమ్మెల్యే కోసం ఖర్చు పెట్టిన తర్వాత వాళ్లు బతకాలి గదా! కొంతమందికి మినహాయింపు ఉన్నా, ఎక్కువ మంది గెలిచిన తర్వాత సంపాదనపైనే దృష్టి పెడుతున్నారు.

ఎన్నికల వ్యవస్థను మార్చకుండా అక్కడ ఏమీ లేనట్టుగా నటిస్తూ మామూలుగా సాధారణీకరణ చేశారు. అది రొటీన్‌గా చేసి పారేశారు. అది నడుస్తూ ఉంటుంది..కానీ దేశం మాత్రం అద్భుతంగా ఉండాలి. అలా నడవదు. మూడు స్థాయిల్లో మార్పు కావాలి. క్షేత్రస్థాయిలో సామాన్యులకు అందాల్సిన సేవలు అందే ఏర్పాట్లు చేయడం, ప్రభుత్వ నిర్ణయాల్లో లాలూచీ పడే అవసరం లేకుండా ప్రైవేటు రంగం కానీ పారదర్శకత గానీ పోటీగా తీసుకురావడం, రాజకీయాల్లో అక్రమార్జన లేకుండా చేయడం. నూటికి నూరుపాళ్లు పరిష్కారాలు ఉన్నాయి. మనదేశంలో ఆ ప్రయత్నం ఎక్కడ చేశామో అక్కడ ఫలితాలు అద్భుతంగా వచ్చాయి. చేయకుండా మాట్లాడితే మాటలు నడిచాయి..రాజకీయంగా కొందరి పబ్బం గడిచింది..కానీ దేశం బాగుపడలేదు. బోఫోర్స్ అంశాన్ని ఒక ఎన్నికల్లో ప్రజల్ని మభ్యపెట్టడానికి రాజకీయంగా ఉపయోగించుకున్నామే కానీ మార్పుకు మనం నాంది పలకలేదు. ఎక్కడ నాంది పలికామో అక్కడ పరిష్కారాలు వస్తున్నాయి. అవినీతి అనేది భారతదేశంలో ప్రజల వల్ల రావడం లేదు. ప్రజలు అవినీతిపరులు కాదు..ఈ దేశం ఏదేశం కంటే తక్కువ కాదు. ఆ మాట కచ్చితంగా చెప్పగలను. ప్రజల్లో నైతిక విలువలు లేకపోవడం వల్ల జరగడం లేదు. వ్యవస్థను సరిగా ఏర్పాటు చేసుకోకపోవడం వల్ల జరిగింది. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ దుర్వినియోగం అనేది అనివార్యంగా అవుతోంది. ఇది లేకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేయకుండా అవినీతి ఉందని గగ్గోలు పెడితే ఉపయోగం ఏం ఉంది. గాల్లో దీపం పెట్టి దీపం ఆరిపోకూడదంటే ఎలా? కాబట్టి కచ్చితంగా మార్చుకోగలం. కొన్ని రంగాల్లో మార్చుకున్నాం. కొన్ని రంగాల్లో అవినీతి తగ్గింది.

**ప్రశ్న: నల్లధనం అంశం ఎన్నికల్లో ఓ ప్రధాన అస్త్రంగా మారుతోంది. నల్లధనం బయటకు పోవడానికి మార్గాలేంటి? దాన్ని మనం తిరిగి తెప్పించుకోగలమా?**

**జేపీ:** గ్లోబల్ ఇంటిగ్రేటెడ్ రిపోర్టు ప్రకారం...ఏడాదికి రూ. 5 లేదా 6 లక్షల కోట్ల రూపాయలు.. ఒకటి..ఒకటిన్నర ట్రిలియన్ డాలర్ల దాకా ఇతర దేశాలకు వెళ్లిపోయి ఉండొచ్చు. భారతదేశం నుంచి పోయిన డబ్బు హవాలా రూపంలో తిరిగి ఈ దేశానికి వస్తోంది. మారిషస్‌తో గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం పెట్టుబడుల రూపంలో ఆ దేశం నుంచి మన దేశానికి వచ్చింది. అది ఇక్కడి నుంచి వెళ్లిన డబ్బే. రకరకాల కారణాలతో తిరిగి మళ్లీ మనదేశానికి తిరిగి వస్తోంది. అయితే అది పన్నులు కట్టని డబ్బు అవుతుంది. పోయిన డబ్బు తిరిగి వస్తుందనడానికి పెద్దగా ఆధారాలు లేవు. వస్తే ప్రయత్నం చేయండి కానీ పోతున్న డబ్బు ఉంది . ఇప్పటి వరకు మనం వంద స్థాయిలో ఉంటే వచ్చే 15-20 ఏళ్లలో వెయ్యికి వెళతాం. వందలో పోయిన దానికంటే వెయ్యిలో పోబోయేది చాలా ఎక్కువ. అంకెలు లెక్కలు చెప్పకుండా పోయేది చాలా ఎక్కువ. ఈ పోయేదాన్ని కాపాడడం చాలా ముఖ్యం. దానికి చాలా పద్ధతులు ఉన్నాయి..దానిపై దృష్టి పెట్టాలి. ఈ దేశంలో నిజాయితీపరుల కుటుంబాలు కూడా అక్రమాస్తులు ఏమీ లేకపోయినా కూడా ఒక చిన్న ఆస్తి కొనాలన్నా..అమ్మేవాడు నగదు రూపంలోనే

తీసుకుంటానంటాడు..కాబట్టి కొనేవాడు చెక్‌లను కూడా నగదు రూపంలోకి మార్చి క్యాష్ ఇవ్వాల్సి వస్తోంది. కారణం ఎవరు? ఈ ప్రభుత్వాలు. నోట్లరద్దు సమయంలో ప్రధాని మోదీని పదేపదే కోరాను..రియల్ ఎస్టేట్ రంగంలో నల్లడబ్బు అవసరం లేకుండా..క్యాపిటెల్ గెయిన్స్ టాక్స్ తగ్గించండి..టాక్స్ కట్టకుండా ఉండడానికి క్యాష్ రూపంలో తీసుకోవడానికి అభ్యంతరం లేకుండా పోతుంది. క్యాపిటెల్ గెయిన్స్ ట్యాక్స్ తగ్గిస్తే, కొనేవాడికి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు పెడుతున్నారు..స్టాంపు డ్యూటీ తగ్గించండి. ప్రభుత్వ విలువకు, బహిరంగ మార్కెట్‌లో విలువకు చాలా తేడాలున్నాయి. నూటికి 80-85 వచ్చేట్టు చేయండి. అప్పుడు ప్రభుత్వానికి పన్నుల ఆదాయం తగ్గదు..ప్రజలకు పన్నుల భారము పెరగదు..నల్లడబ్బు అవసరం ఉండదు. ఎవరికీ నొప్పి లేదు. ఇంతకంటే మంచి మార్గం చూపించండి. కానీ దీన్ని ఎందుకు చేయరు. నాలాంటి వాళ్లం ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాం. కాబట్టి చిత్తశుద్ధి ఉంటే ఈ పనిచేద్దాం. ఇదే అంశాన్ని ఎన్నికల్లో రాజకీయ అస్త్రంగాను వాడుకుంటున్నారు. నిజంగా వ్యవస్థలో ఉన్న అరిష్టాలను అరికట్టాలనే కోరిక ఉంటే మనం చెప్పుకున్న అంశాలలో ఏది కష్టం.

**ప్రశ్న: అవినీతిని తగ్గిస్తామని ఏ రాజకీయపార్టీ మేనిఫెస్టోలో చెప్పడం లేదు. అవినీతి అనేది ఎన్నికల్లో ప్రధాన అంశం కావడం లేదు. కానీ జాతి దీనివల్ల ఇబ్బందిపడుతోంది.**

**జేపీ:** అవినీతి గురించి సామాన్య ప్రజలు మాట్లాడడం లేదు. పదిరూపాయలు తిన్నా పర్వాలేదు..పని జరిగిపోతే చాలు అనుకుంటున్నారు. అయితే చాలా చోట్ల డబ్బులు తిన్నా పనిజరగడం లేదు. కాబట్టి అవినీతిని కచ్చితంగా తగ్గించాలి. అంతకంటే ముందుగా ప్రజలకు అందాల్సిన సేవలు సమర్థంగా సకాలంలో అందే ఏర్పాట్లు చేస్తే అప్పుడు అవినీతి గురించి ప్రజల్లో ఆలోచన వస్తుంది..అంతేకానీ అసలు సేవలు అందించే ఏర్పాట్లు చేయకుండా అవినీతిని తగ్గిస్తానంటే ప్రజలు ఎవరూ కూడా పట్టించుకోరు.. అవినీతిపై తాత్కాలికంగా ఉద్రేకం ఉండొచ్చు. కానీ దీర్ఘకాలంలో సమస్య పరిష్కారం కాదు. మన ప్రభుత్వాలు ఎంతసేపు రాజకీయం మీదే దృష్టి పెడుతున్నాయి. ఈ దేశంలో రెండుకోట్ల ప్రభుత్వ యంత్రాంగం ఉంది. వాళ్లంతా మన కుటుంబాల నుంచి, సమాజం నుంచి వచ్చిన మన పౌరులే. కానీ ఒకసారి ప్రభుత్వంలో కూర్చోగానే వాడు పైవాడు, మనం కిందవాళ్లం..ఈ వలసవాద పాలన ధోరణి ఇటు ప్రజల మనసుల్లోనూ అటు ఉద్యోగుల మనసుల్లోనూ ఉంది. చివరికి ఎన్నికైన వాళ్లకు కూడా ప్రభుత్వ యంత్రాంగం అంటే భయం. వీళ్లతో గొడవపెట్టుకుంటే ఏమైపోతుందో అని. కాబట్టి ఈ యంత్రాంగాన్ని బాగు చేయడం ఎలాగ? సమర్థ సేవలు అందించే ఏర్పాట్లు చేయడం ఎలాగ? జవాబుదారీతనం ఎలాగ? అన్నిటిని మించి అధికారాన్ని మన ఊళ్లో, మన పట్టణంలో మనకి దగ్గరగా చేరువుగా పెట్టినట్టయితే చాలా మేరకు అదుపులోకి వస్తారు. 1960 దాకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ సమితి ప్రాథమిక పాఠశాలలు నడిపేది. జిల్లాపరిషత్ హైస్కూళ్లు నడిపేది. పంచాయతీ సమితి, జిల్లా పరిషత్‌లు వాటిని చాలా పట్టించుకునేవి..ఆనాడు విద్య అద్భుతంగా ఉండేది. సరైన సౌకర్యాలు లేకపోయినా ఆ రోజుల్లో చదువు బాగా వచ్చింది. ఎందుకని? అధికారాన్ని ఎప్పుడైతే సమాజానికి దగ్గరగా పెట్టారో అప్పుడు దాన్ని బాగా నడిపించుకుంటే మన పిల్లలు బాగుపడతారనే ఆలోచనతో సమాజం మొత్తం దాన్ని బాగా పోషించుకుంది..బాగా నడిపించింది. బ్రహ్మానందరెడ్డిగారి ప్రభుత్వంలో అనుకుంట ఉద్యోగుల జీతభత్యాలను ప్రభుత్వం నేరుగా ఇచ్చే ఏర్పాట్లు చేశారు. పంచాయతీ సమితి, జిల్లాపరిషత్‌ల ప్రమేయాన్ని తీసిపారేశారు. ఆ రోజుల్లో పీహెచ్‌సీలు పంచాయతీ సమితి చేతుల్లో ఉండేవి కాబట్టి డాక్టరు వస్తున్నాడా లేదా వస్తే మన ప్రజలకు సేవలు అందిస్తున్నాడా లేదా అనేది ఉన్నంతలో పట్టించుకునే పరిస్థితి ఉండేది. దాన్ని పూర్తిగా తీసిపారేసి వాటి పర్యవేక్షణ రాష్ట్రస్థాయికి మార్చేశారు. అక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి. డాక్టర్లు వెళడం లేదు నర్సులు వెళడం లేదని చెబుతున్నారు..ఆ బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించేస్తే వాళ్లు చూసుకుంటారు. ఆ పని చేయకుండా అధికారాలను మన దగ్గర పెట్టుకున్నాం. ఎప్పుడైతే అధికారాన్ని జనం దగ్గరకు చేర్చి జవాబు దారీతనం కోసం ఏర్పాట్లు చేస్తారో.. అప్పుడు మన ప్రజలనే ఉద్దేశంతో పని చేస్తారు. లేకపోతే వారు మందలిస్తారు..మనదేశంలో ఉన్నంత కేంద్రీకరణ ఏ దేశంలోనూ లేదు. నియంతృత్వ దేశమైన చైనాలో కూడా లేదు. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లోనూ మనకంటే అధికార వికేంద్రీకరణ ఉంది. మనదేశంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి తప్ప మిగతా వాళ్లందర్నీ పనికిరాని వాళ్లుగా తయారు చేశాం. వ్యవస్థ మొత్తాన్ని కుళ్లబొడిచేశాం. అధికార వికేంద్రీకరణ చేయకుండా ఒక ప్రధానమంత్రి హీరో, ఒక ముఖ్యమంత్రి హీరో మిగతావాళ్లంతా జీరో అంటే దేశం మొత్తం జీరో అవుతుంది. ఏమాత్రం అనుమానం లేదు.

**(ఇంకా ఉంది)**

## విద్య, ఆరోగ్యం ఉచితాలు కావు..

# ప్రభుత్వాల బాధ్యత



రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేస్తే కుటుంబాలు గుల్లవుతాయని తెలుసు కాబట్టే మన ఇళ్లల్లో పొదుపుగా డబ్బు ఖర్చు చేస్తుంటాం, అలా మన తల్లిదండ్రులు చేయబట్టే మనలో చాలామంది ఈవేళ ఎదగగలిగాం.. కానీ ప్రభుత్వాలు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తుంటే, అప్పు చేసి పప్పుకూడు పథకాలను ప్రవేశపెడుతుంటే మాత్రం చేయి జాస్తున్నాం తప్ప గట్టిగా ప్రశ్నించటం లేదు. సంక్షేమం పేరుతో అప్పులు చేసి ఉచితాలను పంచటంపై మన సమాజంలో, మీడియాలో జాతీయస్థాయి చర్చ కావాలి.. అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఈ అంశం రాజకీయమయమైనందున పార్టీలకతీతంగా సమాజం స్పందించాల్సి ఉందన్నారు.

విద్య, ఆరోగ్యం సంక్షేమం కాదని, అవి ప్రభుత్వాల మౌలిక బాధ్యతని.. ప్రభుత్వం తన బాధ్యతల్ని చేయకుండా ఉచితాలను పందేరం చేయటం తగదని, దీన్ని నియంత్రించాలని లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా పోరాడుతోందని, కానీ ఇప్పుడు సమయం ఆసన్నమైందని జేపీ అన్నారు.

ఒక పేద దేశంలో, ఉచితాలు లేకుండా ఎన్నికల బరిలో నిలవటమే అసాధ్యమైన పరిస్థితుల్లో కొంతమేర ఉచితాలు అవసరమని, అయితే అవి మితిమీరకుండా, రాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోయేలా చేయకుండా, ప్రజల ఎదిగే అవకాశాలకు దోహదం చేసేలా సంక్షేమం–అభివృద్ధి మధ్య సమతూకంతో ఉండాలని జేపీ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సంక్షేమ పథకాల్ని దళారులు లేకుండా నేరుగా ప్రజలకు అందించటం అభినందనీయమన్నారు. అయితే ప్రభుత్వాలు జీతాలు, వడ్డీల చెల్లింపు వంటి సాదర ఖర్చులకు అప్పులు చేసే పరిస్థితి ఆందోళనకరమన్నారు. అప్పులు చేసి ఉచితాల అమలును కచ్చితంగా నియంత్రించాలన్నారు. తెచ్చిన అప్పుల్ని పోలవరం వంటి ప్రాజెక్టులు, రోడ్లు, పోర్టులు, ఇతర మౌలిక వసతులకు ఖర్చు చేయాలన్నారు. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు ఈ విషయంలో మన కంటే మెరుగ్గా ఉన్నాయని, పొరుగున ఉన్న పేద రాష్ట్రం ఒడిషా కూడా ద్రవ్య క్రమశిక్షణలో ఆదర్శంగా ఉందన్నారు.

ఆర్థిక క్రమశిక్షణకు ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థను (ఇండిపెండెంట్ ఫిస్కల్ కౌన్సిల్) ఏర్పాటు చేయటం ద్వారానో లేక జాతీయ ఆర్థిక సంఘాన్ని శాశ్వతీకరించి స్వతంత్రంగా ఆ బాధ్యతను అప్పగించటమో చేయాలని ఇటీవల యూనియన్ ఆర్థిక మంత్రికి తెలియచేశానని, ప్రధానమంత్రికి కూడా వివరిస్తానని జేపీ పేర్కొన్నారు. ✦

### యువత గాంధీ ఛాలెంజ్‌ని స్వీకరించాలి




**'పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకీ ఎదిగే అవకాశాలనిచ్చే, నివారించదగ్గ బాధలను తొలగించే' అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించటానికి యువత నడుం కట్టాలి. గాంధీలా అందరూ జీవితాల్ని త్యాగం చేయనక్కర్లేదు. కానీ ప్రతి ఒక్కరూ చట్టబద్ధపాలన, అందరికీ నాణ్యమైన విద్య-ఉపాధి, ఆరోగ్యం, లాభసాటి వ్యవసాయం, హక్కుగా పౌర సేవలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత వంటి లక్ష్యాల కోసం తమ సమయం, ఆదాయంలో 10 శాతం, అది కూడా స్థానికంగా ఎక్కడికక్కడ కేటాయిస్తే చాలు. స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చగలం.**

**అక్టోబర్ 2 - మహాత్మాగాంధీకి, లాల్‌బహదూర్ శాస్త్రికి జయంతి నివాళులు**

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

# ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఏపీ ప్రభుత్వం రీడిజైన్ చేయాలి






రాష్ట్రంలో విద్య, ఆరోగ్యాలను బాగుచేయాలనే సంకల్పాన్ని కనబరుస్తున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, ఆయన ప్రభుత్వాన్ని అభినందిస్తున్నట్లు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విశాఖపట్నంలో మీడియా సమావేశంలో అన్నారు. అయితే గత అరవయ్యేళ్ల వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకోకుండా ఆరోగ్య రంగంలో ప్రభుత్వం తలపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ఆచరణలో విఫలమవుతుందన్నారు. పీహెచ్‌సీలు, అందులో అరకొరగా ఉండే డాక్టర్లనే ఫ్యామిలీ డాక్టర్లుగా వినియోగిస్తూ సంచార వైద్యం అందిస్తే ఫలితముండదన్నారు. ఈ విధానాన్ని రీ డిజైన్ చేసి, ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ప్రతిపాదించినట్లు, కొన్ని గ్రామాలకు కూడలిగా ఉండే చిన్న పట్టణంలో 10-15 మంది ఫ్యామిలీ డాక్టర్ల బృందం ఉండేలా సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వీరిలో తమకు నచ్చిన, తాము నమ్మిన డాక్టర్‌ని ప్రజలు ఎంచుకోవచ్చన్నారు. ఎంతమంది పేషెంట్లను చూస్తే రోగికి ఇంత మొత్తం చొప్పున అంత మొత్తాన్ని ప్రభుత్వం ఆ డాక్టర్‌కి చెల్లిస్తుందన్నారు. ఇలా డాక్టర్ల మధ్య పోటీ, రోగులకు ఎంపిక స్వేచ్ఛ ఉండి, ల్యాబ్ పరీక్షలు, మందులు కూడా ఉచితంగా అందించే ఏర్పాటు చేస్తే.. నాణ్యమైన ప్రాథమిక, నివారణ వైద్యం అందుతుందన్నారు. ఎమర్జెన్సీ కేసుల్లో తప్ప ఫ్యామిలీ డాక్టర్ రెఫరల్ లేకుండా ఆస్పత్రిలో చేర్చుకోరు కాబట్టి అక్కడ కూడా రద్దీ తగ్గుతుందన్నారు.

ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీని కూడా లోక్‌సత్తా ఆరోగ్య నమూనాలో వినియోగించుకుంటామని, అయితే కేవలం ఆరోగ్యశ్రీ ఉన్నా ప్రజలకు ఆరోగ్యం అందటం లేదని మనం గుర్తించాలని, మన ఆరోగ్య వ్యవస్థ వైఫల్యం వల్లే కొవిడ్ అంత విధ్వంసం సృష్టించిందని జేపీ అన్నారు. ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఆరోగ్య విధానంలోని ఫ్యామిలీ ఫిజీషియన్ పద్ధతికి మనకు డాక్టర్ల కొరత లేదన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఏటా సుమారు 8,000 మంది ఎంబీబీఎస్ పట్టా తీసుకుంటున్నారని, కానీ ఒక్కో గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు ఫ్యామిలీ డాక్టర్ సెంటర్ల చొప్పున ఏపీకి 3-4,000 మంది ఫ్యామిలీ డాక్టర్లు చాలన్నారు. 2005లో తాను జాతీయ ఆరోగ్య మిషన్‌ను రూపొందించానని, అప్పుడే యూనివర్సల్ హెల్త్‌కేర్‌ను ప్రతిపాదించినా, ప్రభుత్వాలు అందులో పది శాతం అమలు చేశాయని, మన ఆరోగ్య వ్యవస్థలోని బలాలు, బలహీనతల్ని సమగ్రంగా అధ్యయనం చేసి లోక్‌సత్తా తాజాగా రూపొందించిన ఆరోగ్య విధానం అమలు కోసం త్వరలో లోక్‌సత్తా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కూడా కలుస్తానని జేపీ తెలిపారు.

యూనియన్ ప్రభుత్వ ఉదాసీనత, ప్రజల్లో అనైక్యత, రాజకీయ కుమ్ములాటల వల్ల విభజన హామీలు అమలుకాక ఏపీ నష్టపోతోందని, ఆ హామీలకు, వాటిని చట్టంలో పొందుపరచటానికి తన కృషే కారణమని, విభజన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని జేపీ ఓ ప్రశ్నకు సమాధానంగా అన్నారు. విభజన హామీల అమలుకు చొరవ తీసుకోవటం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, వేణుగోపాలరావు తదితర నేతలు పాల్గొన్నారు.

**పాలన, చర్చలు కూడా ఆ స్థాయిలో ఉండాలి**

తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు రాష్ట్ర సచివాలయానికి డా॥ అంబేద్కర్ పేరు పెట్టటం ఓ మంచి సంకేతమని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో అన్నారు. అంబేద్కర్ పేరు పెట్టుకుంటే చాలదని, ఆయన నేతృత్వంలో రూపొందిన రాజ్యాంగబద్ధంగా పాలన ఉండాలని, విధాన నిర్ణయాలకు చట్టసభల్లో లోతైన చర్చలుండాలని, రిజర్వేషన్లు శాశ్వత పరిష్కారమన్నట్లు నటించకుండా వివక్ష లేకుండా ఎదిగే అవకాశాల కోసం నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందరికీ అందుబాటులోకి తేవాలని బాబ్జీ స్పష్టం చేశారు.

# వివేకానంద మాటల్ని చేతలుగా మార్చగల
# అపూర్వ కాలంలో ఉన్నాం: జేపీ

స్వామి వివేకానంద 1893, సెప్టెంబర్ 11న చికాగో సదస్సులో చేసిన ప్రసంగం కొన్ని నిముషాలు మాత్రమే. అయితే ఆ తర్వాత కూడా ఆయన్ను మళ్లీ మళ్లీ మాట్లాడమని నిర్వాహకులు కోరారు. అలా వారం పదిరోజుల వ్యవధిలో ఆయన నాలుగైదు పర్యాయాలు ప్రసంగించారు.



నిన్న చూసిన సినిమా ఈవేళ గుర్తుండని రోజుల్లో ఇన్నేళ్లయినా స్వామీజీ చికాగో ప్రసంగం గురించి మనం మాట్లాడుకుంటున్నాం.

.. వివేకానంద మాటల్లోని లోతుకు ఇవి నిదర్శనం.. అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

స్వామి వివేకానంద అమెరికా చికాగో విశ్వమత సదస్సులో ప్రసంగించి 129 ఏళ్లు పూర్తవటంతోపాటు, వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ 23వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ రామకృష్ణ మిషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు.

పాశ్చాత్య మత విశ్వాసాలకు భిన్నంగా భారతీయ ఆధ్యాత్మికతలో ఎంత వైవిధ్యం ఉందో వివేకానంద చికాగో సదస్సులో తెలియచెప్పారని, 'సత్యం ఒకటే, కానీ మార్గాలు అనేకం' అని భారతీయాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని జేపీ పేర్కొన్నారు. భారతీయంలో సంకుచితత్వం లేదని, ఇతరుల జ్ఞానాన్ని గౌరవిస్తుందని, మంచిని స్వీకరిస్తుందని స్వామీజీ చాటి చెప్పారన్నారు. అంతటి అంతర్గత బలమున్నా ఆత్మన్యూనతతో సతమతమవుతున్న భారతీయులకి వివేకానంద ఆత్మగౌరవాన్ని అందించారన్నారు. భారత్‌లో జాతీయతకు పునాది వేసింది కూడా స్వామీజీయేనన్నారు. ఆ పునాది మీదే మహాత్మాగాంధీ ఒక దేశంగా భారతీయుల్ని ఏకం చేశారన్నారు. ఆధ్యాత్మికత అంటే ఎక్కడో ఉన్న దేవుడ్ని వెతకటం, మోక్షం కోసం పాకులాడటం కాదని, పక్కనే ఉన్న మనిషికి-చుట్టూ ఉన్న సమాజానికి మధ్య సంబంధాన్ని గుర్తించటమని వివేకానంద ఎలుగెత్తారన్నారు.

పుట్టిన పుట్టుక బిడ్డ భవిష్యత్తును శాసించటం, నివారించదగ్గ బాధలు కొనసాగటం తన దృష్టిలో పెద్ద పాపాలని, ఈ రెండు పాపాలకూ భారతదేశం కాణాచిగా ఉందని జేపీ అన్నారు. వివేకానంద కాలంలోనూ ఈ విషాదాలకు భారత్ నిలయంగా ఉందని, అయితే ఆ రెంటి నుంచీ పూర్తి విముక్తిని సాధించగల అపూర్వ అవకాశాలు నేటి తరానికి ఉన్నాయన్నారు. ఈ అవకాశాల్ని వినియోగించి ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని అందించి, నివారించదగ్గ బాధల్ని తొలగిస్తే.. వివేకానందతో పాటు ఈ దేశాన్ని తరతరాలుగా పునీతం చేసిన ఎందరో తత్వవేత్తలు, ధార్మికులు కలలుగన్న సమాజం నిర్మాణమవుతుం దన్నారు. ఈ రెండూ చేయకుండా.. ఆత్మగౌరవం గురించి, వివేకానంద గురించి మాట్లాడే అర్హత మనకు ఉండదన్నారు.

మన వైఫల్యాల్ని గుర్తించి మంచిని సాధించటం ఎలా.. అదే సమయంలో మన సమాజంలోని అంతర్గత బలాల్ని కాపాడుకోవటం ఎలా.. అని మనం ఆలోచించాలని జేపీ సూచించారు. మన దేశంలో ప్రభుత్వాలు ఎంత బలహీనంగా ఉన్నా, మనం స్వేచ్ఛగా తిరుగుతూ సంతోషంగా బతకగలుగుతున్నామంటే.. అది మన సంస్కృతిలో అంతర్గతంగా ఉన్న బలం వల్లేనన్నారు.

సాధారణంగా ఆధ్యాత్మికత అంటే వయసుడిగిన వారు, సమాజం పట్ల తిరస్కారభావంతో గతంలో బతికే పాతతరం వారు కాలక్షేపం కోసం చేసే పనిగా భావిస్తుంటారని, అందుకు భిన్నంగా పెద్దసంఖ్యలో యువతను భాగస్వాముల్ని చేస్తూ వివేకానంద భావాల్ని వ్యాపింపచేస్తున్నందుకు రామకృష్ణ మిషన్ కృషి అభినందనీయమన్నారు. వివేకానందను తెలుసుకోవటం వల్ల యువతీయువకులు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందటమే కాకుండా, సమాజం గురించి కూడా తెలుసుకోగలుగుతారని.. వ్యక్తి సుఖాన్ని సమాజ హితంతో అనుసంధానించుకుంటూ మరింత ఎదగగలుగుతారని జేపీ పేర్కొన్నారు.

కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ తమిళిసై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దొంతినేని నరసింహ పరిచయ కార్యక్రమం నిర్వహించగా, రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, స్వామీజీలు శితికంఠానంద, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలే ప్రభువులు-పాలకులు సేవకులే

-బండారు రామ్మోహనరావు

అబ్రహం లింకన్ పేర్కొన్నట్లు ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత- ప్రజల కొరకు- ప్రజల యొక్క అనే మాటలు ప్రజాస్వామ్యానికి సంపూర్ణమైన అర్థాలు. దీన్నే ఇంకా తేలిక మాటలలో చెప్పాలంటే ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు అన్నింటిలో ప్రజల ఓటుతో ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. ప్రజలు కట్టే పన్నుల డబ్బులతో ప్రభుత్వాలు నడుస్తున్నాయి. "ఓటు వేసేది మనమే పన్నులు కట్టేది మనమే" ఈ స్పృహ ప్రజలకు వస్తే ప్రజాస్వామ్యంలో పెను మార్పులు సంభవిస్తాయి. కానీ ఇచ్చేది వారు పుచ్చుకునేది మనం వారిది పై చేయి మనది కింద చేయి అనే భావన ఇప్పటికీ మనదేశంలో ఉంది. వారు వరాలు ఇచ్చేవారు మనం పుచ్చుకునే వారం అందుకే ఆ సంక్షేమ పథకాలకు వారు వారి పూర్వీకుల పేర్లు పెట్టుకుంటారు. మనం వేసే ఓటుకి మనకు అందే సౌకర్యాలకి ఉన్న లంకెను ప్రజలు అర్థం చేసుకున్న నాడు ఓటు విలువ తెలుసుకొని ఓటు వేస్తారు. ఇది అర్థం కాకుండా చేయడానికి సాంప్రదాయ రాజకీయ పక్షాలు వాటినే క్లుప్తంగా షార్ట్ కట్ గా చెప్పుకోవాలంటే "సారా" పార్టీలు అని పిలవచ్చు. ప్రజలను గందరగోళంలో ముంచేస్తాయి. మేం వస్తే ఇది చేస్తాం అది చేస్తాం అని హామీలు ఇస్తాయి. చాలాసార్లు ఆ హామీలు గంగలో కలుస్తాయి. ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల మళ్లీ కొత్త హామీలు పుట్టుకొస్తాయి. ఇదంతా ఒక విషవలయం. ఈ "జిలేబికా చెక్కర్"లో ప్రజలు తమ స్వార్థాన్ని వెతుక్కుంటుంటే, పాలకులు అంతకుమించిన స్వార్థంతో పనిచేస్తున్నారు. మెరుగైన మంచి పాలన "గుడ్ గవర్నెన్స్" సుపరి పాలన కావాలంటే ప్రజలు ఈ విషయాలను అర్థం చేసుకోవాలి. అలాగే పాలకులు కూడా ప్రజాస్వామ్యంలో ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకురావాలి. అందుకు ముందుగా ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రజలు అర్థం చేసుకున్నప్పుడు దానికి అనుగుణంగా ప్రజలకు ఓటు యొక్క విలువ తెలుస్తుంది. అందుకే మొదటగా ప్రజాస్వామ్యం మూల సూత్రాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**సంపూర్ణ ప్రజాస్వామ్యం అంటే ఏమిటి?.**

ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యంలో ఐదు మూల సూత్రాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణంగా ఉన్నప్పుడే సంపూర్ణ ప్రజాస్వామ్యం అని చెప్పవచ్చు. అందులో మొదటిది "స్వేచ్ఛ" ఇక వరుసగా రెండు" ప్రజల నిర్ణయాధికారం" మూడు "ప్రజల భాగస్వామ్యం" నాలుగు "చట్టబద్ధ పాలన" ఐదవది చివరిది అయిన "స్వయం దిద్దుబాటు". ఈ విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఇటీవల ఒక సర్వే నిర్వహించారు. అందులో ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పిలవబడుతున్న మన దేశం స్థానం 35 మాత్రమే. డెన్మార్క్, స్వీడన్, నార్వేలాంటి చిన్న దేశాలు మొదటి మూడు స్థానాల్లో ఉంటే మనం మన కన్నా వెనుకబడ్డ దేశాల కంటే ప్రజాస్వామ్య స్ఫూర్తిని రక్షించడంలో, సంపూర్ణ ప్రజాస్వామ్యం వైపు పయనించడంలో మరింత వెనుకబడి ఉన్నాం. ఇది దురదృష్టకరం కాదు. చేసుకున్న వాడికి చేసుకున్నంత అని మన పాలకులు, ప్రజలు ఆలోచిస్తున్న తీరు వల్ల ఈ దుస్థితిలో ఉన్నాం. దీన్ని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే ఈ సర్వేలో పేర్కొన్న ప్రజాస్వామ్య మూల సూత్రాలు, వాటిలో మనం ఎక్కడ ఉన్నామో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**1. స్వేచ్ఛ**

మన దేశంలో స్వేచ్ఛకు కొదవలేదు అలాగే దాని వెనుక నిర్బంధం నీలినీడ వెంటాడుతూనే ఉంటుంది. ఒక్కొక్కప్పుడు పాలకులకు ప్రజాస్వామ్య ఉద్యమకారులు, లు ప్రజల మీద కోపం వస్తే ప్రకటిత, అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతూనే ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ అనే మొదటి అంశానికి ఎన్ని ఓట్లు పడతాయి అంటే మనదేశంలో స్వేచ్ఛ అనే మాటకి వందకు 80% ఓట్లు వచ్చాయి.

**2.ప్రజల నిర్ణయాధికారం**

ఓటు అనే ఆయుధం ప్రజలకు కుల, మత, ప్రాంత, భాష ,లింగ వివక్ష లేకుండా సార్వజనీన ఓటు హక్కు మొదటి సార్వత్రిక ఎన్నికల నాటి నుండి ఉంది. అంటే ప్రాథమిక స్థాయి పంచాయతీ సభ్యుడు నుండి,కౌన్సిలర్,కార్పొరేటర్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ వరకు మన పాలకులను మనమే ఓటు వేసి ఎన్నుకుంటున్నాము. అంటే ఓటు హక్కు ద్వారా సాంకేతికంగా ప్రజలకు పాలకులను ఎన్నుకునే నిర్ణయాధికారం ఉన్నట్లే లెక్క. అది దుర్వినియోగం అవుతున్న సంగతి వేరుగా మాట్లాడుకుందాం.

**3. ప్రజల భాగస్వామ్యం**

ఇక్కడే ప్రజాస్వామ్య స్ఫూర్తికి దెబ్బ కొట్టింది. ఈ అంశమే ఆ సర్వేలో మనని వెనక్కి నెట్టింది. ఈ అంశానికి మనకు కనీసం పాస్ మార్కులు కూడా రాలేదు. మనం ఎన్నుకున్న ప్రభుత్వం మనకు పనిచేయాలంటే మన భాగస్వామ్యం ఉండాలనే భావన ప్రజలలో కొరవడింది. దీన్ని పెంపొందించే బాధ్యతను పాలకులు మరిచిపోయారు. ఒకరకంగా ఈ అంశం పట్ల

పాలకులు నిద్ర నటిస్తున్నారు. అందుకే మధ్యతరగతి, ధనికవర్గ ప్రజలలో ఓటు హక్కు గురించి సదాభిప్రాయం లేదు. మనం ఓటు వేయకపోతే కొంపలేమీ మునిగిపోవులే అనే ఒక నిర్లిప్త భావన ఆ వర్గాలలో నెలకొంది. అదే స్థానంలో నిరక్షరాస్యులు పేద ప్రజలు గ్రామీణలు ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకుంటున్నారు. ఓటు వేయకపోతే చనిపోయినట్లుగానే వారు భావిస్తున్నారు. పేద ప్రజలు ఎందుకు ఓటు వేస్తున్నారు అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. అది వేరుగా చర్చించుకోవాల్సిన అంశం.

**ఓటు వేయడం ఆ తర్వాత అరవడం(ఓట్ అండ్ షౌట్)**

ఓటు వేసి ఎన్నుకున్నాం ఆ తర్వాత కోపం వస్తే వారిని దిగిపొమ్మని అరుద్దాం అనే తెంపరితనం ప్రజలలో నెలకొంది. దీన్నే మనం "ఓట్ అండ్ షౌట్" అని చెప్పుకోవచ్చు. ఓటు వేయడం ఎవర్నో ఒకరిని గెలిపించడం మరొకరిని ఓడించడం ఆ తర్వాత గెలిచిన వారి మీద కోపం వచ్చిన ప్రతిసారి వారిని పదవి నుంచి దిగిపొమ్మని అరవడం ఇది మనం చేస్తున్నది. ఐదేళ్లకోసారి ఇంకా చెప్పాలంటే ప్రతి ఎన్నికల ముందు ఆ తర్వాత జరిగే తంతు ఇదే! దీన్ని మార్చాలి.

**విష బీజాలు నాటితే అమృత ఫలాలు వస్తాయా?**

ప్రజాస్వామ్యం అనే పొలంలో ఓటు అనే విత్తనం పెట్టేటప్పుడే ఆలోచిస్తే ఈ సమస్య రాదు. మనం నాటుతున్నది అమృత ఫలాలను ఇచ్చే విత్తనాలనా లేక ఒక విషపు ఫలాలను ఇచ్చే విత్తనాలు నాతున్నామా ఆలోచించకుండా ఓటు వేస్తున్నందున ఇలాంటి పరిస్థితి దాపురిస్తుంది. విషపు విత్తనాలను నాటి అమృత ఫలాలు ఆశిస్తే ఖచ్చితంగా ఆశాభంగమే ఎదురవుతుంది. అందుకే పాలనలో ప్రజల భాగస్వామ్యం కొరవడింది. పాలన చేస్తున్న ప్రభుత్వాలు మనవి కావులే అనే భావన ప్రజలలో పాదుకొంది. ఎవరిని ఎన్నుకున్నా ఏముంది అందరూ చేసేది అదే కదా అనే భావన ప్రజలలో నెలకొంది. దీని ఆసరా చేసుకుని ప్రజల ఓట్లను కొల్లగొట్టడం కోసం తాత్కాలిక తాయిలాలు, మద్యం, డబ్బులు ఇస్తూ ఓటర్లను రాజకీయ పార్టీలు ఆకట్టుకుంటున్నాయి. చచ్చిన దానికి వచ్చిందే కట్నం అంటూ ఓటర్లు డబ్బులు తీసుకుంటున్నారు. మద్యం తాగుతున్నారు. గొర్ల గోత్రాలు గొల్లవారికి ఎరక పాలకుల గోత్రాలు ప్రజలకు తెలుసు కనుక సామాన్య ప్రజలు "సబ్ కా సున్ నా అప్ నా కర్ నా" అనే సూత్రాన్ని పాటిస్తూ వారికి నచ్చిన వారికే ఓటేస్తున్నారు. ఇది మారాలంటే ఓటు అనే వజ్రాయుధం ద్వారా ప్రభుత్వాలను మార్చవచ్చునేదే కాకుండా ప్రభుత్వాలతో పని చేయించవచ్చనే సత్యాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో రాజకీయ పార్టీలే చెప్పగలగాలి. కానీ ఒకరిని మించి ఒకరు ప్రజలను మభ్యపెట్టడంలో ఓటు బ్యాంకు రాజకీయాలను కొనసాగించడంలో రాజకీయ పార్టీలు ఈ విష వలయంలో చిక్కుకున్నాయి. దీన్ని ఛేదించే మొనగాడు ఎవరు, "పిల్లి మెడకు గంట కట్టే వారెవ్వరు" అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న గా మిగిలిపోయింది.

**4.చట్టబద్ధ పాలన**

మన భారత రాజ్యాంగాన్ని చూస్తే పైకి చట్టబద్ధ పాలన రాతపూర్వకంగా అద్భుతంగా కనిపిస్తుంది. మనది అతి పెద్ద లిఖిత రాజ్యాంగం కనుక అందులో అనేక విషయాలను మనం పేర్కొన్నాము. అందుకే ఈ సర్వేలో ఈ విషయానికి ఎక్కువ ఓట్లు పడ్డాయి. కానీ ఆచరణలో చట్టబద్ధ పాలన విఫలమవుతుంది.మన రాజ్యాంగంలో రాసుకున్న దానికి ప్రస్తుతం మన దేశంలో జరుగుతున్న దానికి పొంతన లేకుండా పోతుంది.అందుకే చట్టబద్ధ పాలన విషయంలో మార్కులు ఎక్కువగా వచ్చినా కూడా క్షేత్రస్థాయిలో అది కనిపించదు. పైరవీ లేకపోతే లంచం లేకుండా హక్కుగా అందాల్సిన సేవలతో సహా మనకు ప్రభుత్వ సేవలు అందడం లేదు. మన హక్కులను కాపాడుకోవడానికి ఇతరులను ఆశ్రయించవలసిన అవసరం ఎక్కువవుతుంది. అందుకే చట్టం కొందరికి చుట్టం అయిపోయింది.

**5.స్వయం దిద్దుబాటు**

ఐదవది చివరిది స్వయం దిద్దుబాటు. మనకు స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయింది ఇటీవలే మనం "ఆజాదీకా అమృతోత్సవ్" ఘనంగా జరుపుకున్నాం. గణతంత్ర రాజ్యాంగా 1950 జనవరి 26 నాటి నుండి మన నూతన రాజ్యాంగాన్ని అమలుపరచుకున్నాం. మనం రాజ్యాంగం రాసుకొని అమలుపరచుకున్న రోజు నుండి ఇప్పటివరకు 70 ఏళ్లు గడిచింది. మన రాజ్యాంగంలో 110 కి పైగా సవరణలు చేసుకున్నాం. ఇది స్వయం దిద్దుబాటుగా పైకి అనిపిస్తుంది. కానీ అవసరమైన మార్పులు చేయడానికి ఇది సరిపోదు. అందుకే స్వయం దిద్దుబాటు అంశంలో మనం అంతకుమించి ఆలోచించవలసిన అవసరమే ఉంది. అందులో భాగంగానే ప్రజాస్వామ్య పాలనా సంస్కరణలు రావలసిన అవసరం ఎంతగానో ఉంది.

**ప్రజాస్వామ్య పాలనా సంస్కరణలు రావాలి!**

వాటిలో మొట్టమొదటిది ప్రజాస్వామ్య సంస్కరణలు. ప్రజాస్వామ్యం అంటే రాజకీయ పార్టీలు లేకుండా ఊహించలేము. అందుకే రాజకీయ సంస్కరణలు మొదటి అంశంగా తీసుకోవాల్సి ఉంది. ఇక రెండవది పాలనా సంస్కరణలు పాలల్లో మెరుగైన పాలన అందించడానికి రాజ్యాంగం చట్టాలు పెద్దగా మార్చకుండా విధానాలు మార్చడం ద్వారా సుపరిపాలన సాధించవచ్చు. ఈ రెండు అంశాలు మౌలికంగా మారాలంటే ఎన్నికల సంస్కరణలు

కావాలి. ప్రస్తుతం మనదేశంలో (FPTP) ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్ అనే పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయి. అలాగే కొన్ని ఎన్నికలు ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థులను ఎన్నుకునే పద్ధతిలో కూడా జరుగుతున్నాయి. అందుకే వీటిలో ఎలాంటి మార్పు తీసుకురావాలి. ఈ రెంటిని మించిన దామాషా పద్ధతి లాంటి ఎన్నికల పద్ధతి పనికి వస్తుందా లేదా అనే విషయాన్ని కూడా మనం ఆలోచించాలి. ఇక ప్రజాస్వామ్యంలో చట్టసభలు కార్యనిర్వాహకవర్గం న్యాయ వ్యవస్థ ఈ మూడు మూడు స్తంభాలు ఇక నాలుగవది ముందు కనరాని స్తంభం ప్రెస్ మీడియా. అందుకే మూడవదైన న్యాయవ్యవస్థ పాత్ర కూడా తీసివేయ లేనిది. న్యాయ వ్యవస్థకు పోలీసు వ్యవస్థకు అవినాభావ సంబంధం ఉంది. ఇది విడదీయరాని బంధం. ఇందులో సంస్కరణలు రావాలంటే పోలీసు, సంస్కరణలు న్యాయ సంస్కరణలు అనే రెండు అంశాలు కలగలిపే ఉంటాయి. అలాగే ప్రజలు ఎక్కడ నివసిస్తారో అక్కడ మౌలిక వసతులు కల్పన నుండి అనేక సమస్యలు ఉంటాయి. నివాసయోగ్యమైన గ్రామాలు పట్టణాలు ఏర్పడాలంటే స్థానిక ప్రభుత్వాల సాధికారత కూడా చాలా అవసరమైన సంస్కరణ. "ఇంటి ముందు పాలన కంటి ముందు ప్రభుత్వం" అనే ఆచరణాత్మకమైన నినాదంతో స్థానిక ప్రభుత్వాలకు అధికారం ఇవ్వాలి. ప్రస్తుతం ఉన్న అధికార కేంద్రీకరణ నుండి వికేంద్రీకరణ వైపు ఆలోచించి పరిష్కారం సాధించాలి. అలాగే మన దేశం వ్యవసాయక దేశం ఇప్పటికీ సుమారు 50% పైగా ప్రజలు వ్యవసాయం మీద ప్రత్యక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. మరో 20 శాతం మంది పరోక్షంగా వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. మరి సగం జనాభా పై ప్రభావం చూపించే వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచుకొని "గిట్టుబాటు వ్యవసాయం" అనే పాత నినాదాన్ని పక్కనపెట్టి "లాభసాటి వ్యవసాయం" వైపు ఆలోచించేలా వ్యవసాయ సంస్కరణలు ప్రవేశపెట్టాలి. అలాగే పుట్టిన ప్రతి బిడ్డ నుండి మొదలుకొని పండు ముదుసలి వరకు ప్రభుత్వం చే హక్కుగా లభించే పౌర సేవలు అందాల్సిన అవసరం ఉంది. లంచం లేకుండా పౌర సేవలు అందించే కొత్త వ్యవస్థను మనం అభివృద్ధి చేసుకోవాలి. పన్నులు కడుతున్న మనమే ప్రభుత్వాల మీద హక్కుగా లభించే పౌర సేవలను డిమాండ్ చేయగలగాలి. ఇలా ఈ ప్రజాస్వామ్య పాలన సంస్కరణలు సాధించి ప్రజాస్వామ్యాన్ని మరింత పరిపుష్టం చేసుకోవాలి.

ఈ వైపున రాజకీయ పార్టీలు ఆలోచించాలంటే డిమాండ్ సప్లై సూత్రం వర్తిస్తుంది. ప్రజలు కోరితే మేము ఇది చేస్తామని రాజకీయ పార్టీలంటాయి. రాజకీయ పార్టీలు వీటిని అమలు చేస్తే మేము ఓటు వేస్తామని ప్రజలు అంటారు. ఇది విత్తు ముందా, చెట్టు ముందా అనే ప్రశ్న లాంటిది. పరస్పరం రాజకీయ ప్రయోజనం ఉంటే తప్ప అటు పాలకులు, ఇటు ప్రజలు ఆ రీతిన ఆలోచించరు. అలా ప్రజాస్వామ్య సంస్కరణల వైపు ఆలోచించడానికి తగిన వేదిక కోసమే "ప్రజాస్వామ్య పాలన సంస్కరణలు" అనే అంశాన్ని ప్రజలతో పాటు రాజకీయ పార్టీలు ఆలోచించాలి. అప్పుడే "ప్రజలే ప్రభువులు-పాలకులు సేవకులే" అనే నినాదం నిజమవుతుంది. లేకపోతే మేడిపండు ప్రజాస్వామ్యం ఇంకా కొనసాగుతూనే ఉంటుంది.

# పేరు మార్చాల్సిన అవసరమేమొచ్చింది



డాక్టర్ ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరుని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మారుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకుని శాసనసభలో ఆమోదం పొందటం అర్థరహిత రాజకీయమని, పేరు మార్చాల్సిన అవసరం అక్కడ ఏమాత్రం లేదని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. వైఎస్ఆర్ అభిమానులు కూడా ఈ చర్యను వ్యతిరేకిస్తున్నారన్నారు. విజయవాడలోని విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ శ్యాంప్రసాద్ పిగిలంని కలిసి వినతిపత్రాన్ని అందచేసిన అనంతరం బాబ్జీ మాట్లాడుతూ, రాష్ట్రంలో వైద్య విద్యకు ప్రామాణికత, పద్ధతి ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రిగా ఎన్‌టీఆర్ 1986లో ఈ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌ను ఏర్పాటు చేశారని, 26 విద్యాసంస్థలు ఈ పరిధిలోకి వచ్చాయని, వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేశారని, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌కి పేరు మార్చాలన్న బుద్ధి ఎందుకు పుట్టిందో తెలియటం లేదని అన్నారు. చంద్రబాబు చేసిన తప్పులు ప్రస్తుత ముఖ్యమంత్రి కూడా చేస్తే తేడా ఏమున్నట్లన్నారు. వైఎస్ జగన్ అనవసరంగా రాష్ట్రంలో కులాలు, ప్రాంతాల మధ్య విభజన గీతలు గీస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టినంత తేలిగ్గా చల్లార్చలేరన్నారు. ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరు మార్పుపై ముఖ్యమంత్రి పునస్సమీక్షించాలని బాబ్జీ కోరారు.

# సమానత్వంలో ఆరోగ్యమూ కీలకమే!

## - గగన్‌దీప్ కాంగ్, సీనియర్ వైరాలజిస్ట్

**2047 నాటికి అందరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించే దేశంగా భారత్ ఎదగాలంటే ముందుగా మన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను ఎంత సమర్థంగా పనిచేయించగలమో చూసుకోవాలి. వ్యక్తులు, వారి అవసరాలే కేంద్రంగా ఆరోగ్య వ్యవస్థ నిర్మాణం జరగాలి. ఆరోగ్య రంగాన్ని విస్మరిస్తే వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై పెట్టాల్సిన ఖర్చులు అలవి కానంతగా పెరుగుతాయి. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో మూడోది నేరుగా ఆరోగ్యానికి సంబంధించినదే. అలాగే తొలి రెండు లక్ష్యాలైన అందరికీ ఆహారం, పేదరిక నిర్మూలనకూ ఆరోగ్యంతో సంబంధం ఉన్నది. ఇంకోలా చెప్పాలంటే ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను తీర్చకుండా ఈ రెండు లక్ష్యాలను సాధించటం కష్టం.**

స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇప్పుడు అందరి దృష్టి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లయ్యే సువర్ణ ఘడియలపైనే ఉంది. భారతదేశం అప్పటికి ఎలా తయారవ్వాలి? నా దృష్టిలో అందరికీ సమాన అవకాశాలున్న దేశంగా, విద్య, ఆరోగ్యం అందరికీ అందుబాటులో ఉన్న దేశంగా ఉండాలి! కులమతాలకు అతీతంగా.. వ్యవసాయం, పాడి పరిశ్రమలు పుష్టిగా సాగుతుండాలి. నాణ్యతే ప్రధానంగా పరిశ్రమలు వస్తువులను అందించాలి. ఇవన్నీ కూడా అందరికీ సమాన అవకాశాలు అన్న లక్ష్యాన్ని సాధించేందుకు ఉపయోగపడేవే.




ప్రతి సమాజానికి విద్య, ఆరోగ్యం పునాదుల్లాంటివి. ఆ రెండు విషయాల్లోనూ దేశం సాధించిన ప్రగతికి ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. భారతీయ విద్యావిధానం అంతర్జాతీయ స్థాయి సీఈవోలను సిద్ధం చేస్తుంటే.. భారతీయ ప్రైవేట్ రంగ ఆరోగ్య వ్యవస్థలు ప్రపంచం నలుమూలల్లోని వారికి మెడికల్ టూరిజంతో వైద్యసేవలు అందిస్తున్నాయి. అయితే ఈ రెండు ఉదాహరణలను మినహాయింపులుగానే చూడాలి. పైగా ఈ రెండింటిలో అవకాశాలు కొందరికే.

పిల్లలు తమ మేధోశక్తిని సంపూర్ణంగా ఉపయోగించుకునేందుకు మొట్టమొదటి పునాది ఇంట్లోనే పడుతుంది. పసివాళ్లతో తగురీతిలో మాటలు కలపడం, ఇంద్రియజ్ఞానానికి సంబంధించిన పనులు చేయించడం వంటి పనుల ప్రాధాన్యతను తల్లిదండ్రులు అర్థం చేసుకుంటే విద్యాభ్యాసానికి గట్టి పునాది పడినట్లే. తల్లిదండ్రులిచ్చిన ఈ ప్రాథమిక విద్యకు సుశిక్షితులైన ఉపాధ్యాయులతో నడిచే పాఠశాల కూడా తోడైతే బాలల వికాసం పెద్ద కష్టమేమీ కాదు. ఉమ్మడి కుటుంబమైనా.. చిన్న కుటుంబమైనా సరే.. సాంఘిక, ఆర్థిక పరిస్థితులే పిల్లలకు దక్కే విద్యానాణ్యతను నిర్ణయిస్తాయి. పాఠశాల వాతావరణం సాంఘిక, ఆర్థిక లేమి ప్రభావాన్ని కొంతవరకూ తగ్గించగలదు కానీ.. ఇది జరగాలంటే పాఠశాలలు సక్రమంగా పనిచేస్తూండాలి. దీనర్థం భవనాలు, పరిపాలన వ్యవస్థలు సరిగా ఉండాలని కాదు. నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులు కావాలి.

అణగారిన వర్గాల పిల్లల జీవితాలను మార్చటం మూకుమ్మడిగా జరగాల్సిన వ్యవహారం. ఈ మార్పు తీసుకురావటం సాధ్యమనీ, అందుకోసం ఏమైనా చేయగలమనీ ఉపాధ్యాయులు సంకల్పించుకోవడం అవసరం. అయితే ఈ మార్పు రాత్రికి రాత్రికి వచ్చేదేమీ కాదు. ప్రభుత్వాల ఆదేశాలతో సాధ్యమయ్యేదీ కాదు. విద్యాబోధనలో గిరిజన సంస్కృతుల నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదా తర్కబద్ధమైన అభ్యాసాలను ప్రవేశపెట్టడమైనా సరే.. పాఠశాలల్లో విద్యార్థుల మదింపు అనేది అందరికీ ఒకేలా ఉండటం సరికాదు. ఈ వాదనలకు ప్రతివాదనలూ లేకపోలేదు. భారతదేశం విశాలమైనదనీ, అన్ని రాష్ట్రాల్లోనూ ఏకరీతి విద్యాబోధన అవసరమనీ అనేవాళ్లూ ఉన్నారు. ప్రభుత్వం వనరుల కొరతను ఎదుర్కొంటోందని ఇంకొందరు అంటారు. విద్యార్థుల జీవితాల్లో మార్పులు తీసుకురావడం దశాబ్దాల దీర్ఘకాలిక ప్రక్రియ అని అంటారు. ఈ ప్రతివాదనలను విస్మరించాల్సిన అవసరమేమీ లేదు. కానీ విద్య ప్రాథమికమైన బాధ్యత సామాజిక వృద్ధి మాత్రమే కాదనీ, సమానతను సృష్టించేందుకూ ఉపయోగపడాలనీ వీరు గుర్తించాలి.

విద్య ద్వారా లింగవివక్షను తగ్గించడం వంటి అనేక లాభాలూ ఉన్నాయని తెలుసుకోవాలి. పాఠశాల విద్యను అభివృద్ధి చేస్తూనే.. దీనికి సమాంతరంగా వృత్తి విద్య, పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే.. ఈ రెండు రకాల సంస్థలు ఉద్యోగాలు సంపాదించుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తాయి. అదే సమయంలో తక్కువ విద్యార్హతలతోనే అర్థవంతమైన ఉద్యోగం సంపాదించుకోవచ్చు. ఆయా రంగాల్లో నిష్ణాతులు ఈ దేశానికి గతంలోనూ ఉన్నారు.. భవిష్యత్తులోనూ పుట్టుకొస్తారు. ఇది సహజసిద్ధంగా జరిగే ప్రక్రియగానే చూడాలి. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలంటే విద్యావ్యవస్థలో కొత్త కొత్త అవకాశాలను సృష్టించడం.. అవి అందరికీ నిత్యం అందుబాటులో ఉండేలా చూడటం అత్యవసరం. ఈ క్రమంలోనే విద్యనభ్యసించేందుకు డబ్బు ఒక ప్రతిబంధకం కాకుండా జాగ్రత్త పడాలి.

సుమారు ఇరవై ఏళ్ల క్రితం నాటి మాట. ఆరోగ్యకరమైన సమాజానికి ఆడపిల్లలు విద్యావంతులై ఉండటం ఎంతో అవసరమని ప్రపంచబ్యాంకు నివేదిక ఒకటి విస్పష్టంగా పేర్కొంది. తక్కువమంది పిల్లల్ని కనడం, సురక్షిత కాన్పులు, పిల్లల ఆరోగ్య పరిస్థితుల్లో మెరుగుదల, సమాజంలో స్థాయి పెరగడం వంటి సానుకూల అంశాలకూ ఆడపిల్లలు, మహిళల చదువుకు దగ్గర సంబంధం ఉందని అలవోకగా అనేస్తారు కానీ.. ఆరోగ్యం విషయానికి వస్తే అది కాన్పులు, పిల్లల సంరక్షణ పరిధిని దాటి బహుముఖంగా విస్తరించాల్సి ఉంది. రెండు మూడు దశాబ్దాల క్రితంతో పోలిస్తే చాలా వ్యాధులను మనం సమర్థంగా నియంత్రించగలుగుతున్నాం. కాబట్టి ప్రజల ఆరోగ్య సంరక్షణ,

ప్రాణాంతక వ్యాధుల నివారణ, రోగులకు మెరుగైన చికిత్స వంటి వాటికి ఇప్పుడు ప్రాధాన్యం ఇవ్వాలి. ఐక్యరాజ్యసమితి 2030 నాటికి సాధించాలని ప్రపంచ దేశాలకు నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరడం 2047 నాటికి కానీ సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. పైగా ఆరోగ్య రంగాన్ని విస్మరిస్తే వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై పెట్టాల్సిన ఖర్చులు అలవికానంతగా పెరుగుతాయి. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో మూడోది నేరుగా ఆరోగ్యానికి సంబంధించినదే. అలాగే తొలి రెండు లక్ష్యాలైన అందరికీ ఆహారం, పేదరిక నిర్మూలనకూ ఆరోగ్యంతో సంబంధం ఉంది. ఇంకోలా చెప్పాలంటే, ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను తీర్చకుండా ఈ రెండు లక్ష్యాలను సాధించడం కష్టం.

2047 నాటికి అందరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించే దేశంగా భారత్ ఎదగాలంటే ముందుగా మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంత సమర్థంగా పనిచేయించగలమో చూసుకోవాలి. ఆరోగ్యంపై పెట్టే ఖర్చులు తగ్గించడం, వ్యాధుల నివారణపై శ్రద్ధ పెట్టడం జరగాలి. చాలా వ్యాధుల చికిత్సకు ఆసుపత్రుల అవసరముండదు. ఆరోగ్య కార్యకర్తలను రోగులకు అందుబాటులో ఉంచి, భౌతిక, డిజిటల్ సౌకర్యాలు తగినన్ని ఏర్పాటు చేస్తే సరిపోతుంది. అలాగే అత్యవసర పరిస్థితులకు వేగంగా స్పందించగల, అందరికీ అందుబాటులో రెఫరల్ ఆసుపత్రుల వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. చికిత్స ఆలస్యం అవడం వల్ల రోగులకు అనవసరమైన ఇబ్బందులు ఎదురు కారాదు. ఇది సాధ్యం కావాలంటే తగిన వనరులు, సిబ్బంది మాత్రమే కాదు.. ఇవన్నీ అవసరమైన చోట ఉండేలా చూడాలి. తగిన పద్ధతులను అమల్లోకి తేవడమూ అవసరమే. ఇంకోలా చెప్పాలంటే వ్యక్తులు, వారి అవసరాలే కేంద్రంగా ఆరోగ్య వ్యవస్థ నిర్మాణం జరగాలి. భారీ మొత్తాలు చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఈ వ్యవస్థ రోగుల అవసరాలను తీర్చగలగాలి. అయితే ఇలాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలంటే.. ప్రైవేట్ రంగాన్ని నియంత్రించక తప్పదు. సుశిక్షితులైన, చిత్తశుద్ధితో పనిచేసే సిబ్బందితో కేవలం చౌక మందులు, టీకాలతోనే మన వ్యవస్థను రోగి ప్రధానంగా పనిచేయించవచ్చు. ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణలో అక్కడక్కడ అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నవారు ఉన్నారు. క్లినికల్ సర్వీసుల విషయంలోనూ ఇదే జరుగుతోంది. వీటిని సుస్థిర అమలు దిశగా మళ్లించాలి.

2047 అంటే ఇంకో పాతికేళ్లు కావచ్చు కానీ.. స్వతంత్ర భారత చరిత్రలో ఇంకో శతాబ్దానికి బలమైన పునాది వేసేందుకు ఈ 25 ఏళ్లలో విద్య, ఆరోగ్యంపై మనం పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ఈ పెట్టుబడులు కూడా సమాజంలోని ఉన్నత వర్గాల కోసం కాదు. అందరికీ. అయితే ఈ పెట్టుబడుల రాబడులు మాత్రం కొన్ని తరాలవారు అందుకుంటారు.

**(ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్/సాక్షి)**

# దేశ ఆర్థిక వ్యవస్థలో సహకార రంగం కీలక పాత్ర పోషించాలి



దేశంలో ప్రస్తుతం 65 వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) క్రియాశీలంగా పనిచేస్తున్నాయని, వచ్చే అయిదేళ్లలో 3 లక్షల కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని యూనియన్ సహకారశాఖా మంత్రి అమిత్‌షా తెలిపారు. భవిష్యత్తులో విస్తరించే సహకార రంగానికి అవసరమైన మానవ వనరుల తయారీ కోసం జాతీయస్థాయిలో సహకార విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి రాష్ట్రంలో దీని అనుబంధ కళాశాలలు ఏర్పాటు చేసి.. డిప్లొమా, డిగ్రీ కోర్సులు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర సహకార శాఖ మంత్రుల రెండు రోజుల సదస్సును ఢిల్లీలో ప్రారంభిస్తూ, సహకార వ్యవస్థలను ఇప్పటివరకూ రెండో తరగతి పౌరుల్లా చూస్తూ వచ్చారని, ఇక ముందు అలాంటి పరిస్థితి ఉండదని మంత్రి అన్నారు. నాలుగైదు పెద్ద సహకార సంఘాలను ఏకం చేసి జాతీయస్థాయిలో బహుళ రాష్ట్ర విత్తనోత్పత్తి సహకార సంఘాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అది విత్తనాలపై పరిశోధనలు చేసి కొత్త వంగడాలను రూపొందిస్తుందన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులు పండిస్తున్నా ఇప్పటివరకు వాటిని ధ్రువీకరించే వ్యవస్థ లేదని, ఈ లోటును భర్తీ చేయటానికి 'అమూల్' నేతృత్వంలో ధ్రువీకరణ పత్రం జారీ చేసి, మార్కెటింగ్ చేపట్టే అంతర్రాష్ట్ర సహకార వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రాల్లో రైతులు పండించే సేంద్రియ ఉత్పత్తులను అమూల్ కొనుగోలు చేసి ప్రపంచ మార్కెట్‌కు ఎగుమతి చేసి.. లాభాలను సహకార విధానం ప్రకారం రైతులకు పంచుతుందన్నారు. వచ్చే రెండు నెలల్లో ఈ ఏర్పాట్లు మొదలవుతాయన్నారు. అలాగే అమూల్, ఇఫ్కో, నాఫెడ్, ఎన్‌సీడీసీ, క్రిబ్కోలు కలిసి బహుళ రాష్ట్రాల ఎక్స్‌పోర్ట్స్ హౌస్‌ను నిర్మిస్తాయన్నారు. చిన్న చిన్న సహకార సంఘాలు తమ ఉత్పత్తులను ఈ సంస్థ ద్వారా ఎగుమతి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అమిత్‌షా తెలిపారు. రాష్ట్రాలు రాజకీయాల్ని పక్కనపెట్టి ఒక ట్రస్టీ రూపంలో పనిచేసి తమ పరిధిలో సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారటంలో సహకార వ్యవస్థ పెద్దపాత్ర పోషించాలన్నారు.

## నూతన సహకార విధానం రూపకల్పనకు కమిటీ

జాతీయ నూతన సహకార విధానం రూపకల్పన కోసం యూనియన్ మాజీ మంత్రి సురేష్ ప్రభు ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించినట్లు అమిత్‌షా ప్రకటించారు. అన్ని రాష్ట్రాలకు చెందిన 47 మంది ఇందులో సభ్యులుగా ఉంటారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా, ప్రాథమిక సహకార సంఘాలకు చెందిన ప్రతినిధులు, యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల్లోని మంత్రిత్వ శాఖలకు చెందిన అధికారులకు ఇందులో స్థానం కల్పిస్తారు. ఇప్పుడున్న సహకార విధానాన్ని 2002లో రూపొందించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 8.5 లక్షల సహకార సంఘాల్లో 29 కోట్ల మంది సభ్యులున్నారు. సహకారంతో సమృద్ధి సాధించాలన్న లక్ష్యాన్ని చేరుకోవటానికి అనువైన నూతన విధానాన్ని తీసుకొచ్చేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు యూనియన్ ప్రభుత్వం తెలిపింది.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## ఓట్ జుగాడ్ !

మన భారతదేశ ప్రజాస్వామ్యంలో మన రాజ్యాంగం ద్వారా ప్రతిపాదించబడిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన జాతీయ ఎన్నికల కమిషన్ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం నమోదైనటువంటి దాదాపు నూరు కోట్ల మంది పౌరులకు లభించిన ఓటర్ గుర్తింపు కార్డుల ద్వారా మన ఓటు హక్కుని వినియోగించుకుంటున్నాము. వయస్సు 18 సంవత్సరాలు దాటిన స్త్రీ అయినా పురుషుడైనా సరే, ఏ రాష్ట్రానికి చెందిన వారైనా, ఏ ప్రాంతానికి చెందిన వారైనా, ఈ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునే స్వేచ్ఛ మన అందరికీ సమానంగా ఉంది.

మహాత్మా గాంధీ గారు చెప్పినటువంటి త్యజించవలసిన సప్త మహా పాతకాలలో "సిద్ధాంత నిబద్ధత లేని రాజకీయాలు "ఒకటి. ఆ విధంగా సిద్ధాంత నిబద్ధత లేని అవకాశవాద రాజకీయ పార్టీలను త్యజించ గలిగిన సంకల్పం ఉన్నవారే జుగాడ్ ఓటర్లు. ఉదాహరణకు నా ఫోటో గుర్తింపు కార్డు సంఖ్య JJK **1528 744.** నా యొక్క ఆధార్ కార్డు ని నా గుర్తింపు కార్డుతో అనుసంధానం చేసుకుని నా ఓటుని ఇంకొకరు దుర్వినియోగం చేసుకోకుండా కాపాడుకుంటాను. నా ఓటు హక్కు నా యొక్క ఇష్టాఇష్టాలను అత్యంత రహస్యంగా ప్రకటించే విలువైన, శక్తివంతమైన బ్రహ్మాస్త్రం. NOTAకి వేసిన ఓటు వృథా అవుతుందని నాకు తెలుసు. ప్రభుత్వం నెరవేర్చాల్సిన నా కనీస కోరికలు (1) నాయొక్క కులం, మతం, ప్రాంతం, ఆహారపుటలవాట్లు, భాష, యాస, లింగభేదం వీటితో నిమిత్తంలేని సుపరిపాలన. (2) నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలికవసతులు, కల్తీలేని సత్వర న్యాయం, ఉద్యోగసంస్కరణల ద్వారా అవినీతిరహిత పాలనా వ్యవస్థ ఏర్పాట్లు. (3) మహిళలందరికీ శాశ్వతప్రాతిపదికన భద్రత.

జుగాడ్ ఓటర్లు తమ యొక్క కష్టార్జితమైన డబ్బు రెండు వేల రూపాయలు, లేదా అయిదువేల రూపాయలు, గరిష్టంగా పదివేలరూపాయలు ఒకే ఒకమారు విరాళమిచ్చి తమ పార్టీని తామే సమిష్టిగా "నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం అనే ఏకైక సిద్ధాంతం ప్రాతిపదికపై నిర్మించుకుని తద్వారా ప్రభుత్వాన్ని ఏర్పరుచుకుంటారు. కార్యకర్తగా వ్యవహరించదలచిన పది వేల రూపాయిల విరాళదాత తనయొక్కసత్ప్రవర్తన విశ్వసనీయతతో తనయొక్క సమీప బంధుమిత్రులనుండి కనీసం పదిమంది జుగాడ్ ఓటర్ల మద్దతు సేకరించుకోగలిగిన నాయకత్వ సామర్థ్యం కలిగి ఉండాలి. అప్పుడు ఎమ్మెల్యేగా కానీఎంపీగా కానీ పోటీ చేసే అర్హత వస్తుంది. జుగాడ్ (అధినేత రహిత) పార్టీకి పేరు ఇంకా ఏదీ పెట్టలేదు. జుగాడ్ ఓటర్ల సూచనల ప్రకారం పార్టీ నిర్వహణ జరుగుతుంది. జుగాడ్ ఓటర్ వివాహితులైతే దంపతులిరువురికీ గుర్తింపు లభిస్తుంది. ఇంకా ఎన్నో న్యూనతలు...

ఈనెలలో జుగాడ్ ఓటరు గా నమోదయిన భారతభాగ్య విధాత Dr. G.Abbaiah విశ్రాన్త సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ (కాకినాడ) గారికి స్వాగతం.....

రండి! మంచి రాజకీయాలకు స్వాగతం పలకండి!! విజయదశమి శుభాకాంక్షలతో

Please contact: (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your Contact. Cell No:

పదివేల రూ.. విరాళమిచ్చిన భావిభారత భాగ్య విధాతలు : M.Parthasarathy (A Jugaad Voter and Karyakarta) (2) K.Subrahmanyam (3) Col.P.V.Ramanarao (4) U.Subba Rao (5) C.K.Murthy (6) Syed Ansari (7) Smt.D.Kasturi (8) K.Srinivas Murthy (9) Dr.Vamsi Raj (10) Dr. G.Abbaiah

ADVT

# ప్లాస్టిక్ కావాలా? ప్రాణాలు కావాలా?

## మనోహరి వెలమాటి, గ్రామదీప్ సంస్థ వ్యవస్థాపకురాలు

మనం రోజూ వాడి నిర్లక్ష్యంగా నేల మీదకి, నీటిలోకి విసిరి పారేస్తున్న ప్లాస్టిక్ గాలిలో, భూమిలో, నదులూ సముద్రాలలో కలిసి, ఐదు మిల్లీమీటర్ డయామీటర్ కన్నా తక్కువ పరిమాణంతో విష రసాయనాలు గల కంటికి కనిపించని మైక్రోప్లాస్టిక్స్‌గా విచ్ఛిన్నమై, తిరిగి మనం కంచంలోకే ఆహారమై వస్తోంది. మనం పీల్చే గాలై మన ఊపిరితిత్తుల్నే చేరుకుంటోంది. భూగర్భ జలాల్లో కలిసి తాగే నీరై చివరికి మన రక్తంలోనూ ప్రవహిస్తోంది. మనం చేస్తున్న పాపం మనకే తిరిగొస్తోంది.

ప్లాస్టిక్ వినియోగం విషమ స్థాయికి చేరుకుంది. గత కొన్నేళ్లలో విడుదలైన గగుర్పొడిచే పరిశోధనా ఫలితాలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ఈ భూమిని, మన పర్యావరణాన్ని, మానవ మనుగడను కాపాడుకోవటానికి, ఐక్యరాజ్యసమితితో భారత ప్రభుత్వం ప్లాస్టిక్ నియంత్రణకు చేతులు కలిపింది. మొదటి దశలో జులై 1, 2022 నుంచి, మన దేశంలో కూడా జాతీయ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు, ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువుల తయారీ, దిగుమతి, నిల్వ, పంపిణీ, అమ్మకం, వినియోగాన్ని నిషేధించారు. 75 మైక్రాన్‌ల కన్నా తక్కువ ఉన్న క్యారీ బ్యాగులు, వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ స్టిక్స్, ప్లాస్టిక్ ప్లేట్లు, స్పూనులు, గ్లాసులు, ఫోర్కులు, కప్పులు, స్ట్రాలు, చాకులు, ప్లాస్టిక్ జెండాలు, వ్రాపింగుకి వాడుతున్న ప్లాస్టిక్, తెర్మోకాల్ ప్లేట్లు, కప్పులు మొదలైనవి, 100 మైక్రాన్‌ల కన్నా తక్కువగా ఉన్న పీవీసీ బ్యానర్లను నిషేధించారు. కాని, వీటి అమ్మకం, వినియోగం ఇంకా విచ్చలవిడిగా సాగుతూనే ఉంది.

ప్లాస్టిక్ అనేది భూమిలోని క్రూడ్ ఆయిల్, న్యాచురల్ గ్యాస్ నుంచి తయారయ్యే పాలిమర్స్. కనీసం వెయ్యి సంవత్సరాలు కూడా ఉండగల ఈ మ్యాజిక్ మెటీరియల్ వినియోగం 1950ల్లో ప్లాస్టిక్ కర్మాగారాల ఆరంభంతో మొదలైంది. 1950 నుండి 2017 వరకు, కనీసం 9.1 బిలియన్ టన్నులు ప్లాస్టిక్ ఉత్పత్తి అయితే, అందులో కేవలం తొమ్మిది శాతాన్ని మాత్రమే పునర్వినియోగం (రీసైక్లింగ్) చేశాం. ప్లాస్టిక్ వల్ల ప్రతీ సంవత్సరం ఎన్నో వేల జీవజాతులు అంతరించిపోతున్నాయి. ప్లాస్టిక్ గ్రీన్‌హౌస్ గ్యాసులకు కారణమై గ్లోబల్ వార్మింగ్ సమస్యను పెద్దది చేస్తుంది. ఎన్నో జీవరాశుల ఆహారగొలుసులో ప్లాస్టిక్ కణాలు చేరుతున్నాయి. అంటార్కిటికాలో అప్పుడే పడిన మంచుపైనా ప్లాస్టిక్ కనిపిస్తోంది. ఎక్కడో 30 వేల అడుగుల సముద్రపు లోతులో ఉన్న మరియానా ట్రెంచిలో కూడా ప్లాస్టిక్ క్యారీబ్యాగ్ కనిపిస్తుంది. దీన్నిబట్టి ఏ స్థాయిలో మనం ఈ



భూమిని కలుషితం చేశామో అర్థమవుతుంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం, నీటిపై ప్లాస్టిక్ చెత్త, సముద్రపు అంచుపై కనీసం 51 ట్రిలియన్ కణాలుగా విచ్ఛిన్నమై తేలుతున్నది. ఇవి ఏటా ఎన్నో లక్షల సముద్రపు పక్షులు, చేపలు, అరుదైన తాబేళ్ల ఆహారంలో చేరి, లేదా అడ్డుపడటం వల్ల ఆ జీవులు మరణిస్తున్నాయి. సముద్రపు పక్షుల్లో గుడ్ల మందం తగ్గటం, ఎన్నో రకాల చేపలు, జీవరాశుల హార్మోన్లలో మార్పులు.. వీటన్నిటికీ ప్లాస్టిక్కే కారణం. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవటం అంటే, మనల్ని మనం కాపాడుకోవటం. మన పర్యావరణంలో సమతుల్యత లేకపోతే, మన వాతావరణం పాడైతే అది మన మనుగడకే కష్టం.

ప్లాస్టిక్ సముద్రంలో చేస్తున్న కాలుష్యం కంటే, భూమి మీద మైక్రోప్లాస్టిక్స్ వల్ల, మన నేల జలమార్గాల కాలుష్యం మరింత ఎక్కువగా ఉందని పరిశోధకులు సూచిస్తున్నారు. చివరికి ఆ పదార్థాలన్నీ మానవులు, జంతువుల శరీరాల్లోకే ప్రవేశిస్తున్నాయి. సముద్రపు ఉప్పు, చేపలు, పీతలు, ఆయిస్టర్స్– ఇలా మనం తినే సీఫుడ్ నుంచి, భూమి మీద పండిస్తున్న పళ్లు, కూరగాయలు, పంటల వరకు మైక్రోప్లాస్టిక్స్‌తో కలుషితమై విష రసాయన లవణాలతో నిండిపోయాయయని అనేక పరిశోధనలు తెలిపాయి. సంవత్సరంలో కనీసం 50 వేల ప్లాస్టిక్ కణాలు మన శరీరంలోకి వెళ్తున్నాయి!

ప్లాస్టిక్‌లోని విష రసాయనాలు కాలేయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్, బ్రెయిన్ క్యాన్సర్ వంటి ఎన్నో ప్రమాదకర రోగాలకు కారణమవుతున్నాయి. గాలిలో ప్లాస్టిక్ కాలుష్యం వల్ల తీవ్ర శ్వాసకోశ సమస్య, ఎలర్జిక్ రియాక్షన్స్, కణాలు చనిపోవటం, రోగనిరోధక శక్తిని కోల్పోవటం,

చిన్ననాటికే ఉబ్బసం సంభవిస్తున్నాయి. 0.001 మిల్లీమీటర్ డయామీటర్ కల నానో ప్లాస్టిక్స్ మెదడుకు చేరి బ్రెయిన్ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. ఎండోక్రైన్ గ్లాండ్‌కు అంతరాయం కలిగించే లక్షణాలను కలిగి ఉండటంతో నానో ప్లాస్టిక్ నేరుగా మనిషి హార్మోన్లపైన, ఎదుగుదల పైన ప్రభావం చూపుతుంది. ఆందోళన సంబంధిత రుగ్మతలు, మెదడులోని బలహీనత, నాడీ సంబంధ సమస్యలతో పాటు అల్జీమర్స్, జీవక్రియ వ్యాధి, టైప్ 2 మధుమేహం, హృదయ సంబంధ వ్యాధులకు కారణమవుతున్నాయి. ప్లాస్టిక్ ఎర్ర రక్తకణాల ఔటర్ మెంబ్రేనుకు చేరి ఆక్సిజన్‌ను శరీరం అంతా ప్రవహింపచేసే వాటి శక్తిని బలహీనపరుస్తుంది.

ఆరోగ్యంగా ఉన్న 22 మంది పెద్దవారి రక్తనమూనాలను అధ్యయనం చేస్తే, అందులో 17 మంది రక్తంలో మైక్రోప్లాస్టిక్స్ ఉన్నట్టు తేలింది. అవి ముఖ్యంగా మినరల్ వాటర్ బాటిల్స్ తయారీలో ఉపయోగించే పాలీ ఎతిలిన్ టెరాతెలేట్ (పిఇటి), క్యారీబ్యాగ్స్, ఫుడ్ ప్యాకేజింగ్, పాల ప్యాకెట్లకు ఉపయోగించే పాలీఎతిలిన్ అని 'ఎన్విరాన్‌మెంట్ ఇంటర్నేషనల్' 2022 జర్నల్ ప్రచురించింది. ఏటా 500 బిలియన్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ తయారవుతున్నాయి. ప్రపంచంలో ఒక్క సెకండులోనే పది లక్షల వాటరు బాటిల్స్ అమ్ముడవుతున్నాయని నివేదిక. ఒక లీటరు మినరల్ వాటరు బాటిల్లో, ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్లలో సైతం, 325 కంటికి కనపడని మైక్రోప్లాస్టిక్స్ ఉన్నాయని స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ అధ్యయనంలో తెలిసింది. సూర్యరశ్మి బాటిల్స్‌కి నేరుగా తగలటం వల్లే కాదు, ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే సందర్భంలోను, రీసైక్లింగ్ అప్పుడూ ప్లాస్టిక్ విచ్ఛిన్నం కావొచ్చని తెలిపారు. 'వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్' 2019లో ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రతీ వారం మనిషి గాలి ద్వారా, ఆహారం ద్వారా కనీసం 5 గ్రాముల ప్లాస్టిక్‌ను శరీరంలోకి తీసుకుంటున్నాడు. అంటే మనం ప్రతీవారం ఒక క్రెడిట్ కార్డును మింగుతున్నామనుకోవాలి. అప్పుడే పుట్టిన శిశువుల్లో బొడ్డు తాడు రక్తంలోనూ విష రసాయనాలు ఉంటున్నాయి, పసిపిల్లల మల వ్యర్థాలలో అయితే పెద్దవారి కన్నా పదిరెట్లు ఎక్కువ మైక్రోప్లాస్టిక్స్ కనిపించాయి. మనం ధరించే ప్లాస్టిక్‌తో నేయబడిన ఫేస్ మాస్కుల వల్ల కూడా నేరుగా ఊపిరితిత్తుల్లోకి ప్లాస్టిక్ తీసుకుంటున్నాం.

ప్రతీ రోజూ విష రసాయనాలు పీలుస్తూ, తాగుతూ, తింటూ, భయంకర రోగాలకు బలవుతూ, ఈ భూమికే భవిష్యత్తు లేకుండా చేసే ఈ ప్లాస్టిక్‌తో సహజీవనం మనకు అవసరమా? మనకు ప్లాస్టిక్ నిషేధించటం తప్ప వేరే మార్గం ఉందా? ఇప్పుడు కూడా మనం మేలుకోకపోతే, మన తాత్కాలిక సౌకర్యం అంటూ, మన వ్యాపార లాభాలు అంటూ లెక్కలేసుకుంటూ కూర్చుంటే మనమెక్కిన కొమ్మను మనమే నరికేసుకున్నట్టే. పూర్తిగా పతనమవ్వకముందే మేల్కొందాం. మన రోజువారి జీవితంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం ఉన్న, హానిచేయని మట్టి, గాజు, స్టీలు, సెరామిక్, చెక్క, చెట్ల నుండి వచ్చే అనేక బయోడిగ్రేడబుల్ సహజ పదార్థాలతో చేసిన వస్తువులను ఎంచుకుందాం. ప్లాస్టిక్ బ్యాన్ అనేది కేవలం ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల బాధ్యతే కాదు, బాధ్యత గల పౌరులుగా ఎవరికివారం మన పరిధిలో కృషి చెయ్యాలి. ఇలా అందరం కలిసి ఉద్యమ రూపంలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తేనే మనకు మనుగడ, ఈ భూమికి మనుగడ!

# ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు విజ్ఞతతో మాట్లాడాలి




**అమరావతి రైతుల పాదయాత్రపై ఉత్తరాంధ్రలోని మంత్రులు, శాసన సభ్యులు సంయమనం పాటించాలని, అనవసర మాటలతో రెండు ప్రాంతాల ప్రజల మధ్య కృత్రిమ ఘర్షణ వాతావరణాన్ని సృష్టించవద్దని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ విజ్ఞప్తి చేశారు. అమరావతిలో పరిణామాలపై ప్రజలకు అవగాహన ఉందని, లేనిపోని తంపులు పెట్టవద్దన్నారు. రాష్ట్ర విభజన సమయంలో నాయకులు చేసిన విన్యాసాల్ని ఏపీ ఎప్పటికీ మర్చిపోదన్నారు. ఇప్పటికైనా కొంత విజ్ఞత ప్రదర్శించాలని.. ఉత్తరాంధ్రపై అంత ప్రేమ ఉంటే ఇన్నాళ్లూ ఎందుకు అభివృద్ధి చేయలేదో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. మూడు రాజధానుల్ని ప్రకటించాక కూడా విశాఖను వైకాపా ప్రభుత్వం అభివృద్ధి చేయలేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి ఆందోళన చెందుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో మూతపడ్డ ఫ్యాక్టరీలను వెంటనే తెరిపించి రైతులు, కార్మికులను ఆదుకోవాలని, నాలుగు జిల్లాల నుంచి ఎంతమంది ప్రజలు పొట్ట చేత పట్టుకుని వలస పోతున్నారో తెలుసుకుంటే మంచిదన్నారు. రాజధాని అంశం అలా ఉంచితే.. అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేసి ఆర్థిక కేంద్రంగా తయారుచేయటం రాష్ట్రాభివృద్ధికి అవసరమని బాబ్జీ అన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు వి.హరిగణేష్, గౌరీశంకర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.**

# 75 ఏళ్ల స్వతంత్ర భారతం - 50 పుస్తకాలు


## - రామచంద్ర గుహ, చరిత్రకారులు


స్వతంత్ర భారతదేశ ప్రజాస్వామిక సంస్థల విశ్లేషణాత్మక చరిత్రను గతంలో ఇదే కాలమ్ (ఆగస్టు 13, 'స్వేచ్ఛాభారతంలో తెగని శృంఖలాలు')లో సంక్షిప్తంగా సమకూర్చాను. ఇప్పుడు, మన రిపబ్లిక్ సాఫల్య వైఫల్యాలను అర్థం చేసుకోవటానికి నాకు ఉపయోగపడిన పుస్తకాల జాబితా నొకదాన్ని సమర్పిస్తున్నాను. నేను ఎంపిక చేసిన 50 పుస్తకాల జాబితా 'భారతదేశ చరిత్ర'కు కాకుండా 'స్వతంత్ర భారతదేశం'కు సంబంధించినది మాత్రమే. పుస్తక ప్రచురణ సంవత్సరాన్ని బ్రాకెట్‌లో పేర్కొన్నాను.

గ్రాన్ విల్లె ఆస్టిన్ 'ది ఇండియన్ కాన్‌స్టిట్యూషన్: కార్నర్ స్టోన్ ఆఫ్ ఏ రిపబ్లిక్' (1966)తో నా జాబితా ప్రారంభమవుతుంది. భారత రాజ్యాంగ సభ చర్చలపై ఇదొక ప్రసిద్ధ పుస్తకం. దీనితోపాటు, సామాజిక శాస్త్ర దృక్పథంతో నీరజా గోపాల్ జయాల్ రాసిన 'సిటిజన్‌షిప్ అండ్ ఇట్స్ డిస్‌కంటెంట్స్: ఏన్ ఇండియన్ హిస్టరీ' (2013) మరొకటి. స్వతంత్ర భారతదేశ మొదటి దశాబ్దంలో చోటుచేసుకున్న సంస్థానాల విలీనంపై ఇప్పటికీ అత్యుత్తమ పుస్తకం వి.పి మీనన్ 'ఇంటిగ్రేషన్ ఆఫ్ ది ఇండియన్ స్టేట్స్' (1956). సర్దార్ పటేల్‌తో కలిసి పనిచేసిన సివిల్ సర్వెంట్ మీనన్. భాషాప్రయుక్త రాష్ట్రాల విషయానికి వస్తే రాబర్ట్ డి.కింగ్ రాసిన 'నెహ్రూ అండ్ ది లాంగ్వేజ్ పాలిటిక్స్ ఆఫ్ ఇండియా' (1977)ను చదవాలి. చరిత్ర నిర్మాతల జీవిత చరిత్రల్లో ముఖ్యమైనవి వాల్టర్ క్రోస్కెర్ రాసిన 'నెహ్రూ: ఏ కాంటెంపరరీస్ ఎస్టిమేట్' (1966), రాజ్‌మోహన్ గాంధీ 'పటేల్: ఏ లైఫ్' (1990), కేథరిన్ ఫ్రాంక్ 'ఇందిర: ది లైఫ్ ఆఫ్ ఇందిరా నెహ్రూ గాంధీ' (2001), సి.పి శ్రీవాస్తవ 'లాల్ బహదూర్ శాస్త్రి' (1955), ధనంజయ్ కీర్ 'అంబేద్కర్' (రివైజ్‌డ్ ఎడిషన్ 1990), అలన్, వెండీ స్కార్పెల 'జె.పి: హిజ్ బయోగ్రఫీ' (1975), ఎలెన్ కరోల్ దుబాస్, వినయ్ లాల్‌ల సంయుక్త సంపాదకత్వంలో వెలువడిన 'ఏ ప్యాషనేట్ లైఫ్: రైటింగ్స్ బై అండ్ ఆన్ కమలాదేవి ఛటోపాధ్యాయ' (2017). స్వాతంత్ర్యం లభించిన కొద్దినెలలకే కన్నుమూసిన మహాత్ముడి అజరామర ప్రభావంపై ఆసక్తి ఉన్నవారు రజని బక్షి 'బాపు కుటి: జర్నీస్ ఇన్ రీ డిస్కవరీ ఆఫ్ గాంధీ' (1998) గ్రంథాన్ని తప్పక చదవాలి.


అంబేద్కర్, నెహ్రూలు స్వతంత్ర భారతదేశ విఖ్యాత రాజనీతిజ్ఞులు. వాలెరియన్ రోడ్రిగ్స్ సంపాదకత్వంలో వెలువడిన 'ది ఎస్సెన్షియల్ రైటింగ్స్ ఆఫ్ బి.ఆర్ అంబేద్కర్' (2002), పురుషోత్తమ్ అగర్వాల్ సంపాదకత్వంలో వెలువడిన 'హూ ఈజ్ భారత్‌మాత? హిస్టరీ కల్చర్ అండ్ ది ఐడియా ఆఫ్ ఇండియా: రైటింగ్స్ బై అండ్ ఆన్ జవహర్‌లాల్ నెహ్రూ' (2019)ను చదవాలి. ఇటీవలి కాలంలో ఆరెస్సెస్ సిద్ధాంతకర్త ఎం.ఎస్ గోల్వాల్కర్ ప్రభావం బాగా పెరిగింది కనుక, ఆయన రచనల, ఉపన్యాసాల సంకలనం 'ఏ బంచ్ ఆఫ్ థాట్స్' (1966)ను కూడా ఈ జాబితాలో చేరుస్తున్నాను. స్వతంత్ర భారతదేశ రాజకీయ పరిణామాల గురించి 'ఆక్స్‌ఫర్డ్ కంపానియన్ టు ఇండియన్ పాలిటిక్స్' (2010) ప్రశస్తంగా సమీక్షించింది. వయోజన ఓటింగ్ హక్కు ఎందుకు కల్పించారనేది అర్థం చేసుకునేందుకు ఆర్నిట్ షాని 'హౌ ఇండియా బికేమ్ డెమోక్రాటిక్' (2017) చదవాలి. ఎన్నికల రాజకీయాల భ్రష్ట ధోరణులను మిలాన్ వైష్ణవ్ 'వెన్ క్రైమ్ పేస్: మనీ అండ్ మజిల్ పాలిటిక్స్' (2017) మన కళ్లకు కట్టిస్తుంది. ఆర్ఎస్ఎస్‌పై ఇప్పటికీ అత్యుత్తమ గ్రంథం దేశ్‌రాజ్ గోయల్ రచన 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' (1979).

స్వతంత్ర భారతదేశ ఆర్థిక విధాన చరిత్రను ఫ్రాన్సినె ఫ్రాంకెల్ తన 'ఇండియాస్ పొలిటికల్ ఎకానమీ, 1947–2004'లో చక్కగా వివరించారు. వర్తమాన భారతదేశ ఆర్థిక సవాళ్లను నౌషాద్ ఫోర్బ్స్ తన 'ది స్ట్రగుల్ అండ్ ది ప్రామిస్: రెస్టోరింగ్ ఇండియాస్ పొటెన్షియల్' (2022) వివరించారు. రక్షణ, విదేశాంగ విధానాల ప్రశస్త సమీక్షలను వరుసగా శ్రీనాథ్ రాఘవన్ 'వార్ అండ్ పీస్ ఇన్ మోడర్న్ ఇండియా' (2009)లోనూ, శివ శంకర్ మీనన్






'ఛాయిసెస్: ఇన్‌సైడ్ ది మేకింగ్స్ ఆఫ్ ఇండియాస్ ఫారిన్ పాలసీ' (2016)లో చూడవచ్చు. చైనాతో మన జటిల సంబంధాలను కాంతి బాజ్‌పాయి తన 'ఇండియా వర్సెస్ చైనా: వై దే ఆర్ నాట్ ఫ్రెండ్స్' (2021)లో వివరించారు.

స్వతంత్ర భారత రాజ్య వ్యవస్థ పునాదులు పార్లమెంటు, సుప్రీంకోర్టు, సివిల్ సర్వీస్‌లు. ఈ సంస్థల, వ్యవస్థల పాత్రను దేవేష్ కపూర్, ప్రతాప్‌భాను మెహతా, మిలాన్ వైష్ణవ్‌లు 'రీథింకింగ్ పబ్లిక్ ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్ ఇండియా' (2019)లో ప్రతిభావంతంగా విశ్లేషించారు. మన సాయుధ బలగాల గురించి స్టీవెన్ విల్కిన్సన్ 'ఆర్మీ అండ్ నేషన్: ది మిలిటరీ అండ్ ఇండియన్ డెమోక్రసీ' (2015)లో విశ్లేషించారు. నరేంద్ర మోదీ ప్రాభవాలకు పూర్వం మీడియా పరిణామాత్మక చరిత్రను రాబిన్ జెఫ్రీ 'ఇండియన్ న్యూస్ పేపర్ రివల్యూషన్: క్యాపిటలిజం, పాలిటిక్స్




అండ్ ది ఇండియన్ లాంగ్వేజ్' (2000)లో విశ్లేషించారు.

గ్రామీణ భారతంలో కుల వ్యవస్థ పోకడలపై భారతీయ సామాజిక శాస్త్రవేత్త ఎం.ఎన్ శ్రీనివాస్ రాసిన 'ది రిమెంబర్డ్ విలేజ్' (1977), డచ్ స్కాలర్ జన్ బ్రైమన్ గ్రంథం 'ప్యాట్రనేజ్ అండ్ ఎక్స్‌ప్లాయిటేషన్' (1974) ప్రామాణికమైనవి. ముస్లింల స్థితిగతులపై ముషిరుల్ హసన్ రాసిన 'లెగసీ ఆఫ్ ఏ డివైడెడ్ నేషన్: ఇండియాస్ ముస్లిమ్స్ సిన్స్ ఇండిపెండెన్స్' (1977), ఆదివాసుల సమస్యలపై నందినీ సుందర్ సంపాదకత్వంలో వెలువడిన 'ది షెడ్యూల్డ్ ట్రైబ్స్ అండ్ దెయిర్ ఇండియా' (2016) ముఖ్యమైనవి. ఏ రాష్ట్రానికి సంబంధించీ సమగ్ర పరిశోధనాత్మక చరిత్రలు పెద్దగా వెలువడలేదు. అయితే రాబిన్ జెఫ్రీ పుస్తకం 'పాలిటిక్స్, ఉమెన్, అండ్ వెల్-బీయింగ్: హౌ కేరళ బికేమ్ ఎ మోడల్' (1992), తమిళనాడు గురించి నరేంద్ర సుబ్రమణియన్ రాసిన 'ఎథ్నిసిటీ అండ్ పాప్యులిస్ట్ మొబిలైజేషన్' (1999) అందుకు మినహాయింపు.

సామాజిక ఉద్యమాలకు సంబంధించి డి.ఆర్ నాగరాజ్ 'ది ఫ్లేమింగ్ ఫీట్: ది దళిత్ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా' (2010), మహిళా ఉద్యమంపై రాధాకుమార్ 'ఎ హిస్టరీ ఆఫ్ డూయింగ్: ఏన్ ఇలస్ట్రేటెడ్ ఎకౌంట్ ఆఫ్ మూవ్‌మెంట్స్ ఫర్ ఉమెన్స్ రైట్స్ అండ్ ఫెమినిజం' (1993), వెనుకబడిన కులాల పోరాటాలపై క్రిష్టోఫె జెఫ్రిలాట్ 'ఇండియాస్ సైలెంట్ రివల్యూషన్' (2003), పర్యావరణ ఉద్యమంపై శేఖర్ పాఠక్ 'ది చిప్కో మూవ్‌మెంట్: ఏ పీపుల్స్ హిస్టరీ' (2020) ముఖ్యమైనవి.

కశ్మీర్ వివాదంపై అయిదు దశాబ్దాల క్రితమే వెలువడిన శిశిర్ గుప్తా పుస్తకం 'కశ్మీర్: ఏ స్టడీ ఇన్ ఇండియా–పాకిస్తాన్ రిలేషన్స్' (1965) ప్రశస్తమైనది. ఈశాన్య రాష్ట్రాల వేర్పాటు ఉద్యమాలను సంజీవ్ బారువా రాసిన 'ఇన్ ది నేమ్ ఆఫ్ ది నేషన్: ఇండియా అండ్ ఇట్స్ నార్త్ ఈస్ట్' (2020) లోతుగా విశ్లేషించింది. మావోయిస్టు తిరుగుబాట్లు, వాటి విస్తృత పర్యవసానాల గురించి నందినీ సుందర్ పుస్తకం 'ది బర్నింగ్ ఫారెస్ట్' (2016) చదవాలి.

జీవితకాల పరిశోధనలు, అధ్యయనాల ఆధారంగా ఇద్దరు విద్యావేత్తలు రాసిన రెండు పుస్తకాలను పేర్కొంటాను. అవి: ప్రముఖ ఆర్థికవేత్త జీన్ డ్రెజె రాసిన 'సెన్స్ అండ్ సాలిడారిటీ: ఝోలావాలా ఎకనామిక్స్ ఫర్ ఎవ్రీవన్' (2017), విఖ్యాత సామాజిక శాస్త్రవేత్త ఆంద్రె బెటిల్లె రాసిన 'క్రానికల్స్ ఆఫ్ అవర్ టైమ్' (2000). జర్నలిస్టులు రాసిన నాలుగు ఉత్తమ గ్రంథాలు: ముంబయి మురికివాడపై కేథరీన్ బూ కథనం 'బిహైండ్ ది బ్యూటిఫుల్ ఫరెవర్స్' (2012), గ్రామీణ భారతంలో మనుగడ, సంఘర్షణలపై పాలగుమ్మి సాయినాథ్ విశ్లేషణ 'ఎవ్రీబడీ లవ్స్ ఏ గుడ్ డ్రాట్', గత సార్వత్రిక ఎన్నికలపై రాజ్‌దీప్ సర్దేశాయ్ విశ్లేషణాత్మక కథనం '2019: హౌ మోదీ వన్ ఇండియా' (2020), విదేశీ పాత్రికేయుడు మార్క్ టుల్లీ వ్యాస సంకలనం 'నో ఫుల్‌స్టాప్స్ ఇన్ ఇండియా' (1991).

నేను ఇష్టపడిన నాలుగు ఆత్మకథల్లో రెండు దళితులు రచించినవి. సుజాత గిడ్ల ఆంగ్లంలో రాసిన 'యాంట్స్ ఎమాంగ్ ఎలిఫెంట్స్' (2017) వాటిలో ఒకటి కాగా, ఓం ప్రకాష్ వాల్మీకి హిందీలో రాసిన 'జూఠాన్' మరొకటి. మిగతా రెండు, మధ్యతరగతి ప్రజల జీవన వాస్తవాలను వర్ణిస్తూ పద్మా దేశాయ్ ఆంగ్లంలో రాసిన 'బ్రేకింగ్ ఔట్' (2012), మరొకటి కార్మికవర్గ నేపథ్యంలో మాలికా అమర్ షైఖ్ మరాఠీలో రాసిన 'ఐ వాంట్ టు డిస్ట్రాయ్ మై సెల్ఫ్'. జెర్రీ పింటో దీన్ని 2019లో ఆంగ్లంలోకి అనువదించారు.

పై పుస్తకాలలో కొన్నిటినైనా చదవటానికి ఆసక్తి చూపుతారని ఆశిస్తున్నాను. ఏవో కొన్ని మినహా అన్నీ ప్రింట్‌లో లభ్యమవుతున్నాయి. **(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**

# బూర్గుల లాంటి నేతలు నమ్మలేని నిజాలవుతున్నారు



బూర్గుల రామకృష్ణారావు లాంటి నేతలు మహాత్మాగాంధీ నేతృత్వంలో జాతీయోద్యమంలో పాల్గొని ఇంత నిస్వార్థంగా పనిచేశారని రాబోయే తరాలు నమ్మలేని రీతిలో మన వ్యవస్థల పనితీరు ఉందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. జాగీర్దార్ కుటుంబంలో పుట్టినా వ్యక్తిగత సౌఖ్యం కోసం కాకుండా.. సామాన్య రైతుల కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం బూర్గుల పోరాడారన్నారు. నిజాం నవాబు దర్బార్‌లో దర్జా పదవిని పొందే అవకాశమున్నా, దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రజాస్వామ్య విలువల కోసం జాతీయోద్యమంలోకి దూకారన్నారు. స్వతంత్రం వచ్చాక హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా.. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ ఏర్పడుతోందనగానే ముఖ్యమంత్రి పదవిని చిరునవ్వుతో వదిలేశారన్నారు. హైదరాబాద్‌లో బూర్గుల విగ్రహం వద్ద ఆయన కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో జేపీ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. బూర్గుల పదవుల్ని తృణప్రాయంగా వదిలేయటంతోపాటు ఏనాడూ వారసత్వ రాజకీయాల్ని చేయలేదని జేపీ అన్నారు. బూర్గుల కుటుంబసభ్యులు సాధారణ పౌరుల్లా జీవిస్తున్నారన్నారు. జాతి నిర్మాణమే లక్ష్యంగా జీవించిన బూర్గుల నుండి నేతలు నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని.. ప్రజాజీవితంలో ఉన్నాను కాబట్టి ఎల్లకాలం తనను, తదనంతరం తన వారసుల్ని సమాజం పోషించాలని ఆశించే ధోరణుల్ని మానుకోవాలని, ఆధునిక రాచరిక ధోరణుల్ని వీడి ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని అన్నారు. బూర్గులతోపాటు జాతీయోద్యమం కోసం జీవితాల్ని వెచ్చించిన నేతలందరికీ జేపీ నివాళులర్పించారు. బూర్గులపై పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

## జిందాల్ సమస్యను చట్టసభలో చర్చించి పరిష్కరించండి

విజయనగరం జిల్లాలో జిందాల్ కర్మాగారానికి భూములు ఇచ్చి నష్టపోయిన రైతుల గురించి శాసనమండలిలో ప్రస్తావించి, ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం జరిగేలా చూడాలని స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుడు ఇందుకూరి రఘురాజుని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి కాండ్రేగుల ప్రసాద్ కోరారు. 2009లో జిందాల్ కర్మాగారం కోసం భూసేకరణ జరిగినప్పుడు రైతులు భూములు ఇవ్వాలని రఘురాజు కూడా చెప్పారని, రైతులకు అన్యాయం జరిగితే పట్టించుకోకపోవటం ఏం సబబని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని పొగడటానికి పరిమితం కాకుండా రైతుల సమస్యపై చట్టసభ సాక్షిగా చర్చ చేయాలన్నారు. కాగా, లోక్‌సత్తా పార్టీ డిమాండ్‌కు స్పందించి మండలిలో ఈ అంశాన్ని రఘురాజు ప్రస్తావించారు. ఇందుకు కృతజ్ఞత తెలియచేస్తూ రైతులకు న్యాయం జరిగే వరకు ఎమ్మెల్సీ విశ్రమించకూడదని ప్రసాద్, లోక్‌సత్తా నేతలు పి.అచ్చినాయుడు, కె.కొండలరావు కోరారు. జిందాల్ కర్మాగారం భూసేకరణలో అక్రమాలను లోక్‌సత్తా వెలికితీసిన సంగతి తెలిసిందే.

## పోలవరంపై వాస్తవాలు తేల్చేందుకు కమిటీ వేయండి


పోలవరం ప్రాజెక్టు వైఫల్యం వెనక ఎవరి పాత్ర ఉందో ప్రజలకు తెలియాలంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అధ్యక్షతన నిజనిర్ధారణ కమిటీ వేయాలని, అలాగే లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఇప్పటికే స్వతంత్ర నిపుణుల కమిటీ రూపొందించిన నివేదిక ఆధారంగా ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ సూచించారు. లోక్‌సత్తా నివేదికకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన తెలుగేతర నిపుణు లు కూడా ఆమోదం తెలిపారని గుర్తుచేశారు. 'చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రణాళికలు లేకుండా నిర్మించారని జగన్ పదేపదే ఆరోపిస్తున్నారు, వైకాపా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని చంద్రబాబు అంటున్నారు. పోలవరంపై హైదరాబాద్ ఐఐటీ నివేదిక భిన్నంగా ఉంది. మంత్రి అంబటి రోజుకో ప్రకటన చేస్తున్నారు. వీటిల్లో నిజానిజాలు తెలియటం లేదు' అన్నారు. పరస్పర విమర్శలకు ఫుల్‌స్టాప్ పడి ప్రాజెక్టు పనులు జరగటం మీద మనమంతా దృష్టి పెట్టటం ఇప్పటికైనా అవసరమని బాబ్జీ అన్నారు.

(గత సంచిక తరువాయి)

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జులై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

### 5.6. ద్వితీయ శ్రేణి వైద్యం వ్యయ అంచనా

ద్వితీయ స్థాయి ఆస్పత్రి వైద్యంలో ప్రతిపాదిత నమూనాకు అయ్యే వ్యయాన్ని అంచనా వేయటానికి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ కార్యక్రమం ఒక ప్రాతిపదికగా ఉపయోగపడుతుంది. 2019-20 ఇప్పటిదాకా ఆరోగ్యశ్రీపై అత్యధికంగా ఖర్చు చేసిన సంవత్సరం. 5.4 కోట్ల జనాభా గల ఆంధ్రప్రదేశ్ ఆ ఏడాది ఆ పథకంపై రూ. 1,579 కోట్లను ఖర్చు చేసింది. ద్వితీయ, తృతీయ స్థాయి చికిత్సలు రెంటినీ కూడా కలుపుకుంటూ 2,436 చికిత్సలను కవర్ చేసింది. ఈ వ్యయాన్ని సమగ్రంగా విశ్లేషిస్తే, వ్యయంలో రూ. 700 కోట్లు, లేదా 44 శాతాన్ని తృతీయ స్థాయి చికిత్సలు - క్యాన్సర్ చికిత్స, బహుళ ట్రౌమా, ఎముకలు, కీళ్ల సంబంధ శస్త్ర చికిత్సలు, గుండె జబ్బులు, గుండె శస్త్రచికిత్సలు, మూత్రపిండాల వైఫల్యం, డయాలసిస్‌లపై ఖర్చు చేశారు. మన నమూనాలో, తృతీయ స్థాయి సంరక్షణను వేరుగా, బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రులలో తగినన్ని నిధులు సమకూర్చటం ద్వారా చేస్తారు. ఆ వివరాల్ని స్థూలంగా తదుపరి అధ్యాయంలో చూడవచ్చు. తృతీయ స్థాయి వైద్య ఖర్చుల్ని తీసేస్తే, ఆంధ్రప్రదేశ్‌లోని 85 శాతం జనాభాకి ద్వితీయస్థాయి వైద్యంపై వెచ్చించే డబ్బు 2019-20లో రూ. 879 కోట్లు. ద్వితీయస్థాయి వైద్యంపై తలసరి ఖర్చు రూ. 192. జనాభా మొత్తానికీ ద్వితీయస్థాయి వైద్యాన్ని వర్తింప చేస్తే రూ. 1035 కోట్లు అవుతుంది. ఇంకా కవర్ చేయాల్సిన ఆరోగ్య సేవలకు 25 శాతం అదనపు ఖర్చుల్ని మనం జోడిస్తే, అవసరమైన చోట ఎక్కువ ఖర్చుని అనుమతిస్తే, 5.4 కోట్ల జనాభాకి ద్వితీయ స్థాయి చికిత్స ఖర్చు రూ. 1300 కోట్ల దాకా ఉంటుంది. అంటే, తలసరి రూ. 240.

ఈ అంకెల్ని వర్తింప చేస్తే, పి.పి.పి నమూనాలో ఏక చెల్లింపుదారు ఇన్సూరెన్స్ ఆధారిత కార్యక్రమంలో ద్వితీయస్థాయి చికిత్సకి మొత్తం దేశానికి ఏటా రూ. 33,000 కోట్ల దాకా అవుతుంది. మొత్తం దేశ జనాభా ఈ కార్యక్రమం కింద సేవల్ని వినియోగించుకుంటుందనుకున్నా, కొత్త సేవలకు అదనంగా 25 శాతం వ్యయం అవుతుందనుకున్నా, అవసరమైన చోట చికిత్సలకు ఎక్కువ ఖర్చును లెక్కేసినా కూడా. నిజానికి 27.27 కోట్ల మంది ప్రజానీకం ఇ.ఎస్.ఐ, ప్రయివేటు ఇన్సూరెన్స్, సి.జి.హెచ్.ఎస్ కింద కవర్ అవుతున్నారు. ఈ విభాగంలోని వారిని మినహాయిస్తే, మన సమాజంలోని మెరుగైన ఆదాయవర్గం ఖరీదైన ప్రయివేటు రంగ సేవల్ని పొందే ధోరణిని పరిగణలోకి తీసుకుంటే, ఆయుష్మాన్ భారత్ ద్వితీయ స్థాయి చికిత్స మీద వాస్తవంగా ఆధారపడిన జనాభా గరిష్టంగా 110 కోట్లు లేదా జనాభాలో 80 శాతంగా తేలుతుంది. 110 కోట్ల మంది సేవల్ని వినియోగించుకుంటారని అంచనా వేసుకుంటే, వార్షిక వ్యయం రూ. 27,000 కోట్ల దాకా ఉంటుంది.

(ఇంకా ఉంది...)



# ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకునే విధానం ఉంటే.. ఎన్‌టీఆర్ పదవీచ్యుతులయ్యేవారు కాదు

ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకునే విధానం ఉంటే.. ఎన్.టి రామారావు పదవీచ్యుతులయ్యేవారు కాదని, నిత్యం అభద్రతతో మనుగడ సాగించాల్సిన, ఎమ్మెల్యేలను సంతృప్తిపరచటానికి అవినీతిని సహిస్తూ దుష్పరిపాలన పేరు మోయాల్సిన దుస్థితి ఈవేళ్టి సీఎంలకూ తప్పుతుందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఎన్‌టీఆర్ శతజయంతి సంవత్సరం సందర్భంగా లోక్‌నాయక్ ఫౌండేషన్ విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. సోషలిజం పేరుతో కొన్ని అసంబద్ధ విశ్వాసాలున్నప్పటికీ లోక్‌నాయక్ జేపీ మూడు ప్రజాస్వామిక లక్ష్యాల కోసం పోరాడారని జేపీ తెలిపారు. ఈ లక్ష్యాల కోసం కాంగ్రెస్‌తో పోరాడారన్నారు. అవే లక్ష్యాల కోసం పోరాటంలో భాగంగానే కాంగ్రెస్ గుత్తాధిపత్యాన్ని ఎన్‌టీఆర్ సవాలు చేసి తెలుగునాట ప్రత్యామ్నాయం సృష్టించటమే కాకుండా.. జాతీయ స్థాయిలో కూడా కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా కూటమిని నిర్మించటంలో విజయం సాధించారన్నారు.

యూనియన్ ప్రభుత్వ ఇష్టారాజ్యానికి కళ్లెం వేసేందుకు బిజూ పట్నాయక్, రామకృష్ణ హెగ్డే, కరుణానిధి, జ్యోతిబసు వంటి ప్రతిపక్ష నేతలతో కలిసి సదస్సులను నిర్వహించి ఫెడరలిజం విస్తరణకు ఎన్‌టీఆర్ పోరాడారన్నారు. రాజ్యాంగం, యూనియన్, రాష్ట్రాల అధికారాల గురించి ప్రజల్లో ఏమాత్రం అవగాహన లేని రోజుల్లో.. ఫెడరలిజం విస్తరణ ఆవశ్యకతపై అవగాహన పెంచేందుకు కృషి చేశారన్నారు. ఈవేళ రాష్ట్రాలు ఇంత బలంగా, స్వతంత్ర వ్యవహారశైలితో ఉన్నాయంటే ఆనాడు ఎన్‌టీఆర్ నేతృత్వంలో చేసిన కృషే అందుకు కారణమన్నారు. అలాగే అప్పటిదాకా పెత్తందారుల చేతుల్లో బందీ అయిన రాజకీయాన్ని సామాన్యుల చెంతకు ఆయన తీసుకెళ్లారన్నారు. ఎన్నికల్లో ప్రజాభిమానాన్ని తప్ప డబ్బును ఏరోజూ ఆయన నమ్ముకోలేదన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో ఒక్క ఓటుకు పంచుతారని చెబుతున్న డబ్బుతో ఎన్‌టీఆర్ ఎమ్మెల్యేల్ని గెలిపించారన్నారు. అవినీతిని ఆయన అసహ్యించుకునేవారన్నారు. ప్రజాధనాన్ని ఎంతో పవిత్రంగా ఖర్చు చేశారని తెలిపారు. సామాన్యుల అవసరాల కోసం వేల కోట్లను అలవోకగా కేటాయించిన ఎన్‌టీఆర్.. ముఖ్యమంత్రిగా అవసరమైన సందర్భాల్లో కూడా తన సౌకర్యం కోసం రూపాయి ఖర్చు చేయాలంటే వెనుకాడేవారని, ఖజానాను ఎంతో పొదుపుగా వినియోగిస్తూ వ్యక్తిగతంగా నిరాడంబరంగా ఉండేవారన్నారు.

ఫెడరలిజాన్ని విస్తరించి రాష్ట్రాలను బలోపేతం చేయటం, దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టటానికి ముందే వాటిని రాష్ట్రంలో అమలుచేయటం, పెత్తందారుల రాజకీయాన్ని సామాన్య ప్రజల రాజకీయంగా మార్చటం, స్థానిక ప్రభుత్వాల్లో ప్రత్యక్ష ఎన్నికలు, ప్రజల వద్దకు పాలన.. ఇలా ఎన్నో ఫలితాల్ని రామారావు సాధించి చూపారన్నారు. లోక్‌నాయక్ జేపీ, ఎన్‌టీఆర్‌ల అసంపూర్ణ కృషిని కొనసాగించి ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా పద్ధతి మొదలైన ఎన్నికల సంస్కరణల్ని, అధికార వికేంద్రీకరణ, అవినీతి నియంత్రణకు పకడ్బందీ సంస్థాగత ఏర్పాట్లు, ఇతర మార్పుల్ని మనం సాధించుకోవాలని జేపీ విజ్ఞప్తి చేశారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th October, 2022 Posting Date 15 &16th of every month



# ఆరోగ్యంలో అమెరికా నమూనాను అనుకరించొద్దు

భారతదేశం ప్రస్తుతం అమెరికా ఆరోగ్య సేవల నమూనాను అనుకరిస్తోంది. ఆరోగ్య సమస్య రాగానే మొదటి సంప్రదింపుకి స్పెషలిస్ట్ దగ్గరకి వెళ్లటమే మార్గంగా ఉంది. ఇది విజ్ఞత గల ప్రభుత్వ వ్యయం కాదు. ఖర్చుకు తగ్గ ఫలితం రాదు. దీనివల్ల, ప్రజలు జేబుల్లో నుంచి ఎక్కువ ఖర్చు చేస్తూ తక్కువ ఆరోగ్యం పొందుతున్నారు. పౌరులకు అందుబాటులో, చౌకయిన, విశ్వసించదగిన, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించటానికి, వ్యవస్థను సమర్థవంతంగా, వ్యయానికి తగ్గ ఫలితాలనిచ్చేలా చేయటానికి.. మన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థపై పునస్సమీక్ష తప్పనిసరి. ప్రభుత్వం ప్రాథమిక వైద్యంపై ఎక్కువ కేంద్రీకరించటం మొత్తం ఆరోగ్య రంగ వ్యయాన్ని తగ్గిస్తుందని, వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుందని అనేక ఫలితాలు తెలియచెబుతున్నాయి. రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బులు, క్యాన్సర్ వంటి అసాంక్రమిక వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో.. అవి దీర్ఘకాలికంగా, భవిష్యత్తు సమస్యలుగా మారకుండా, తీవ్ర అనారోగ్యాల దశకు చేరకుండా ప్రాథమిక వైద్య స్థాయిలో తీసుకునే చర్యలు నివారిస్తాయి. ఈ నేపథ్యంలోనే ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా సమగ్ర ఆరోగ్య పత్రం ప్రాథమిక స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రతిపాదిపాదించింది. ప్రయివేటు తరహాలో ఇందులో డాక్టర్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ, ప్రజలకు తాము నమ్మిన, తమకు నచ్చిన డాక్టర్‌ని ఎంపిక చేసుకునే అవకాశం ఉంటాయి. ద్వితీయ, తృతీయ స్థాయి వైద్య సేవలతో అనుసంధానమైన పటిష్ఠమైన ఈ ఫ్యామిలీ డాక్టర్ ప్రాథమిక వైద్య వ్యవస్థ.. ఆరోగ్య రంగంలో వ్యయాల్ని అదుపు చేయగలదు, అదే సమయంలో ప్రజలకు ఎటువంటి జేబుఖర్చూ లేకుండా ఆరోగ్యాన్ని అందించగలదు. ప్రభుత్వం మీదా పెద్ద భారం ఉండదు, కొద్దిపాటి అదనపు వనరుల్ని సమకూరిస్తే చాలు.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**